thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. No. TELTEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

చురకలు

Published From Jagital, Hyderabad, Adilabad, Warangal

| సంపుటి : 21 | సంచిక : 203 | జగిత్యాల గురువారం 05 నవంబర్, 2026 | ఎడిటర్ : మొహ్మద్ ఇమ్రాన్| పేజీలు 12 + 8 జిల్లా అనుబంధం | వెల : 1.00 |

ఆక్లాండ్‌లో 'కింగ్' కోహ్లీ విధ్వంసం!



11

ఏడాదిలో మళ్లీ కేసీఆర్ సర్కారే!

- అభివృద్ధిని చూసే నగర ప్రజలు మమ్మల్ని గెలిపించారు
- కాంగ్రెస్ ఇచ్చిన అబద్ధపు హామీలకు పల్లెలు మోసపోయాయి
- చిత్తశుద్ధి ఉంటే మియాపూర్ భూములను అమరవీరులకు ఇవ్వాలి
- రాష్ట్రంలో పడిపోయిన స్థిరాస్తి వ్యాపారం
- బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ 2



కాంగ్రెస్ సర్కారు వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



- రైతు గర్జన స్ఫూర్తితో పోరాడాలి!
- బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ దిశానిర్దేశం
- తెలంగాణ భవన్‌లో పలువురి చేరికలు

వివరాలు 3లో..



సదర్..

తెలంగాణ ఆత్మగౌరవం

రాష్ట్ర పండుగగా గుర్తింపు.. 5 కోట్ల నిధుల కేటాయింపు

- జనాభా ప్రాతిపదికన యాదవులకు సముచిత స్థానం
- దేశానికే ఆదర్శంగా మన కులగణన విధానం
- గతంలో గోల్కొండ కోట పేరు గొల్లకొండనే!
- నగర అభివృద్ధిలో యాదవుల పాత్ర అమోఘం
- సదర్ సమ్మేళనంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- వేడుకల్లో పాల్గొన్న తేజస్వీ యాదవ్, దత్తాత్రేయ..

హైదరాబాద్, నవంబర్ 4 (చురకలు): సదర్ సమ్మేళనం కేవలం యాదవులకే పరిమితం కాదని, అది యావత్ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. నగరంలోని ఎన్టీఆర్ స్టేడియంలో అట్టహాసంగా నిర్వహించిన శ్రీకృష్ణ సదర్ సమ్మేళనానికి ముఖ్యమంత్రి ముఖ్య అతిథిగా హాజరై యాదవులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో సదర్ సమ్మేళనాన్ని అధికారికంగా నిర్వహించలేదని గుర్తుచేసిన ఆయన.. తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే యాదవుల విజ్ఞప్తి మేరకు దీనిని రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ అధికారిక ఉత్సవంగా నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ఈ వేడుకల నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా 5 కోట్ల రూపాయల నిధులు విడుదల చేసిందని ముఖ్యమంత్రి వెల్లడించారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా శాస్త్రీయ పద్ధతిలో కులగణన నిర్వహించి తెలంగాణ మోడల్‌ను దేశానికి పరిచయం చేశామని ముఖ్యమంత్రి గుర్తుచేశారు. సమాజంలోని అన్ని వర్గాలకు

మిగతా 2 లో

యాదవుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే 'సదర్ సమ్మేళనం' కేవలం ఒక వర్గానికే పరిమితం కాదని, అది యావత్ తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి సజీవ సాక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉద్ఘాటించారు. సదర్ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా గుర్తించడంతో పాటు, ఐదు కోట్ల రూపాయల నిధులతో అధికారికంగా నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. ఎన్టీఆర్ స్టేడియం వేదికగా జరిగిన అఖిల భారత సమ్మేళనంలో పాల్గొన్న ముఖ్యమంత్రి.. యాదవుల గొప్పదనాన్ని నగర అభివృద్ధిలో వారి పాత్రను వేనోళ్ల పొగిడారు. ఒకప్పటి 'గొల్లకొండ' ప్రాంతమే నేటి గోల్కొండ కోటగా మారిందని, విశ్వనగరంగా తీర్చిదిద్దడంలో యాదవ సోదరుల కృషి ఎంతో ఉందని ఆయన కొనియాడారు.



పిల్లలు మెచ్చిన రంగుల్లోనే దుస్తులు!

విద్యార్థుల అభిప్రాయాలు సేకరించాలి

సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం

మోదీ దేశద్రోహి..

5 నిమిషాల్లో నిరూపిస్తా!

- ప్రధానితో ముఖాముఖి చర్చకు రాహుల్ గాంధీ సవాల్
- మోదీని నియంత్రిస్తున్నది అమెరికా అధ్యక్షుడు ట్రంపే
- అదానీ పోర్టులో పట్టుబడిన మత్తు పదార్థాలు ఏమయ్యాయి?
- పంజాబ్‌లో జరిగిన కాంగ్రెస్ సభలో అగ్రనేత నిలదీత

ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. మోదీ దేశద్రోహి అని, ఆయన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నియంత్రిస్తున్నారని విమర్శించారు. దమ్ముంటే తనతో ముఖాముఖి చర్చకు రావాలని, కేవలం ఐదు నిమిషాల్లోనే ఈ విషయాన్ని నిరూపిస్తానని సవాల్ విసిరారు.



2

ఓటమి భయంతోనే సంస్థలపై నిందలు!

కాంగ్రెస్ అబద్ధాలను తిప్పికొట్టాలి

- జాబితా సవరణ ఈ ప్రభుత్వం కొత్తగా తెచ్చింది కాదు
- ఇరవై ఏళ్ల తర్వాత ప్రక్షాళన చేపట్టిన ఎన్నికల సంఘం

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు

వివరాలు 3లో..





గనుల రంగంలో స్వయం సమృద్ధి లక్ష్యం!

- క్రిటికల్ మినరల్స్ ప్రాసెసింగ్ సామర్థ్యం పెంపునకు కేంద్రం చర్యలు
- రూ.2,814 కోట్లతో క్యాపెక్స్ సపోర్ట్ స్కీమ్‌కు కేబినెట్ ఆమోదం

2

వికసిత భారత్ ప్రయాణంలో గనుల రంగం కీలక పాత్ర పోషించనుందని, ముఖ్యంగా అత్యంత అవసరమైన ఖనిజాల (క్రిటికల్ మినరల్స్) బిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, ఆత్మనిర్భరత సాధించేందుకు కృషి చేయాల్సి ఉందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు.

ఫాం 6 ద్వారా మళ్లీ ఓటరుగా నమోదుకండి

ప్రధాన ఎన్నికల సంఘం



4

ఎన్నికల కమిషనర్లు చట్టానికి అతీతులా?

జీవితకాల చట్టపరమైన రక్షణపై సుప్రీంకోర్టులో కీలక విచారణ




ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఇతర ఎన్నికల కమిషనర్లకు జీవితకాల చట్టపరమైన రక్షణ కల్పించే నిబంధనను సవాలు చేస్తూ భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లపై కీలక విచారణ జరిగింది.

4

రూ.400 కోట్ల సైబర్ వల!

నలుగురిని అరెస్టు చేసిన హైదరాబాద్ ఈడీ

3



ముంచెత్తిన 'మురసు'.. అన్నదాతకు కన్నీళ్లు!



సురక్షితంగా రక్షణ దళం!


3

- చేతికొచ్చిన పంటలు వరద పాలు..
- ఉప్పొంగిన వాగులు.. కట్టలు తెంచుకున్న చెరువులు
- తక్షణమే ఆదుకోవాలని రైతుల వేడుకోలు

అవినీతి ఊబిలో అధికారి!

ఏసీబీ వలలో మెప్మా అదనపు సంచాలకుడు

3



మోదీ దేశద్రోహి అని 5 నిమిషాల్లో నిరూపిస్తా!

ప్రధానితో ముఖాముఖి చర్చకు రాహుల్ గాంధీ సవాల్

మోదీని నియంత్రిస్తున్నది అమెరికా అధ్యక్షుడు ట్రంపే

అదానీ పోర్టులో పట్టుబడిన మత్తు పదార్థాలు ఏమయ్యాయి?

పంజాబ్‌లో జరిగిన కాంగ్రెస్ సభలో అగ్రనేత నిలదీత



సంగ్రూర్, నవంబర్ 5 : ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. మోదీ దేశద్రోహి అని, ఆయన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నియంత్రిస్తున్నారని విమర్శించారు. దమ్ముంటే తనతో ముఖాముఖి చర్చకు రావాలని, కేవలం ఐదు నిమిషాల్లోనే ఈ విషయాన్ని నిరూపిస్తానని సవాల్ విసిరారు. పంజాబ్‌లోని సంగ్రూర్‌లో బుధవారం నిర్వహించిన భారీ సభలో ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం ఏడాదిలోపే కుప్పకూలిపోతుందని జోస్యం చెప్పారు. ప్రధాని మోదీతో బహిరంగ చర్చకు తాను ఎప్పుడూ సిద్ధమేనని రాహుల్ స్పష్టం చేశారు. చర్చకు మధ్యవర్తిగా ఎవరిని కూర్చోబెట్టినా తనకు అభ్యంతరం లేదన్నారు. చట్టసభల్లో చర్చిద్దామని అధికార పక్ష నేతలు చెబుతున్నారని, కానీ లోక్‌సభలో తాను మాట్లాడేందుకు కనీస అవకాశం ఇవ్వకుండా అడుగడుగునా మైక్ కట్ చేస్తున్నారని ఆరోపించారు.

ఆ డ్రగ్స్ ఏమయ్యాయి..

దేశం నుంచి మాదకద్రవ్యాలను నిర్మూలించేందుకు కేంద్ర హోంమంత్రి అమిత్ షా మూడేళ్ల గడువు విధించడంపై రాహుల్ ఎద్దేవా చేశారు. ఆ సమయానికి ఆయన అసలు ఆ పదవిలో ఉంటారో లేదోనని వ్యాఖ్యానించారు. గుజరాత్‌లోని అదానీ పోర్టులో గతంలో పట్టుబడిన వేల కిలోల హెరాయిన్ ఏమైందో జాతికి వివరించాలని డిమాండ్ చేశారు. నేరగాళ్లకు అమిత్ షా అండగా నిలుస్తున్నారని ఆరోపించారు. శాంతిభద్రతల గురించి మాట్లాడే ముందు మణిపూర్ పరిస్థితులపై ఆయన సమాధానం చెప్పాలని నిలదీశారు. పంజాబ్‌లో శాంతిభద్రతల పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉందని రాహుల్ పేర్కొన్నారు. ప్రముఖ గాయకుడు సిద్ధూ మూసేవాలాను బహిరంగంగా హత్య చేయడం తనను తీవ్రంగా కలచివేసిందన్నారు. ఢిల్లీ నుంచి పాలన సాగించే ఆమ్ ఆద్మీ పార్టీతో రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం లేదన్నారు. యువతకు ఉపాధి కల్పించడం, రాష్ట్రాన్ని మాదకద్రవ్య రహితంగా మార్చడం కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమని, ప్రజలు తమకే మద్దతివ్వాలని ఆయన పిలుపునిచ్చారు.

గనుల రంగంలో స్వయం సమృద్ధి లక్ష్యం!

క్రిటికల్ మినరల్స్ ప్రాసెసింగ్ సామర్థ్యం పెంపునకు చర్యలు

రూ.2,814 కోట్లతో క్యాపెక్స్ సపోర్ట్ స్కీమ్‌కు కేబినెట్ ఆమోదం

దాదాపు పదివేల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం

ఏటా 25 వేల కోట్ల విలువైన మినరల్స్ ఉత్పత్తి :కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ, నవంబర్ 4 (చురకలు) : వికసిత భారత్ ప్రయాణంలో గనుల రంగం కీలక పాత్ర పోషించనుందని, ముఖ్యంగా అత్యంత అవసరమైన ఖనిజాల (క్రిటికల్ మినరల్స్) దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి, ఆత్మనిర్భరత సాధించేందుకు కృషి చేయాల్సి ఉందని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. దేశంలో లిథియం, నికెల్ లాంటి ఖనిజాల ప్రాసెసింగ్ సామర్థ్యాన్ని మరింత పెంచేందుకు రూ.2,814 కోట్లతో కేంద్ర గనుల శాఖ తీసుకురానున్న 'క్యాపెక్స్ సపోర్ట్ స్కీమ్'కు ప్రధాని మోదీ అధ్యక్షతన జరిగిన కేబినెట్ సమావేశం ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా ప్రధానికి కిషన్‌రెడ్డి ఒక ప్రకటనలో ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

గణనీయంగా దిగుమతుల భారం..



కొత్త ప్రోత్సాహక పథకం ద్వారా దాదాపు రూ.10 వేల కోట్ల పెట్టుబడులు రానున్నాయని, ఏటా రూ.25,000 కోట్ల విలువైన ఖనిజాలు ఉత్పత్తి అవుతాయని మంత్రి అంచనా వేశారు. ఈ పథకం ద్వారా ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు బ్యాటరీలు, స్వచ్ఛ విద్యుత్ తదితర కార్యక్రమాలకు అవసరమైన ముడి ఖనిజాలను అందించేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. ఫోన్లు, బ్యాటరీల తయారీలో అత్యంత కీలకమైన లిథియం, నికెల్ కోసం పూర్తిగా దిగుమతులపై ఆధారపడుతున్నామని, 2017-18లో రూ.6,500 కోట్లుగా ఉన్న లిథియం దిగుమతుల భారం ప్రస్తుతం రూ.50,000 కోట్లకు పెరిగిందని ఆయన వివరించారు.

విదేశాల్లో గనుల కొనుగోలు..

ఖనిజాల దిగుమతులపై ఇప్పటికే సుంకం ఎత్తేశామని, తొలిసారిగా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్, ఒడిశా రాష్ట్రాల్లో నాలుగు ప్రాసెసింగ్ పార్కులను ఏర్పాటు చేస్తున్నామని కిషన్‌రెడ్డి చెప్పారు. ఆత్మనిర్భరత సాధించేందుకు ప్రభుత్వ రంగ సంస్థ ద్వారా అర్జెంటీనాలో ఐదు లిథియం గనులను కొనుగోలు చేశామన్నారు. దేశంలో 901 అన్వేషణ ప్రాజెక్టులను చేపట్టామని, 56 బ్లాకులను విజయవంతంగా వేలం వేశామని తెలిపారు. ఖనిజాల రీసైక్లింగ్‌ను ప్రోత్సహించేందుకు రూ.1,500 కోట్లతో ప్రారంభించిన పథకానికి విశేష స్పందన లభిస్తోందని మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడించారు.

సదర్.. తెలంగాణ ఆత్మగౌరవం!

(మొదటి పేజీ తరువాయి..)

ఎవరెంత ఉంటే వారికి అంత శాతం వాటా కల్పించాలన్న లక్ష్యంతోనే ఈ కులగణన చేపట్టామన్నారు. తమ ప్రభుత్వం యాదవ సామాజిక వర్గానికి రాజకీయంగా, సామాజికంగా తగిన ప్రాధాన్యం కల్పిస్తోందని వివరించారు. అనిల్‌కుమార్ యాదవ్‌కు రాజ్యసభ సభ్యుడిగా, నవీన్ యాదవ్‌కు ఎమ్మెల్యేగా అవకాశం కల్పించామని.. అలాగే ఈశ్వరమ్మ యాదవ్‌ను యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం బోర్డు సభ్యురాలిగా నియమించడంతో పాటు అక్కడి గోశాల బాధ్యతలను సైతం అప్పగించామని తెలిపారు. రాబోయే రోజుల్లో జనాభా ప్రాతిపదికన యాదవులకు తగిన వాటా కల్పించి వారి ఆత్మగౌరవానికి భంగం కలగకుండా చూసే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు.

గొల్లకొండ నుంచి విశ్వనగరం దాకా..

ప్రస్తుతం మనం గోల్కొండ కోటగా పిలుస్తున్న ప్రాంతానికి గతంలో 'గొల్లకొండ'గా పేరుండేదని రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేశారు. హైదరాబాద్ నగరం జాతీయస్థాయిలో పేరు ప్రతిష్ఠలు సాధించి విశ్వనగరంగా ఎదగడంలో యాదవుల పాత్ర ఎంతో ఉందంటూ ప్రశంసించారు. ఉపాధి కోసం నగరానికి వచ్చిన వివిధ ప్రాంతాల ప్రజలను వారు ఆదరించి అక్కున చేర్చుకున్నారని, శాంతిభద్రతలను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. తెలంగాణను దేశంలోనే అభివృద్ధి చెందిన ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. మూసీ పునరుజ్జీవం, మెట్రో రైలు విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు, భారత్ ఫ్యూచర్ సిటీ లాంటి బృహత్తర ప్రాజెక్టులతో మరింత అభివృద్ధి సాధించనున్నామని.. ఈ అభివృద్ధి యజ్ఞంలో యాదవులు ప్రభుత్వానికి పూర్తి స్థాయిలో సహకరించాలని కోరారు.



సమ్మేళనంలో ప్రముఖుల సందడి..

యాదవుల సాంస్కృతిక వారసత్వాన్ని చాటిచెప్పే ఈ వేడుకల్లో బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వీ యాదవ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఉత్తరప్రదేశ్ ఎంపీ ధర్మేంద్ర యాదవ్, స్థానిక ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, మల్లు రవి, సదర్ ఉత్సవ కమిటీ చైర్మన్ అంజన్‌కుమార్ యాదవ్‌తో పాటు పలు రాష్ట్రాలకు చెందిన యాదవ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ సమ్మేళనంలో ఉత్సాహంగా పాల్గొన్నారు

పిల్లలు మెచ్చిన రంగుల్లోనే దుస్తులు!

- **విద్యార్థుల అభిప్రాయాలు సేకరించాలి**
- **వారు కోరుకునే ఆకృతులకే ప్రాధాన్యం ఇవ్వాలి**
- **వచ్చే ఏడాదికి ఇప్పుడే విధివిధానాలు ఖరారు**
- **బడి తెరిచేనాటికే పిల్లలకు సామగ్రి అందాలి**
- **అధికారుల సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం**

హైదరాబాద్, నవంబర్ 4 (చురకలు) : ప్రభుత్వ బడుల విద్యార్థులకు అందజేసిన పాఠశాల దుస్తులపై వారి నుంచి అభిప్రాయాలు సేకరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇలా అభిప్రాయాలు సేకరించడం వల్ల భవిష్యత్తులో ఎక్కువ మంది విద్యార్థులు కోరుకునే రంగులు, ఆకృతులకు ప్రాధాన్యం ఇవ్వవచ్చని ఆయన సూచించారు. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలోని బోధి పెవిలియన్లో వివిధ శాఖల పరిధిలోని ప్రభుత్వ వసతిగృహాలు, గురుకులాలు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దుస్తులు, ఇతర సామగ్రి పంపిణీపై ముఖ్యమంత్రి ప్రత్యేక సమీక్ష నిర్వహించారు.

గతానికంటే నాణ్యంగా..

గతంతో పోలిస్తే ఎంతో నాణ్యమైన దుస్తులను, ఆకర్షణీయమైన రంగులు, ఆకృతులతో విద్యార్థులకు అందజేశామని రేవంత్ రెడ్డి తెలిపారు. దుస్తులతో పాటు టైలు, బెల్టులు, గుర్తింపు కార్డులు, బూట్లు, మేజోళ్లు, ప్లేట్లు, గ్లాసులు, కటోరాలు, తివాచీలు, బడి సంచుల పంపిణీ దాదాపు పూర్తయిందని ఈ సమావేశంలో అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఒకట్రెండు సంస్థల పరిధిలో కొన్ని వస్తువుల పంపిణీ 95 శాతం వరకు పూర్తయిందని వివరించగా.. ఆ వస్తువుల పంపిణీని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

బడి తెరిచే నాటికే చేతికి..

వచ్చే ఏడాదికి విద్యార్థులకు అందజేసే దుస్తులు, ఇతర సామగ్రికి సంబంధించి విధివిధానాలను ఇప్పుడే రూపొందించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. విద్యార్థులకు అందజేసే వస్తువుల జాబితా రూపకల్పన నుంచి.. టెండర్లు, సరఫరా, పంపిణీ వరకు ప్రతిదీ నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. పాఠశాలలు తెరిచిన రోజునే మొత్తం వస్తువులు పిల్లలకు అందేలా ఇప్పటినుంచే పక్కా కార్యాచరణ సిద్ధం చేయాలన్నారు. ఈ సమీక్షలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి ఎన్ శ్రీధర్, సంక్షేమ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సబ్యసాచి ఘోష్, రాష్ట్ర గిరిజన, వెనుకబడిన తరగతుల శాఖల ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జా, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.





కరువు భత్యం పెంపుపై హర్షం!

- **ఉప ముఖ్యమంత్రి భట్టికి విద్యుత్ ఉద్యోగుల కృతజ్ఞతలు**
- **వేతన సవరణ ప్రక్రియ వేగవంతానికి ప్రభుత్వ హామీ**
- **యాసంగిలోనూ నిరంతర విద్యుత్ ఇస్తామన్న నేతలు**
- **రికార్డు డిమాండ్‌ను అధిగమించిన సిబ్బందికి భట్టి ప్రశంసలు**

హైదరాబాద్, నవంబర్ 4 (చురకలు) : విద్యుత్ ఉద్యోగులకు కరువు భత్యం పెంపునకు ఆమోదం తెలపడంపై కార్మిక సంఘాల నాయకులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. కార్మిక నేతల బృందం బుధవారం ప్రజాభవన్‌లో ఆయనను కలిసి ప్రభుత్వ నిర్ణయంపై హర్షం వ్యక్తం చేసింది. జూలై నుంచి అమల్లోకి వచ్చేలా 2.543 శాతం కరువు భత్యం పెంపునకు ప్రభుత్వం ఆమోదం తెలపడంతో.. మొత్తం భత్యం 19.272 నుంచి 21.815 శాతానికి పెరిగిందని నాయకులు వివరించారు. విద్యుత్ రంగంలో పనిచేస్తున్న క్షేత్రస్థాయి సిబ్బంది సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించినందుకు ఉప ముఖ్యమంత్రికి వారు ధన్యవాదాలు తెలిపారు. సెలవులు, గ్రాట్యుటీ, పదోన్నతుల సమస్యలపై దృష్టి సారించాలని విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణీ సంస్థలను ఆయన ఆదేశించారు. తీవ్ర వాతావరణ మార్పుల వల్ల రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ 20,018 మెగావాట్లకు పైగా గరిష్ఠ స్థాయికి చేరుకున్నా.. కోతలు లేకుండా చూసిన ఇంజినీర్లు, సిబ్బంది సమష్టి కృషిని ఈ సందర్భంగా భట్టి విక్రమార్క ప్రత్యేకంగా ప్రశంసించారు. ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి నూతన వేతన సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని నాయకులు కోరగా.. ఉప ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. రానున్న యాసంగిలోనూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా అంకితభావంతో పనిచేస్తామని నాయకులు ప్రభుత్వానికి హామీ ఇచ్చారు. ఉప ముఖ్యమంత్రిని కలిసిన వారిలో విద్యుత్ ఉద్యోగుల ఐక్య కార్యాచరణ సమితి నేతలు సదానందం, రత్నాకర్ రావు, శ్రీధర్, వెంకటేశ్వర్లు, వజీర్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ ఇళ్లల్లో దీపావళి వెలుగులు!

ఇప్పటికే పూర్తయిన 2,21,500 గృహప్రవేశాలు

పండుగ రోజు పేదల ఆనందంలో భాగస్వాములు కావాలి

అన్ని నగరాల్లోనూ ఐదంతస్తుల ఇందిరమ్మ భవనాలు

ప్రతి సోమవారం లబ్ధిదారుల ఖాతాల్లోకి నేరుగా డబ్బులు

గోడపత్రిక ఆవిష్కరించిన మంత్రులు పొంగులేటి, శ్రీధర్‌బాబు

మేడ్చల్ మల్కాజ్‌గిరి, నవంబర్ 4 (చురకలు) : రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇప్పటివరకు ఏకంగా 2,21,500 గృహప్రవేశాలు పూర్తయ్యాయని రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఈ దీపావళి పండుగను ప్రతి ఇందిరమ్మ ఇంట్లో అత్యంత ఘనంగా జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కేంద్రంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి, సమాచార సాంకేతిక శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి ఆయన మాట్లాడారు. పండుగ రోజున పేదల ఇంట్లో వెలిగే ప్రతి దీపం ప్రజా ప్రభుత్వ సంకల్పానికి ప్రతీకగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు. కొత్త ఇళ్లల్లోకి వెళ్లిన వారి ఆనందంలో పాలుపంచుకునేందుకు దీపావళి రోజున ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు ఆయా ఇళ్లకు వెళ్లాలని కోరారు. దీనికి సూచికగా 'మా ఇందిరమ్మ ఇంట్లో దీపావళి వేడుకలు' అనే గోడపత్రికను మంత్రి శ్రీధర్‌బాబుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ప్రభుత్వానికి ఎన్ని ఆర్థిక అవరోధాలు ఉన్నప్పటికీ పేదల ఆత్మగౌరవానికి చిహ్నమైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపేది లేదని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. పేదలకు భద్రత, భరోసా కల్పించాలన్న సంకల్పంతో తొలి విడతలో 4.50 లక్షల ఇళ్లు మంజూరు చేశామన్నారు. అందులో ఇప్పటికే 2,21,500 ఇళ్లలో గృహప్రవేశాలు పూర్తవగా.. మరో 1.90 లక్షల ఇళ్లు వివిధ నిర్మాణ దశల్లో ముగింపు దశకు చేరుకున్నాయని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ.40 వేల కోట్లతో చేపడుతున్న ఈ బృహత్తర కార్యక్రమానికి నిధుల కొరత రానీయబోమన్నారు. లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా ప్రతి సోమవారం నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకే అవినీతి రహితంగా నిధులు జమ చేస్తున్నట్లు వెల్లడించారు. తొలి విడత 4.50 లక్షల ఇళ్లకు అదనంగా రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లతో పాటు హైదరాబాద్ నగర ప్రధాన ప్రాంతంలో లక్ష ఇళ్లను మంజూరు చేశామని మంత్రి చెప్పారు. స్థలాల కొరతను అధిగమించేందుకు హైదరాబాద్ నగర తరహాలోనే నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్గొండ నగరాల్లో కూడా ఐదంతస్తుల ఇందిరమ్మ భవన సముదాయాలు నిర్మిస్తామని ప్రకటించారు. ఈ నిర్మాణాలకు సంబంధించి దీపావళిలోగా అధికారిక ప్రకటన జారీ చేస్తామన్నారు. వచ్చే ఏడాది బోనాల పండుగ నాటికి హైదరాబాద్‌లోని సముదాయాల నుంచి బోనాలు ఎత్తిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేవలం నగరాలు, పట్టణాల్లోనే కాకుండా మారుమూల పల్లెలు, తండాల్లో కూడా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని.. దీంతో నిరుపేదల సొంతింటి కల సాకారమవుతోందని మంత్రి పొంగులేటి హర్షం వ్యక్తం చేశారు.



గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పశుసంపదే మూలం!

హైదరాబాద్, నవంబర్ 4 (చురకలు) : గ్రామీణ వ్యవసాయ ఆధారిత ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావాలంటే పశుసంపదను గౌరవించి, వృద్ధి చేసుకోవాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన సదర్ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ ఉత్సవాలను ఇంత భారీ స్థాయిలో నిర్వహించిన సీనియర్ నేత అంజన్ కుమార్ యాదవ్‌తో పాటు కమిటీ సభ్యులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. సదర్ ఉత్సవాల ప్రాధాన్యాన్ని గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం దీనికి రాష్ట్ర పండుగ హోదా కల్పించిందని భట్టి గుర్తుచేశారు. కేవలం హైదరాబాద్‌కే పరిమితం కాకుండా అన్ని జిల్లా కేంద్రాల్లోనూ అధికారికంగా నిధులు ఇచ్చి ఉత్సవాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ఆధ్వర్యంలో పశుసంపద పెంపునకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రెండుసార్లు పార్లమెంటు సభ్యుడిగా పనిచేసిన అంజన్ కుమార్ యాదవ్.. ప్రజలతో మమేకమై ఈ ఉత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించడం అభినందనీయమన్నారు. మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే సదర్ ఉత్సవాలు ఏటా మరింత వైభవంగా జరగాలని ఆయన ఆకాంక్షించారు.

ఏడాదిలో మళ్లీ కేసీఆర్ సర్కారే!

- అభివృద్ధిని చూసే నగర ప్రజలు మమ్మల్ని గెలిపించారు
- కాంగ్రెస్ ఇచ్చిన అబద్ధపు హామీలకు పల్లెలు మోసపోయాయి
- మియాపూర్ భూములను అమరవీరులకు ఇవ్వాలి
- రాష్ట్రంలో పూర్తిగా పడిపోయిన స్థిరాస్తి వ్యాపారం
- బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్



హైదరాబాద్, నవంబర్ 4 (చురకలు) : గత ఎన్నికల్లో నగర ప్రజలు కాంగ్రెస్‌ను తిరస్కరించి బీఆర్ఎస్‌కే పట్టం కట్టారని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ స్పష్టం చేశారు. నగరంలో తాము చేసిన అభివృద్ధిని గుర్తించే ప్రజలు తమ అభ్యర్థులను గెలిపించారని పేర్కొన్నారు. జూబ్లీ రింగు రోడ్డు అవతల కాంగ్రెస్ ఇచ్చిన అబద్ధపు హామీలను నమ్మి పల్లెల్లో ప్రజలు ఆ పార్టీకి ఓటు వేశారని విమర్శించారు. బుధవారం తెలంగాణ భవన్‌లో పలువురు కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు.

అమరవీరులకు స్థలాలివ్వాలి..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలు కోటలు దాటుతున్నాయని కేటీఆర్ ఎద్దేవా చేశారు. మియాపూర్ ప్రభుత్వ భూముల వ్యవహారంలో బీఆర్ఎస్ పోరాటం వల్లే విజయం సాధించామన్నారు. ముఖ్యమంత్రికి నిజంగా చిత్తశుద్ధి ఉంటే మియాపూర్ భూముల్లో తెలంగాణ అమరవీరులకు స్థలాలు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎర్రవల్లిలో కాకుండా నగరంలోనే వారికి స్థలాలు ఇస్తే తాము స్వాగతిస్తామని స్పష్టం చేశారు.

స్థిరాస్తి రంగం స్తంభన..

గత మూడేళ్లలో ఒక్క కొత్త ఇల్లు కూడా నిర్మించలేదని కేటీఆర్ విమర్శించారు. హైదరాబాద్‌లో పెద్ద మొత్తంలో భూములను నిషేధిత జాబితాలో చేర్చారన్నారు. దీంతో స్థిరాస్తి (రియల్ ఎస్టేట్) వ్యాపారం పూర్తిగా కుదేలైందని ఆరోపించారు. మరో ఏడాదిలో కేసీఆర్ మళ్లీ అధికారంలోకి వస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఆక్రమణల్లో ఉన్న భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామని కేటీఆర్ హెచ్చరించారు.

ముంచెత్తిన 'మురసు'.. అన్నదాతకు కన్నీళ్లు!

- అశ్వారావుపేట మండలంలో విరుచుకుపడ్డ వానమ్మ
- చేతికొచ్చిన పంటలు వరద పాలు.. చేల్లో ఇసుక మేటలు
- ఉప్పొంగిన వాగులు.. కట్టలు తెంచుకున్న చెరువులు
- ఇళ్లలోకి చేరిన వరద.. జలదిగ్బంధంలో పలు గ్రామాలు
- తక్షణమే ఆదుకోవాలని ప్రభుత్వానికి రైతుల వేడుకోలు



అశ్వారావుపేట, నవంబర్ 4 (చురకలు) : 'మురసు' తుఫాను భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తీవ్ర బీభత్సాన్ని సృష్టించింది. ముఖ్యంగా అశ్వారావుపేట మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని భారీ వర్షాలతో జనజీవనం పూర్తిగా అతలాకుతలమైంది. ఉప్పొంగిన వాగులు, వంకలతో పల్లెలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఎంతో కష్టపడి సాగు చేసిన పంటలు కోతకు వచ్చే సమయంలో ప్రకృతి విపత్తు రూపంలో విరుచుకుపడటంతో అన్నదాతల ఆశలు ఆవిరయ్యాయి.

నీటిపాలైన రైతన్న కష్టం..

భీకర వర్షాలకు మండలంలోని అనేక గ్రామాల్లో వ్యవసాయ భూములు పూర్తిగా నీట మునిగిపోయాయి. అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టిన వరి, మినుము, కంది, వేరుశెనగ పంటలు వరద ప్రవాహానికి కొట్టుకుపోయాయి. మరికొన్ని చోట్ల చేల్లోకి భారీగా ఇసుక మేటలు చేరి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఎటుచూసినా నిండుగా నిలిచిన వరద నీరే కనిపిస్తుండటంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఇప్పటికే చేసిన అప్పులు భారంగా మారగా.. తాజా నష్టం తమను మరింత కుంగదీస్తుందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్తంభించిన రాకపోకలు..

వాగులు, చెరువులు పొంగిపొర్లుతుండటంతో పలు వంతెనల పైనుంచి ఉధృతంగా వరద ప్రవహిస్తోంది. దీంతో అనేక గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. కొన్ని ప్రాంతాల్లో రోడ్లు కోతకు గురయ్యాయి. మండలంలోని పలు గ్రామాల్లో ఇళ్లలోకి వరద నీరు చేరడంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. నీరు వెళ్లేందుకు సరైన మార్గాలు లేక రహదారులన్నీ చెరువులను తలపిస్తున్నాయి. అత్యవసర పనులపై బయటకు వెళ్లాల్సిన వారు సైతం మార్గమధ్యంలోనే నిలిచిపోవాల్సి వస్తోంది.

ఆదుకోవాలని వేడుకోలు..

ప్రకృతి ప్రకోపానికి సర్వస్వం కోల్పోయిన తమను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని వరద బాధితులు కోరుతున్నారు. జిల్లా కలెక్టర్, స్థానిక ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పర్యటించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. నీట మునిగిన పంటలను పరిశీలించి నష్టాన్ని అంచనా వేయాలని, ఇళ్లలోకి నీరు చేరిన కుటుంబాలకు తక్షణ సహాయం అందించాలని డిమాండ్ చేస్తున్నారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన తమకు నష్టపరిహారం అందించి అండగా నిలవాలని అన్నదాతలు వేడుకుంటున్నారు.

సురక్షితంగా రక్షణ దళం!

ఖమ్మం, నవంబర్ 4 (చురకలు) : ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బేతుపల్లి చెరువులో భారీ వరద తీవ్ర ఉత్కంఠ రేపింది. వలలు వేసేందుకు వెళ్లి చిక్కుకున్న ఐదుగురు జాలర్లను కాపాడేందుకు వెళ్లిన అగ్నిమాపక, ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది పడవలు వరద ఉధృతికి బోల్తా పడ్డాయి. దీంతో ఆ రెండు పడవల్లో ఉన్న 11 మంది రక్షణ సిబ్బంది ఒక్కసారిగా గల్లంతయ్యారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెంటనే ఆరా తీశారు. సహాయక చర్యలు ముమ్మరం చేయాలని జిల్లా కలెక్టర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్న కలెక్టర్ దివాకర, ఎమ్మెల్యే రాగమయి సహాయక చర్యలు వేగవంతం చేశారు. భద్రాచలం నుంచి జాతీయ విపత్తు స్పందన దళాలను (ఎన్‌డీఆర్ఎఫ్) రప్పించారు. గాలింపులో వినియోగించే ఆధునిక పరికరాలతో (డ్రోన్లతో) బాధితులకు ప్రాణ రక్షణ కవచాలు పంపించారు. గల్లంతైన సిబ్బందితో పాటు జాలర్లు అందరూ సమీపంలో సురక్షితంగా ఉన్నట్లు అధికారులు గుర్తించడంతో సర్వత్రా ఊపిరి పీల్చుకున్నారు. గురువారం ఉదయం మంత్రి పొంగులేటి ఈ ప్రాంతాన్ని స్వయంగా పరిశీలించనున్నారు.

ఓటమి భయంతోనే సంస్థలపై నిందలు!

- కాంగ్రెస్ నేతల పచ్చి అబద్ధాలను తిప్పికొట్టాలి
- జాబితా సవరణ అనేది ఈ ప్రభుత్వం కొత్తగా తెచ్చింది కాదు
- ఇరవై ఏళ్ల తర్వాత జాబితా ప్రక్షాళన చేపట్టిన ఎన్నికల సంఘం
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు ఆగ్రహం

వికారాబాద్, నవంబర్ 4 (చురకలు): ఎన్నికల్లో వరుస ఓటములను తట్టుకోలేక కాంగ్రెస్, దాని మిత్రపక్షాలు ప్రజాస్వామ్య సంస్థలపై విషం చిమ్ముతున్నాయని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వికారాబాద్ పట్టణంలో ఓటర్ల సమగ్ర సవరణ ప్రక్రియపై బుధవారం నిర్వహించిన మేధావులు, న్యాయవాదుల సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. 'ఓట్ల చోరీ' అంటూ ఎన్నికల సంఘంపైనా, కేంద్ర ప్రభుత్వంపైనా ప్రతిపక్షాలు చేస్తున్న నిరాధార ప్రచారాన్ని ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ఈ ప్రభుత్వంలో కొత్తగా తెచ్చినది కాదని, గతంలో రాజీవ్ గాంధీ లాంటి కాంగ్రెస్ ప్రధానుల కాలంలోనే పలుమార్లు జరిగిందని ఆయన గుర్తుచేశారు.

అవన్నీ తప్పుడు ఆరోపణలే..

సుమారు ఇరవై ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఎన్నికల సంఘం తన రాజ్యాంగబద్ధ బాధ్యతగా ఓటర్ల జాబితా ప్రక్షాళన చేపట్టిందని రామచందర్ రావు తెలిపారు. 13 కోట్ల ఓట్లు రాత్రికి రాత్రే తొలగించేశారంటూ రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నేతలు పచ్చి అబద్ధాలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. క్షేత్రస్థాయి విచారణ పూర్తయిన తర్వాతే తుది జాబితా వస్తుందని స్పష్టం చేశారు. "జాబితాలో 6.3 కోట్ల మంది వేరే ప్రాంతాలకు వలస వెళ్లినవారు, మూడు కోట్ల మంది చిరునామాల్లో అందుబాటులో లేనివారు, 2.8 కోట్ల మంది మరణించినవారు, కోటి మందికి పైగా ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఓట్లు ఉన్నవారు ఉన్నారు. గత ఇరవై ఏళ్లలో మరణించిన వారి పేర్లను, అక్రమ ఓట్లను తొలగించకుండా అలాగే ఉంచాలా?" అని రామచందర్ రావు కాంగ్రెస్ నేతలను నిలదీశారు. దొంగ ఓట్లతో అధికారంలోకి రావాలనుకునే ఆ పార్టీ కుట్రలకు గండిపడుతుందనే ఈ నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు.



అధికారులందరూ రాష్ట్ర ప్రభుత్వానివే..

సర్వే ప్రక్రియలో కేంద్రం ప్రమేయం ఏమీ ఉండదని, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ ఉద్యోగులే ఇంటింటికీ తిరిగి సర్వే చేస్తున్నారని ఆయన తెలిపారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ అన్ని పార్టీల ఏజెంట్లు పర్యవేక్షిస్తున్నారని, ఎవరి పేరైనా పొరపాటున తొలగిస్తే దరఖాస్తు ద్వారా తిరిగి నమోదు చేసుకునే హక్కు రాజ్యాంగం కల్పించిందని స్పష్టం చేశారు. దేశ భద్రత విషయంలో తమ ప్రభుత్వం రాజీపడబోదని, పౌరసత్వం లేని చొరబాటుదారులను ఓటర్ల జాబితా నుంచి కచ్చితంగా తొలగిస్తుందని తేల్చిచెప్పారు. ప్రజలు తమను విశ్వసించకపోవడంతోనే కాంగ్రెస్ పార్టీ యంత్రాలపై, న్యాయస్థానాలు, ఎన్నికల సంఘంపై నిందలు మోపుతోందని రామచందర్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు.

అవినీతి ఊబిలో అధికారి!

తనిఖీల్లో 4.75 కోట్ల అక్రమాస్తుల గుర్తింపు

హైదరాబాద్, సూర్యాపేటలో 12 ఖాళీ స్థలాలు

ఫార్చ్యూనర్ సహా 73 లక్షల విలువైన కార్లు

భారీగా బంగారం, బ్యాంకు ఖాతాల్లో నగదు

ఏసీబీ వలలో మెప్మా అదనపు సంచాలకుడు



హైదరాబాద్, నవంబర్ చ (**చురకలు**) :

పట్టణ పేదల సంక్షేమం కోసం పనిచేయాల్సిన మెప్మా విభాగంలో ఆదాయానికి మించిన ఆస్తుల వ్యవహారం వెలుగుచూసింది. మెప్మా అదనపు సంచాలకుడు నల్లగట్ల యాదగిరిరావు నివాసాలు, కార్యాలయాలు, బంధువులు, బినామీలకు చెందిన ప్రాంతాల్లో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు ఏకకాలంలో ముమ్మర సోదాలు నిర్వహించారు. రంగారెడ్డి రేంజ్‌కు చెందిన బృందాలు మొత్తం 10 చోట్ల తనిఖీలు చేపట్టి ప్రాథమికంగా 4.75 కోట్ల రూపాయల విలువైన ఆస్తులను గుర్తించాయి. మార్కెట్ ధరల ప్రకారం వీటి విలువ మరింత భారీగా ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ సోదాల్లో హైదరాబాద్, సూర్యాపేట ప్రాంతాల్లో యాదగిరిరావు పేరిట ఉన్న 12 ఖాళీ స్థలాలను గుర్తించారు. వీటి విలువ 58.63 లక్షల రూపాయలుగా అంచనా వేశారు. ఉప్పల్‌లో 31.36 లక్షల విలువైన రెండు ఫ్లాట్లు, రెండు కోట్లకు పైగా విలువ చేసే మూడు అంతస్తుల భవనం, మేడపై ఓ గది (పెంట్‌హౌస్) బయటపడ్డాయి. సూర్యాపేటలో ఓ కాంక్రీట్ (ఆర్సీసీ) ఇల్లు, ఉప్పల్‌లో ఓ దుకాణం ఉన్నట్లు గుర్తించారు. అలాగే 1,792.2 గ్రాముల బంగారు ఆభరణాలు, 1.80 లక్షల విలువైన మూడు కిలోల వెండి వస్తువులను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. టయోటా ఫార్చ్యూనర్‌తో పాటు మరో విలాసవంతమైన కారు విలువ 73 లక్షలుగా అంచనా వేశారు. ద్విచక్ర వాహనాలు, 29.08 లక్షల గృహోపకరణాలు, 7.01 లక్షల ఎలక్ట్రానిక్ వస్తువులు, బ్యాంకు ఖాతాల్లో 32.30 లక్షల నగదును తనిఖీల్లో గుర్తించారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు బ్యాంకు లాకర్లు, స్థిరాస్తుల పత్రాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. మరిన్ని ఆస్తుల వివరాలు సేకరించే పనిలో పడ్డారు. నిందితుడు యాదగిరిరావును ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించేందుకు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే 1064 ఉచిత నంబర్‌కు లేదా 9440446106 వాట్సాప్ నంబర్‌కు నేరుగా ఫిర్యాదు చేయాలని ఏసీబీ అధికారులు ప్రజలకు సూచించారు.

రూ.400 కోట్ల సైబర్ వల!

అమెరికా పౌరులే లక్ష్యంగా అంతర్జాతీయ ముఠా

ఆన్‌లైన్ నిర్బంధం, పెట్టుబడుల పేరుతో దోపిడీ

నలుగురిని అరెస్టు చేసిన హైదరాబాద్ ఈడీ

హైదరాబాద్, నవంబర్ 4 (చురకలు) : అమెరికా పౌరులను లక్ష్యంగా చేసుకుని ఏకంగా 400 కోట్లకు పైగా సైబర్ మోసాలకు పాల్పడిన అంతర్జాతీయ ముఠాకు చెందిన నలుగురు ప్రధాన నిందితులను హైదరాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సోమవారం అరెస్ట్ చేశారు. నకిలీ కాల్‌సెంటర్ల ద్వారా ఆన్‌లైన్ నిర్బంధం (డిజిటల్ అరెస్ట్) పేరుతో బెదిరింపులకు గురిచేయడంతో పాటు, వర్చువల్ కరెన్సీ (క్రిప్టో) పెట్టుబడుల పేరుతో ఈ ముఠా భారీగా మోసాలకు పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. పంజాబ్‌లోని పాటియాలాలో దాడులు నిర్వహించి ప్రధాన నిందితుడు హర్షల్ రావల్‌తో పాటు ప్రణవ్ పితాదియా, జశ్వంత్ సింగ్, చేతన్ ముంజల్‌లను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం పీటీ వారెంట్‌పై వారిని హైదరాబాద్‌కు తరలించి రిమాండ్‌కు పంపించారు. ఈడీ దర్యాప్తు ప్రకారం.. హర్షల్ రావల్ నేతృత్వంలోని ఈ ముఠా తొలుత హైదరాబాద్‌లోని మాదాపూర్‌లో ఓ నకిలీ కాల్‌సెంటర్‌ను ఏర్పాటు చేసి మోసాలకు తెరలేపింది. అక్కడ అధికారుల దాడుల అనంతరం తమ చీకటి కార్యకలాపాలను పంజాబ్‌లోని పాటియాలకు మార్చింది. గత మూడేళ్లుగా అక్కడి నుంచి అమెరికా పౌరులకు ఫోన్లు చేసి ఆన్‌లైన్ నిర్బంధం పేరుతో బెదిరింపులకు పాల్పడటంతో పాటు వర్చువల్ కరెన్సీలో పెట్టుబడుల ఆశ చూపి వేలాది మందిని నిలువునా మోసం చేసినట్లు అధికారులు తమ దర్యాప్తులో గుర్తించారు.



హవాలా మార్గంలో తరలింపు..

బాధితుల నుంచి వసూలు చేసిన మొత్తాన్ని ముందుగా వర్చువల్ కరెన్సీగా మార్చి, ఆ తర్వాత హవాలా మార్గాల్లో ఇతర ప్రాంతాలకు తరలించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఈ అక్రమ లావాదేవీలను కప్పిపుచ్చేందుకు వందలాది బినామీ (మ్యూల్) బ్యాంకు ఖాతాలను వినియోగించినట్లు గుర్తించారు. ఈ మొత్తం వ్యవహారంలో సుమారు రూ.400 కోట్ల మేర వర్చువల్ కరెన్సీ లావాదేవీలు జరిగినట్లు ఈడీ ప్రాథమికంగా అంచనా వేస్తోంది. కేసు దర్యాప్తులో భాగంగా దేశంలోని పలు రాష్ట్రాల్లో ఏకకాలంలో ముమ్మర సోదాలు నిర్వహించిన అధికారులు.. ముఠా ఆర్థిక లావాదేవీలు, హవాలా ఏజెంట్లు, ఇతర సహ నిందితుల పాత్రపై తీవ్రంగా దృష్టి సారించారు. అరెస్టయిన ఈ నలుగురు నిందితులను తమ కస్టడీలోకి తీసుకుని మరింత లోతుగా వివరాలు రాబట్టేందుకు సిద్ధమవుతున్నారు.

కాంగ్రెస్ సర్కారు వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

రైతు గర్జన స్ఫూర్తితో పోరాడాలి!

బీఆర్ఎస్ శ్రేణులకు కేటీఆర్ దిశానిర్దేశం

హైదరాబాద్, నవంబర్ 4 (చురకలు) : ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో బీఆర్ఎస్ చేపట్టిన 'రైతు గర్జన' విజయవంతం కావడం పట్ల పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. ఇదే స్ఫూర్తితో రైతాంగ సమస్యలపై ప్రజాక్షేత్రంలో నిరంతర పోరాటం కొనసాగించాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి జోగు రామన్న, నేతలు భార్గవ్ దేశ్‌పాండే, జోగు మహేందర్ తదితరులు కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రైతు గర్జన వివరాలను వారు ఆయనకు వివరించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. గత పదేళ్ల కేసీఆర్ పాలనలో రైతుబంధు, రైతుబీమా, ఉచిత విద్యుత్, సాగునీటితో రైతాంగానికి ఎంతో భరోసా కల్పించామన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆయా పథకాల అమలులో తీవ్ర జాప్యం జరుగుతోందని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని నేతలకు సూచించారు. ఇదే వేదికపై వివిధ పార్టీలకు చెందిన పలువురు నేతలు కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. వారికి ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని కోరారు.





కుప్పకూలిన కాన్సస్ కంచుకోట

అమెరికాలో డెమోక్రాట్ల ప్రభంజనం!

94 ఏళ్ల తర్వాత రిపబ్లికన్ల కోటలో చారిత్రాత్మక విజయం


ట్రంప్‌కు మధ్యంతర ఎన్నికల్లో భారీ రాజకీయ ఎదురుదెబ్బ

సెనెట్, ప్రతినిధుల సభ రెండింటిపైనా డెమోక్రాట్ల పట్టు

కాన్సస్‌లో రోజర్ మార్షల్‌ను ఓడించిన ఆడమ్ హమిల్టన్

వాషింగ్టన్ మేయర్‌గా జనీస్ లూయిస్ జార్జ్ విజయం

అమెరికా తొలి ముస్లిం సెనెటర్‌గా అబ్దుల్ ఎల్ సయెద్ చరిత్ర



వాషింగ్టన్, నవంబర్ 4 : అమెరికా మధ్యంతర ఎన్నికల్లో రాజకీయ సమీకరణాలు ఒక్కసారిగా మారిపోయాయి. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలోని రిపబ్లికన్ పార్టీకి ఓటర్లు గట్టి ఎదురుదెబ్బ ఇచ్చారు. దశాబ్దాలుగా రిపబ్లికన్లకు పట్టున్న రాష్ట్రాల్లోనూ డెమోక్రటిక్ పార్టీ అనూహ్య విజయాలు సాధించింది. అమెరికా కాంగ్రెస్‌లోని సెనెట్, ప్రతినిధుల సభ రెండింటిపైనా డెమోక్రాట్లు నియంత్రణ సాధించారు. ముఖ్యంగా రిపబ్లికన్ల కంచుకోటగా పేరొందిన కాన్సస్‌లో 94 ఏళ్ల తర్వాత డెమోక్రటిక్ పార్టీ సెనెట్ స్థానాన్ని గెలుచుకోవడం ఈ ఎన్నికల్లో అత్యంత కీలక పరిణామంగా నిలిచింది. మరోవైపు మిషిగన్ నుంచి అబ్దుల్ ఎల్ సయెద్ అమెరికా చరిత్రలో తొలి ముస్లిం సెనెటర్‌గా ఎన్నికై సరికొత్త అధ్యాయాన్ని లిఖించారు. కాన్సస్ రాష్ట్రంలో డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి ఆడమ్ హమిల్టన్ చారిత్రాత్మక విజయాన్ని నమోదు చేశారు. ప్రస్తుత రిపబ్లికన్ సెనెటర్ రోజర్ మార్షల్‌ను ఓడించి రాజకీయ సంచలనం సృష్టించారు. 1932 తర్వాత కాన్సస్ నుంచి అమెరికా సెనెట్‌కు ఎన్నికైన తొలి డెమోక్రటిక్ అభ్యర్థిగా హమిల్టన్ నిలిచారు. దాదాపు తొమ్మిది దశాబ్దాలకు పైగా కొనసాగిన రిపబ్లికన్ల ఆధిపత్యానికి ఈ ఫలితం ముగింపు పలికింది. తాజా ఫలితాల ప్రకారం హమిల్టన్ సుమారు 50.9 శాతం ఓట్లు సాధించగా, రోజర్ మార్షల్‌కు సుమారు 46.1 శాతం ఓట్లు లభించాయి. రిపబ్లికన్లకు సంప్రదాయంగా బలమైన మద్దతు ఉన్న రాష్ట్రంలో డెమోక్రాట్ల విజయం జాతీయ రాజకీయాల్లో ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకుంది.

కాంగ్రెస్‌లో మారిన బలాబలాలు

అమెరికా ప్రతినిధుల సభలో మెజార్టీకి అవసరమైన 218 స్థానాల మార్కును డెమోక్రాట్లు అధిగమించారు. సెనెట్‌లోనూ కీలక స్థానాలను రిపబ్లికన్ల నుంచి కైవసం చేసుకుని ఆధిపత్యం సాధించారు. దీంతో అధ్యక్షుడు ట్రంప్ మిగిలిన పదవీకాలంలో చట్టసభల నుంచి మరింత రాజకీయ ప్రతిఘటన ఎదుర్కొనే పరిస్థితి ఏర్పడింది. జీవన వ్యయం పెరుగుదల, ఆర్థిక విధానాలు, విదేశాంగ నిర్ణయాలు వంటి అంశాలపై ఓటర్ల అసంతృప్తి ఎన్నికల ఫలితాల్లో ప్రతిబింబించినట్లు అంతర్జాతీయ వార్తా సంస్థల విశ్లేషణలు పేర్కొన్నాయి. రిపబ్లికన్లకు బలమైన పట్టున్న పలు రాష్ట్రాల్లో డెమోక్రాట్లు విజయాలు సాధించడం ఆ పార్టీకి మరింత ఉత్సాహాన్నిచ్చింది.

వాషింగ్టన్ మేయర్‌గా జనీస్ లూయిస్ జార్జ్

అమెరికా రాజధాని వాషింగ్టన్ డీసీ మేయర్ ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీకి చెందిన జనీస్ లూయిస్ జార్జ్ విజయం సాధించారు. ప్రజలకు అందుబాటులో ఉండే గృహవసతి, రవాణా సదుపాయాల విస్తరణ, సామాజిక సంక్షేమ కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తానని ఆమె ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. న్యూయార్క్ మేయర్ జోహ్రాన్ మమ్దానీ ప్రతిపాదించిన కొన్ని ప్రగతిశీల విధానాలతో ఆమె ప్రచార హామీలకు పోలికలు ఉండటంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తికర చర్చ జరిగింది. వాషింగ్టన్ డీసీలో ప్రజాస్వామ్య సోషలిస్టు భావజాలానికి చెందిన నాయకురాలు మేయర్‌గా ఎన్నిక కావడం కూడా ఈ ఎన్నికల్లో ప్రత్యేక పరిణామంగా నిలిచింది.

తొలి ముస్లిం సెనెటర్‌గా అబ్దుల్ ఎల్ సయెద్


మిషిగన్ రాష్ట్రంలో మరో చారిత్రాత్మక ఫలితం నమోదైంది. డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి అబ్దుల్ ఎల్ సయెద్ రిపబ్లికన్ అభ్యర్థి మైక్ రోజర్స్‌ను ఓడించి అమెరికా సెనెట్‌కు ఎన్నికయ్యారు. దీంతో అమెరికా చరిత్రలో తొలి ముస్లిం సెనెటర్‌గా ఆయన గుర్తింపు పొందారు. ప్రజారోగ్య రంగంలో పనిచేసిన అనుభవం ఉన్న ఎల్ సయెద్ ఎన్నికల ప్రచారంలో ఆరోగ్య సంరక్షణ, ఆర్థిక అసమానతలు, ప్రజా సంక్షేమం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఆయన విజయం అమెరికా రాజకీయాల్లో మైనారిటీ వర్గాల ప్రాతినిధ్యానికి సంబంధించి చారిత్రాత్మక పరిణామంగా నిలిచింది.

ట్రంప్ ముందున్న కొత్త సవాళ్లు

మధ్యంతర ఎన్నికల్లో డెమోక్రాట్ల విజయంతో అమెరికా రాజకీయాల్లో అధికార సమతుల్యత మారింది. కాంగ్రెస్ ఉభయ సభల్లో ప్రతిపక్షానికి ఆధిపత్యం లభించడంతో ప్రభుత్వ చట్టప్రతిపాదనలు, కీలక నియామకాలు, పరిపాలనా నిర్ణయాలపై మరింత పరిశీలన జరిగే అవకాశముంది. ముఖ్యంగా కాన్సస్ వంటి రిపబ్లికన్ల సంప్రదాయ కంచుకోటల్లో ఓటర్ల తీర్పు మారడం 2028 అధ్యక్ష ఎన్నికలకు ముందు రెండు ప్రధాన పార్టీల రాజకీయ వ్యూహాలపై ప్రభావం చూపనుంది.

హర్మూజ్‌లో భారత్‌కు ప్రత్యేక మినహాయింపు!

- **భారత నౌకల రాకపోకలకు ఆంక్షల నుంచి ఉపశమనం**
- **చైనా, ఇరాక్, ఖతార్‌లకూ ప్రత్యేక అనుమతులు**
- **భారత్ నుంచి ఔషధాల దిగుమతుల కోసమే నిర్ణయమన్న ఇరాన్**



టెహ్రాన్, నవంబర్ 4 (చురకలు) : పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ప్రపంచ చమురు రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధిలో భారత్‌కు ప్రత్యేక మినహాయింపు ఇస్తున్నట్లు ఇరాన్ ప్రకటించింది. భారత్‌తోపాటు చైనా, ఇరాక్, ఖతార్ దేశాలకు చెందిన వాణిజ్య నౌకలను ఆంక్షల నుంచి మినహాయిస్తున్నట్లు ఇరాన్ విదేశాంగ విధాన కమిటీ ఉపాధ్యక్షుడు అమీర్ హయత్ వెల్లడించారు. ఇతర దేశాల నౌకలపై కొనసాగుతున్న ఆంక్షలు ఈ 4దేశాలకు వర్తించవని తెలిపారు. ఇరాన్ దౌత్య, ఆర్థిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా భారత్ నుంచి ఔషధాల దిగుమతులను సులభతరం చేయడం ఈ నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధిలో నౌకాయానంపై ఆంక్షలు కొనసాగుతున్నప్పటికీ తమతో స్నేహపూర్వక సంబంధాలు కలిగిన దేశాలకు ప్రత్యేక సడలింపులు కల్పిస్తున్నట్లు అమీర్ హయత్ తెలిపారు. భారత్, చైనా, ఇరాక్, ఖతార్ దేశాల నౌకలు ఆంక్షలు లేకుండా జలసంధి గుండా ప్రయాణించేందుకు అనుమతిస్తున్నట్లు చెప్పారు. ఈ దేశాల నౌకల రాకపోకలకు అమెరికా కూడా అడ్డంకులు సృష్టించబోదని ఆయన పేర్కొన్నారు. అయితే ఇది ఇరాన్ ప్రతినిధి చేసిన ప్రకటన మాత్రమే కాగా, అమెరికా వైఖరిపై స్వతంత్ర ధ్రువీకరణ అవసరం. భారత్‌కు ప్రత్యేక మినహాయింపు ఇవ్వడానికి ప్రధాన కారణం ఔషధాల దిగుమతులేనని అమీర్ హయత్ వివరించారు. భారత ఔషధ పరిశ్రమ నుంచి ఇరాన్‌కు అవసరమైన మందులు, వైద్య సంబంధిత ఉత్పత్తుల సరఫరా నిరంతరాయంగా కొనసాగేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుందని పేర్కొన్నారు. సముద్ర రవాణాపై ఆంక్షల కారణంగా ఔషధాల సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్న ఉద్దేశంతో భారత నౌకలకు సడలింపులు కల్పించినట్లు తెలిపారు. చైనాకు మినహాయింపు ఇవ్వడం వెనుక దౌత్యపరమైన ప్రయోజనాలు ఉన్నాయని ఇరాన్ ప్రతినిధి వెల్లడించారు. అంతర్జాతీయ వ్యవహారాల్లో చైనా నుంచి రాజకీయ మద్దతు పొందేందుకు ఈ చర్య ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. ఇరాక్, ఖతార్‌తో ఉన్న సంబంధాలను దృష్టిలో ఉంచుకుని నౌకల రాకపోకలకు అనుమతులు కల్పించినట్లు తెలిపారు. ఈ నిర్ణయాలన్నీ ఇరాన్ ఆర్థిక, దౌత్య ప్రయోజనాలకు అనుగుణంగా తీసుకున్నవేనని స్పష్టం చేశారు. నాలుగు దేశాల నౌకలకు రవాణా ఆంక్షల నుంచి మినహాయింపు కల్పించినప్పటికీ జలసంధి గుండా ప్రయాణించే నౌకల నుంచి రవాణా రుసుము వసూలు చేస్తామని అమీర్ హయత్ తెలిపారు. మినహాయింపు అనేది నౌకల రాకపోకలకు సంబంధించి నదేనని, రుసుముల చెల్లింపునకు వర్తించదని ఆయన ప్రకటన ద్వారా స్పష్టమవుతోంది. అయితే రుసుము ఎంత ఉంటుందన్నది, దాన్ని ఏ విధంగా వసూలు చేస్తారన్నది వెల్లడించలేదు. పర్షియన్ గల్ఫ్‌ను ఒమన్ గల్ఫ్‌తో అనుసంధానించే హర్మూజ్ జలసంధి ప్రపంచ ఇంధన సరఫరాలో అత్యంత ప్రాధాన్యం కలిగిన సముద్ర మార్గం. గల్ఫ్ దేశాల నుంచి అంతర్జాతీయ మార్కెట్లకు తరలించే ముడిచమురు, సహజవాయువు రవాణాలో ఈ మార్గం కీలక పాత్ర పోషిస్తుంది. ఇక్కడ నౌకాయానానికి అంతరాయం ఏర్పడితే అంతర్జాతీయ చమురు ధరలు, సరఫరా వ్యవస్థలపై ప్రభావం పడే అవకాశముంది. ఈ నేపథ్యంలో భారత నౌకలకు ప్రత్యేక మినహాయింపు ఇస్తున్నట్లు ఇరాన్ ప్రకటించడం ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే ఈ సడలింపుల అమలు విధానం, నౌకల భద్రత, ఇతర దేశాల స్పందనపై మరింత స్పష్టత రావాల్సి ఉంది.



ఫాం 6 ద్వారా మళ్లీ ఓటరుగా నమోదు కండి

ప్రధాన ఎన్నికల సంఘం స్పష్టం!

న్యూఢిల్లీ, నవంబర్ 4 : ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియ అనంతరం ప్రచురించిన ఓటరు జాబితాలో పేర్లు గల్లంతైన పౌరులు ఏమాత్రం ఆందోళన చెందకుండా 'ఫాం 6' ద్వారా మళ్లీ ఓటరుగా నమోదు కావచ్చని భారత ప్రధాన ఎన్నికల సంఘం (ఈసీ) స్పష్టం చేసింది. గతంలో ఓటు హక్కు కలిగి ఉండి, ఈ సవరణల తర్వాత జాబితాలో పేరు కోల్పోయిన వారు కూడా ఎలాంటి అపోహలు లేకుండా కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఎన్నికల అధికారులకు నవంబర్ 3న ప్రత్యేక మార్గదర్శక లేఖను పంపించింది. ఓటరు జాబితా ప్రత్యేక సవరణల తర్వాత దేశ వ్యాప్తంగా పలువురు పాత ఓటర్ల పేర్లు తొలగింపునకు గురికావడంతో గందరగోళం నెలకొంది. గతంలోనే ఓటరుగా ఉన్న తాము ఇప్పుడు మళ్లీ ఫాం 6 సమర్పిస్తే, తొలిసారి నమోదు చేసుకుంటున్నట్లు తప్పుడు ప్రకటన (డిక్లరేషన్) ఇచ్చినట్లు అవుతుందేమోనని, చట్టపరమైన చిక్కులు ఎదురవుతాయేమోనని భావించి అనేకమంది దరఖాస్తుకు వెనుకంజ వేస్తున్నారు. ఈ సందేహాలపై ప్రధాన ఎన్నికల సంఘం స్పందిస్తూ.. ఫాం 6 ద్వారా తిరిగి దరఖాస్తు చేసుకున్నంత మాత్రాన దానిని తప్పుడు డిక్లరేషన్‌గా చూడబోమని, దరఖాస్తుదారులపై ఎలాంటి చట్టపరమైన చర్యలు ఉండవని హామీ ఇచ్చింది. ఈ క్రమంలోనే అర్హులైన పాత ఓటర్లు కొత్తగా ఫాం 6 సమర్పించినప్పుడు వారిపై ప్రజా ప్రాతినిధ్య చట్టం సెక్షన్ 31 కింద ఎలాంటి చర్యలు తీసుకోరాదని ఎన్నికల అధికారులకు సర్వోన్నత ఎన్నికల సంస్థ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. కాకపోతే, సదరు దరఖాస్తుదారులు దేశంలోని మరే ఇతర అసెంబ్లీ లేదా పార్లమెంటరీ నియోజకవర్గాల్లో ఓటరుగా నమోదై ఉండకూడదని షరతు విధించింది. ఓటరు జాబితాలో పేరు లేని అర్హులందరూ తక్షణమే ఫాం 6 ద్వారా మళ్లీ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఈసీ పిలుపునిచ్చింది.

అగ్నివీర్‌లకు కేంద్రం గుడ్‌న్యూస్

అగ్నిపథ్ సర్వీస్ కాలం మరో రెండేళ్లు పెంపు!



న్యూఢిల్లీ, నవంబర్ 4 : సాయుధ దళాల్లో సేవలు అందిస్తున్న అగ్నివీర్‌లకు కేంద్ర ప్రభుత్వం గొప్ప ఉపశమనం కలిగిస్తూ తీపి కబురు అందించింది. అగ్నిపథ్ పథకం కింద అగ్నివీర్‌ల సర్వీస్ కాలాన్ని మరో రెండేళ్ల పాటు పొడిగిస్తున్నట్లు ప్రకటించింది. ఈ సంచలన విషయాన్ని చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ (సీడీఎస్) జనరల్ ఎన్.ఎన్. రాజా సుబ్రమణి బుధవారం అధికారికంగా వెల్లడించారు. సాధారణంగా అగ్నిపథ్ నిబంధనల ప్రకారం అగ్నివీర్‌లకు నాలుగేళ్ల సర్వీస్ కాలం మాత్రమే ఉంటుంది. ఈ వ్యవధి పూర్తయిన తర్వాత వారిలోని 25 శాతం మంది అత్యుత్తమ ప్రతిభావంతులను త్రివిధ దళాల (ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్) శాశ్వత కేడర్‌కు ఎంపిక చేస్తారు. అయితే శాశ్వత కేడర్‌కు ఎంపిక కాకుండా మిగిలిపోయే 75 శాతం మంది అగ్నివీర్‌ల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, వారి సర్వీస్ కాలాన్ని నాలుగేళ్ల నుంచి ఆరేళ్లకు కేంద్రం పొడిగించింది. ఈ రెండేళ్ల పొడిగింపు నిర్ణయం వల్ల ఆ 75 శాతం మంది అగ్నివీర్‌లకు శాశ్వత కేడర్‌లో చేరడానికి మరొక అదనపు అవకాశం లభించనుంది. 2022లో ప్రవేశపెట్టిన అగ్నిపథ్ పథకం అత్యంత అద్భుతమైన ఫలితాలను అందించిందని సీడీఎస్ సుబ్రమణి కొనియాడారు. కాగా, సాయుధ దళాల్లో చేరిన మొదటి బ్యాచ్ నౌకాదళ (నేవీ) అగ్నివీర్‌ల సర్వీస్ కాలం నవంబరు 21తో, వైమానిక దళ (ఎయిర్‌ఫోర్స్) అగ్నివీర్‌ల మొదటి బ్యాచ్ సర్వీస్ కాలం డిసెంబరు 21తో, థలసేన (ఆర్మీ) మొదటి బ్యాచ్ సర్వీస్ కాలం డిసెంబరు 31తో ముగియనుంది. నాలుగేళ్ల క్రితం ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్ దళాలలో మొదటి విడత కింద మొత్తం 24,400 మంది అగ్నివీర్‌లుగా విధుల లోకి చేరారు. ఈ పథకం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు గడిచిన నాలుగేళ్ల కాలంలో సైన్యంలో సుమారు 2,70,000 మంది, వాయుసేనలో 27,000 మంది, నేవీలో 21,000 మంది అగ్నివీర్‌లుగా నియామకమయ్యారు. అగ్నిపథ్ సర్వీస్ కాలంలో సైనిక శిక్షణ, ఫిట్‌నెస్‌పైనే కాకుండా అగ్నివీర్‌లలో నైతిక విలువలు, వృత్తిపరమైన నైపుణ్యాలను పెంపొందించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతామని సీడీఎస్ జనరల్ ఎన్.ఎన్. రాజా సుబ్రమణి తెలిపారు.

ఎన్నికల కమిషనర్లు చట్టానికి అతీతులా?

- **జీవితకాల చట్టపరమైన రక్షణపై సుప్రీంకోర్టులో కీలక విచారణ**
- **రాజ్యాంగంలోని 14, 21వ అధికరణాలకు విరుద్ధమని వాదన**
- **కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘానికి సర్వోన్నత న్యాయస్థానం నోటీసులు**
- **డిసెంబర్ 18కి విచారణ వాయిదా**



న్యూఢిల్లీ, నవంబర్ 4 : ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ), ఇతర ఎన్నికల కమిషనర్లకు జీవితకాల చట్టపరమైన రక్షణ కల్పించే నిబంధనను సవాలు చేస్తూ భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో దాఖలైన పిటిషన్లపై కీలక విచారణ జరిగింది. 2023 నాటి ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల నియామక చట్టంలోని 'సెక్షన్ 16' రాజ్యాంగబద్ధతను సవాలు చేస్తూ పిటిషనర్ అరుణ్ కుమార్ అగర్వాల్, ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై స్పందన తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వానికి, భారత ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. 2023లో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'చీఫ్ ఎలక్షన్ కమిషనర్ అండ్ అదర్ ఎలక్షన్ కమిషనర్స్ యాక్ట్'లోని సెక్షన్ 16 ఇప్పుడు తీవ్ర వివాదానికి కారణమైంది. ఈ నిబంధన ప్రకారం సీఈసీ లేదా ఎన్నికల కమిషనర్ అధికారిక విధుల నిర్వహణలో చేసిన లేదా మాట్లాడిన విషయాలపై ఎలాంటి సివిల్, క్రిమినల్ కేసులను కోర్టులు స్వీకరించకూడదు. ఇప్పటికే కొనసాగుతున్న కేసులను కూడా ముందుకు తీసుకెళ్లకూడదు. పదవిలో ఉన్నప్పుడే కాకుండా పదవీ విరమణ తర్వాత కూడా ఈ రక్షణ వర్తిస్తుంది. ఈ నిబంధన ఎన్నికల కమిషనర్లకు అవసరానికి మించిన రక్షణ కల్పిస్తోందని, అధికారిక విధుల పేరుతో తప్పులు చేసినా, దురుద్దేశంతో వ్యవహరించినా, అధికార దుర్వినియోగానికి పాల్పడినా చట్టపరమైన చర్యలు తీసుకోవడం కష్టమవుతుందని పిటిషనర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది రాజ్యాంగంలోని 14 (సమానత్వ హక్కు), 21 (జీవించే హక్కు) అధికరణలతో పాటు రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధమని పిటిషనర్లు ధర్మాసనం దృష్టికి తెచ్చారు. జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ పిటిషన్లపై విచారణ జరిపి కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం తమ సమాధానం ఇవ్వాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను డిసెంబర్ 18కి వాయిదా వేసింది. ఓటరు జాబితా నుంచి తప్పుగా పేరు తొలగించినా, అభ్యర్థికి అన్యాయం జరిగినా, ఎన్నికల సంఘంలో అవినీతి జరిగినా బాధితులకు న్యాయపరమైన పరిష్కారం లేకుండా పోతుందని పిటిషనర్ ఆవేదన వ్యక్తం చేశారు. తొలుత 2023 బిల్లులో ఈ సంపూర్ణ రక్షణ నిబంధన లేదని, అనంతరం సవరణ ద్వారా సెక్షన్ 16ను చేర్చారని, ప్రతిపక్ష ఎంపీలు పెద్ద సంఖ్యలో సస్పెన్షన్‌లో ఉన్న సమయంలో పార్లమెంట్ దీనికి ఆమోదం తెలిపిందని పిటిషనర్ పేర్కొన్నారు.

వరగాని వాసుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన కొలన్ హన్మంత్ రెడ్డి

- బండారి లేఔట్ 275వ డివిజన్ అధ్యక్షుడి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ నేతలు



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 04, :కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బండారి లేఔట్ 275వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వరగాని వాసు జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై వరగాని వాసుకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ.. వరగాని వాసు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహిస్తూ ప్రజాసేవలో ముందుకు సాగాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ సర్కిల్ అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు మైసిగారి శ్రీనివాస్, బొమ్ము వెంకటేశ్వర రెడ్డి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు గంగుల అంజలి యాదవ్, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ మాజీ ప్రధాన కార్యదర్శి రఫియా బేగమ్, నిజాంపేట్ సర్కిల్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఇందిరా కడియాల, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రమేష్ బాబు, బిక్కన్ షా, ఆలేటి శ్రీనివాస్, కల్లోజి రవి, రామ్ చందర్ నాయక్, జితేందర్ రెడ్డి, బాల బ్రహ్మచారి, యశోద, శ్రీదేవి, లక్షి , నవ్య తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక నాయకులు పాల్గొని వరగాని వాసుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

తెలుగు తల్లి నగర్ సమస్యలపై బీఆర్ ఎస్ నేత వారాల వినోద్ కుమార్ పాదయాత్ర

- ప్రజల వద్దకే వెళ్లి సమస్యలపై ఆరా.. ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గౌడ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 04, :సాయిబాబా నగర్ డివిజన్ పరిధిలోని



తెలుగు తల్లి నగర్‌లో నెలకొన్న పలు స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బుధవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వారాల వినోద్ కుమార్ ఆధ్వర్యంలో బస్తీలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన బస్తీలోని ప్రతి వీధిలో పర్యటిస్తూ, స్థానిక ప్రజల ఇళ్ల వద్దకు స్వయంగా వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలతో మమేకమై, వారి ఇబ్బందులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం వారాల వినోద్ కుమార్ మాట్లాడుతూ.. తెలుగు తల్లి నగర్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గౌడ్ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. సంబంధిత అధికారులతో చర్చించి, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టి, వీలైనంత త్వరగా ప్రజలకు ఉపశమనం కలిగించేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ పాదయాత్రలో బీఆర్ఎస్ నాయకులు రాజ్ కుమార్ ముదిరాజ్, తెలుగు తల్లి నగర్ అధ్యక్షులు తారా సింగ్, కరాటే శీను, బద్రి, జహీర్, నారాయణ, కాసా రాధాకృష్ణ, లక్ష్మణ్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, స్థానిక బస్తీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని, వాటి పరిష్కారానికి కృషి చేయడమే పాదయాత్ర ప్రధాన ఉద్దేశమని నాయకులు పేర్కొన్నారు.

నాగరాజు కుటుంబ వేడుకల్లో పాల్గొన్న దొడ్ల వెంకటేష్ గౌడ్

- లక్ష్మీ ప్రసన్న, చందులకు వస్త్రాలు బహుకరించి ఆశీర్వదించిన మాజీ కార్పొరేటర్

కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 04, :



ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మబండ ఎన్టీఆర్ నగర్ కాలనీకి చెందిన సీనియర్ నాయకులు నాగరాజు కుమార్తె లక్ష్మీ ప్రసన్న, కుమారుడు చందుల హాఫ్ శారీ, ధోతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ హాజరై చిన్నారులకు వస్త్రాలు బహుకరించి, ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భాస్కర్ రెడ్డి, పోశెట్టి గౌడ్, మల్లేష్, ఖలీమ్, హనుమంతు, ఖకీర్, కుటుంబ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పఠనంలో చిన్నారి శ్రీప్రియ సంచలనం

- రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం.. జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక..
- పుణెలో నవంబర్ 21, 22 తేదీల్లో జరిగే పోటీల్లో సత్తా చాటేందుకు సిద్ధం

నంగునూరు, నవంబర్ 04, :



చిన్న వయసులోనే ఆధ్యాత్మిక జ్ఞానాన్ని అలవర్చుకుని భగవద్గీత శ్లోకాల పఠనంలో అద్భుత ప్రతిభ కనబరిచిన సిద్దిపేట చిన్నారి శ్రీప్రియ రాష్ట్రస్థాయిలో సత్తా చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి భగవద్గీత పఠన పోటీల్లో ద్వితీయ స్థానం సాధించి అందరి ప్రశంసలు అందుకుంటోంది. నవంబరు 21, 22 తేదీల్లో మహారాష్ట్రలోని పుణెలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు సిద్ధమవుతోంది. సిద్దిపేటకు చెందిన ఉపాధ్యాయ దంపతులు నాగేందర్, స్రవంతిల పదేళ్ల కుమార్తె శ్రీప్రియ ప్రస్తుతం సిద్దిపేటలోని మాడ్యులస్ పాఠశాలలో ఆరవ తరగతి చదువుతోంది. చిన్న వయసులోనే భగవద్గీతపై ఆసక్తి పెంచుకున్న ఆమె, కడపలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో తన పఠన ప్రతిభతో న్యాయనిర్ణేతలను ఆకట్టుకుని రెండో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ విజయంతో జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనే అరుదైన అవకాశాన్ని దక్కించుకుంది. విద్యార్థుల్లో ఆధ్యాత్మిక భావనలు, నైతిక విలువలు, క్రమశిక్షణ పెంపొందించాలనే లక్ష్యంతో చిన్మయ మిషన్ ప్రతి సంవత్సరం భగవద్గీత పఠన పోటీలను నిర్వహిస్తోంది. పాఠశాల స్థాయి నుంచి జిల్లా, రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిల వరకు ఈ పోటీలు కొనసాగుతాయి. రాష్ట్రస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు జాతీయ స్థాయిలో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. ఈ క్రమంలో శ్రీప్రియ తన ప్రతిభతో జాతీయ స్థాయికి చేరుకోవడం విశేషం. భగవద్గీత పఠనం కేవలం శ్లోకాలను వల్లె వేయడం మాత్రమే కాదని, విద్యార్థుల్లో మంచి నడవడిక, స్పష్టమైన ఉచ్చారణ, వాక్శుద్ధి, నైతిక విలువలు, ఆత్మవిశ్వాసం, మానసిక స్థైర్యం, క్రమశిక్షణను పెంపొందించేందుకు దోహదపడుతుందని నిర్వాహకులు పేర్కొంటున్నారు. జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొనేలా విద్యార్థులను తీర్చిదిద్దడంలో భగవద్గీత పఠనం కీలక పాత్ర పోషిస్తుందని వివరిస్తున్నారు.

అభినందనల వెల్లువ

రాష్ట్రస్థాయి పోటీల్లో ద్వితీయ స్థానం సాధించి జాతీయ స్థాయికి ఎంపికైన చిన్నారి శ్రీప్రియపై విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఆధ్యాత్మిక వేత్తలు, పలువురు ప్రముఖులు అభినందనలు కురిపిస్తున్నారు. పుణెలో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లోనూ తన ప్రతిభను చాటి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నారు. చిన్న వయసులోనే ఆధ్యాత్మిక జ్ఞానంతో పాటు పోటీతత్వాన్ని అలవర్చుకుని జాతీయ స్థాయికి ఎదగడం సిద్దిపేటకు గర్వకారణమని కొనియాడుతున్నారు.

భూగర్భ జలాల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు

- అమృత్ 2.0లో భాగంగా షాలో అక్విఫర్ మేనేజ్‌మెంట్ పనులు ప్రారంభం
- నీటిని పొదుపుగా వినియోగించుకోవాలి
- మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 04, :

పట్టణంలో భూగర్భ జలమట్టాలను పెంచడంతో పాటు వర్షపు నీటిని ఒడిసిపట్టి భూమిలోకి ఇంకింపజేసి జలవనరులను పరిరక్షించడమే లక్ష్యంగా అమృత్ 2.0 పథకంలో భాగంగా చేపట్టిన షాలో అక్విఫర్ మేనేజ్‌మెంట్ (సామ్ 2.0) పనులను మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ బుధవారం ప్రారంభించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి సునీతతో కలిసి ప్రాజెక్టు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ మల్లికార్జున్ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలను పెంచేందుకు, వర్షపు నీటిని వృథా కాకుండా భూమిలోకి ఇంకింపజేసేందుకు ఈ కార్యక్రమం దోహద పడుతుందని తెలిపారు. వాతావరణ మార్పుల నేపథ్యంలో నీటి ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు. భవిష్యత్తులో నీటి కొరత తలెత్తకుండా ఇప్పటి నుంచే జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అయోధ్య రెడ్డి,



మున్సిపల్ డీఈ ప్రేరణ పాండే, ఏఈ పృథ్వి, పర్యావరణ ఇంజనీర్ అన్వేష్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ముసాయిదా ఓటరు జాబితాలో పేరు లేకపోయినా ఆందోళన వద్దు

- ఫారం-6 ద్వారా తిరిగి ఓటరుగా నమోదు చేసుకోవచ్చు
- అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం
- జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 04, :

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (సర్-2026)లో భాగంగా విడుదల చేసిన ముసాయిదా ఓటరు జాబితాలో పేరు లేని, గతంలో ఓటరుగా నమోదైన అర్హులైన పౌరులు తిరిగి ఓటరుగా నమోదు చేసుకోవడానికి ఫారం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కట్టా హైమావతి తెలిపారు. ఫారం-6లో మొదటిసారి ఓటరుగా నమోదు చేసుకుంటున్నట్లు పేర్కొనాల్సి



ఉన్నప్పటికీ, గతంలో ఓటరుగా నమోదైన వారు తిరిగి నమోదు కోసం ఈ దరఖాస్తు చేసుకోవడంలో ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని భారత ఎన్నికల సంఘం స్పష్టం చేసిందన్నారు. ఈ విధంగా దరఖాస్తు చేసుకున్నంత మాత్రాన తప్పుడు ప్రకటన చేసినట్లు కాదని, ప్రజా ప్రాతినిధ్య చట్టం-1950లోని సెక్షన్ 31 ప్రకారం శిక్షార్హమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందనే భయం అవసరం లేదని వివరించారు. వివిధ సాంకేతిక కారణాలు లేదా ఓటరు జాబితా సవరణల వల్ల జాబితాలో పేరు తొలగిపోయిన అర్హులైన పౌరులు ఎలాంటి భయం లేకుండా ఫారం-6 ద్వారా తిరిగి నమోదు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడంతో పాటు ఓటరు జాబితాలో పారదర్శకత, విశ్వసనీయతను కాపాడటమే ఎన్నికల సంఘం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి కట్టా హైమావతి విజ్ఞప్తి చేశారు.

మల్లన్న సాగర్ కట్టపై ర్యాంపు నిర్మించాలి

- గ్రామ అభివృద్ధికి సహకరించాలని ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్‌కు సర్పంచ్ భద్రప్ప వినతి

గజ్వేల్ ప్రతినిధి, నవంబర్ 04, :

సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలం తిప్పారం గ్రామ అభివృద్ధికి దోహదపడేలా మల్లన్న సాగర్ కట్టపై ర్యాంపు నిర్మాణం చేపట్టాలని గ్రామ ప్రజాప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మల్లన్న సాగర్ పంప్‌హౌస్ పరిశీలనకు వచ్చిన రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్‌ను గ్రామ సర్పంచ్ ఆకుల భద్రప్ప ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ మల్లన్న సాగర్ నిర్మాణం కారణంగా తిప్పారం గ్రామానికి చెందిన అనేక మంది రైతులు తమ భూములను కోల్పోయారని, ఈ నేపథ్యంలో గ్రామ అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. మల్లన్న సాగర్ కట్టపై ర్యాంపు నిర్మిస్తే పర్యాటకుల రాకపోకలు పెరిగి, గ్రామంలోని చిన్న వ్యాపారులకు ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయని తెలిపారు. ర్యాంపు నిర్మాణం కేవలం రాకపోకల సౌకర్యానికే పరిమితం కాకుండా గ్రామ ఆర్థికాభివృద్ధికి కూడా తోడ్పడుతుందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను, గ్రామ అభివృద్ధి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రతిపాదిత ర్యాంపు నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రిన్సిపల్ సెక్రటరీని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఈసాల నవీన్,



వార్డు సభ్యులు కానుగంటి సురేష్ గౌడ్, తుడుం కనకరాజు, దాసరి బాబు, నేరెళ్ల చంద్రకళ, ముద్దాపురపు భారతమ్మ, గ్రామ శాఖ అధ్యక్షుడు కోరే చరణ్ తదితరులు పాల్గొన్నారు.

యాదవుల ఐక్యతకు సదర్ సమ్మేళనం వేదిక కావాలి!

- నవంబర్ 15న జగద్గిరిగుట్టలో 17వ సదర్ సమ్మేళనం
- జెకే శేఖర్ యాదవ్ పిలుపు

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 04, :యాదవుల ఐక్యత, ఆత్మగౌరవం, సంఘటిత శక్తిని చాటిచెప్పేలా 17వ సదర్ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నట్లు సదర్ సమ్మేళనం చైర్మన్ జెకే శేఖర్ యాదవ్ తెలిపారు. ఈ నెల 15వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటలకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని



జగద్గిరిగుట్ట లాస్ట్ బస్ స్టాప్ సెంటర్‌లో సమ్మేళనం నిర్వహించనున్నట్లు బుధవారం వెల్లడించారు. ఈ సందర్భంగా జెకే శేఖర్ యాదవ్ మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి నియోజకవర్గాల పరిధిలోని యాదవ ఆత్మీయులు, సోదరులందరూ కుటుంబ సమేతంగా పెద్ద సంఖ్యలో తరలివచ్చి 17వ సదర్ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. యాదవుల ఐక్యతను మరింత బలోపేతం చేయడంతో పాటు, తరతరాలుగా వస్తున్న సంప్రదాయాలు, సంస్కృతి, ఆత్మగౌరవాన్ని ప్రతిబింబించే ఈ వేడుకలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్కిక్, సింహం, గండి రాజు, బాలు, నాగరాజు, పాశం శ్రీకాంత్, దస్తగిరి, కృష్ణ, సంతోష్, మనీష్, వీరేష్, కుమార్ రాజు, వినోద్, తుకారం, మల్లేష్, రాకేష్ యాదవ్ తదితర యాదవ సోదరులు పాల్గొన్నారు.

‘సీపీ కనెక్ట్’లో ప్రతిభకు గుర్తింపు

- 14 మంది పోలీసు సిబ్బందితో పాటు ముగ్గురు పౌరులకు సీపీ సాధన రష్మీ పెరుమాళ్ అభినందనలు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 04, :

శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో విశేష ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని ప్రోత్సహించేందుకు చేపట్టిన ‘సీపీ కనెక్ట్’ కార్యక్రమంలో భాగంగా 14 మంది పోలీసు సిబ్బందితో పాటు, దొంగతనం కేసు ఛేదనలో పోలీసులకు సహకరించిన ముగ్గురు సామాన్య పౌరులను పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ అభినందించారు. ఈ సందర్భంగా కమిషనరేట్ కార్యాలయంలో వారికి ప్రశంసాపత్రాలు, ప్రత్యేక బహుమతి కిట్లను అందజేశారు. అనంతరం వారితో మాట్లాడి విధి నిర్వహణలో ఎదురైన అనుభవాలను తెలుసుకున్నారు. గత నెల రోజులుగా విధుల్లో అంకితభావం, నిబద్ధతతో పనిచేసి మంచి ఫలితాలు సాధించిన సిబ్బందిని ప్రత్యేకంగా ప్రశంసించారు.

ప్రశంసలు అందుకున్న పోలీసు సిబ్బంది

ఆంజనేయులు–పోలీస్ కానిస్టేబుల్, షీ టీమ్. డి స్వామి–పోలీస్ కానిస్టేబుల్, రాయపోల్. జి వికాస్ రెడ్డి–పోలీస్ కానిస్టేబుల్, రాయపోల్. సీహెచ్ పృథ్వి–పోలీస్ కానిస్టేబుల్, బెజ్జంకి. పి కళ్యాణ్–పోలీస్ కానిస్టేబుల్, సిద్దిపేట త్రీ టౌన్. ఎస్ రవి–సిద్దిపేట రూరల్ సర్కిల్ కోర్టు కానిస్టేబుల్, సీడీఓ. డి శ్రీనివాసరెడ్డి–హెడ్ కానిస్టేబుల్, కోర్టు లైజనింగ్. వీరేశం–పోలీస్ కానిస్టేబుల్, కోహెడ. ప్రదీప్–కోర్టు కానిస్టేబుల్, దుబ్బాక. అమరేందర్–కోర్టు కానిస్టేబుల్, మిరుదొడ్డి. కిష్టయ్య–కోర్టు కానిస్టేబుల్, చిన్నకోడూరు. భూమలింగం–పోలీస్ కానిస్టేబుల్, వన్ టౌన్. రాజు–పోలీస్ కానిస్టేబుల్, వన్ టౌన్. తిరుపతి–పోలీస్ కానిస్టేబుల్, చిన్నకోడూరు. వీరిలో ఎస్ రవి సర్కిల్ పరిధిలోని తీవ్రమైన కేసుల్లో సాక్షులను సమర్థవంతంగా కోర్టుకు హాజరుపరిచి నిందితులకు శిక్షలు పడేలా కృషి చేశారు. బెజ్జంకి, సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని కేసుల్లో నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష, చిన్నకోడూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కేసులో ఏడేళ్ల జైలు శిక్ష పడటంలో కీలక పాత్ర పోషించారు. అలాగే



కోర్టు మానిటరింగ్ అధికారిగా డి శ్రీనివాసరెడ్డి తీవ్రమైన నేరాల్లో నిందితులకు శిక్షలు పడేలా కోర్టు సిబ్బందికి మార్గదర్శకత్వం వహించారు. ప్రదీప్, అమరేందర్, కిష్టయ్యలు ఇటీవల నిర్వహించిన లోక్ అదాలత్‌లో అత్యధిక సంఖ్యలో కేసుల పరిష్కారానికి విశేష కృషి చేశారు. మార్కుక్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన దొంగతనం కేసు ఛేదనలో పోలీసులకు సహకరించిన కటకం కరుణాకర్, చెక్కల నాగరాజు, మేకల శ్రీనివాస్‌లను కూడా సీపీ ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. ఈ సందర్భంగా సీపీ సాధన రష్మి పెరుమాళ్ మాట్లాడుతూ రాత్రి వేళల్లో అప్రమత్తంగా ఉంటూ, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి పాత నేరస్థులను గుర్తించడం, దొంగతనాలను అరికట్టడం, కోర్టు కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా కృషి చేయడం అభినందనీయ మన్నారు. ఇదే నిబద్ధతతో కమిషనరేట్ పరిధిలోని పోలీసు సిబ్బంది పనిచేస్తూ నేరాల నియంత్రణకు కృషి చేయాలని సూచించారు. ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించేందుకు ‘సీపీ కనెక్ట్’ కార్యక్రమం ద్వారా బలమైన, సమన్వయంతో కూడిన, ప్రజలకు అండుబాటులో ఉండే పోలీసు బృందాన్ని నిర్మించేందుకు శాఖ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు.

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే బాలవికాస లక్ష్యం

- రాష్ట్రవ్యాప్తంగా 1,600 వాటర్ ప్లాంట్ల నిర్వహణ
- ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేడం లింగమూర్తి

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 04, :

గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన, స్వచ్ఛమైన తాగునీటిని అందుబాటులోకి తీసుకురావడమే బాలవికాస సంస్థ ప్రధాన లక్ష్యమని బాలవికాస వాటర్ ప్లాంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేడం లింగమూర్తి అన్నారు. బుధవారం సిద్దిపేట ప్రెస్ క్లబ్‌లో బాలవికాస వాటర్ ప్లాంట్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమైక్య



జోనల్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ఫెడరేషన్ ఆధ్వర్యంలో సుమారు 1,600 వాటర్ ప్లాంట్లు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశానికి 55 గ్రామాలకు చెందిన వాటర్ ప్లాంట్ల కమిటీ సభ్యులు హాజరైనట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా స్వచ్ఛమైన మంచినీటిని అందించేందుకు బాలవికాస సంస్థ నిరంతరం కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో సంస్థ సేవలను మరింత విస్తరించి, ప్రతి గ్రామంలో నాణ్యమైన తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జోనల్ డైరెక్టర్లు రామలింగారెడ్డి, లక్ష్మీనారాయణ, సిద్దిరాములు, ఐలేని మల్లికార్జున్ రెడ్డి, బాలవికాస సంస్థ మేనేజర్ మధుసూదన్, డైరెక్టర్లు, సంస్థ అధికారులు, వివిధ గ్రామాల వాటర్ ప్లాంట్ల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

16 కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా కృషి

- ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు సీపీ అభినందనలు
- 13 కేసుల్లో 20 ఏళ్లు, అంతకంటే ఎక్కువ జైలు శిక్షలు

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 04, :

వివిధ నేరాలకు సంబంధించిన 16 కేసుల్లో నిందితులకు శిక్షలు ఖరారయ్యేలా సమర్థవంతంగా వాదనలు వినిపించిన ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాదుల ఆత్మారాములును బుధవారం పోలీస్ కమిషనర్ సాధన రష్మీ పెరుమాళ్ అభినందించి ఘనంగా సత్కరించారు. ఈ ఏడాది మొత్తం 16 కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా ప్రాసిక్యూషన్ తరఫున ఆత్మారాములు విశేష కృషి చేశారు. ఇందులో 13 కేసుల్లో నిందితులకు 20 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ కాలం జైలు శిక్షలు ఖరారయ్యాయి. కోర్టు విచారణ సమయంలో పక్కా ఆధారాలు సమర్పిస్తూ, సమర్థవంతమైన వాదనలు వినిపించి తీవ్ర నేరాలకు పాల్పడిన వారికి కఠిన శిక్షలు పడేలా కృషి చేశారు. ఈ సందర్భంగా సీపీ సాధన రష్మీ పెరుమాళ్ మాట్లాడుతూ బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడంలో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. సాదుల ఆత్మారాములు చూపిన నిబద్ధత, చొరవ అభినందనీయమని, ఆయన సేవలు పోలీసు సిబ్బందికి, ప్రాసిక్యూషన్ విభాగానికి ఆదర్శంగా నిలుస్తాయని కొనియాడారు. అనంతరం సాదుల ఆత్మారాములుకు



శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి సీపీ ఘనంగా సత్కరించారు.

బాలికల విద్యకు ఆర్థిక పరిస్థితులు అడ్డుకాకూడదు

- విద్యార్థినులకు న్యాయ హక్కులు, ఉచిత న్యాయ సేవలపై అవగాహన

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 04, :

ప్రతి బాలికకు నాణ్యమైన విద్యను అభ్యసించే హక్కు ఉందని, ఆర్థిక పరిస్థితులు వారి చదువుకు అడ్డంకిగా మారకూడదని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సాజన్య అన్నారు. సిద్దిపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ సుదర్శన్ ఆదేశాల మేరకు బుధవారం ఉదయం రామవాపూర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం, వసతి గృహాలను ఆమె సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ముచ్చటించి వారి సమస్యలు, వసతి



సౌకర్యాలు, విద్యా ప్రమాణాల గురించి తెలుసుకున్నారు. విద్యార్థినులకు నాణ్యమైన ఆహారం అందించాలని, వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించాలని, బాలికలకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతి బాలికకు విద్యను అభ్యసించే అవకాశం ఉండాలని, ఎలాంటి వేదింపులకు గురికాకుండా భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా సంబంధిత అధికారుల దృష్టికి సమస్యలను తీసుకురావాలని సూచించారు. అలాగే బాలికల రక్షణ కోసం ప్రభుత్వం కల్పిస్తున్న చట్టపరమైన హక్కులు, ఉచిత న్యాయ సహాయం గురించి వివరించారు. విద్యార్థినులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపి, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని వాటిని సాధించే దిశగా ముందుకు సాగాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ లక్ష్మి , పాఠశాల సిబ్బంది, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

వరగాని వాసుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన నర్సారెడ్డి భూపతిరెడ్డి

కుత్బుల్లాపూర్, నవంబర్ 04, :కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని బండారి లేఔట్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వరగాని వాసు జన్మదినం సందర్భంగా మంగళవారం మాజీ టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వరగాని వాసుకు పుష్పగుచ్ఛం అందించి, ఆయురారోగ్యాలతో పాటు భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, ప్రగతి నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొమ్ము తాతి రెడ్డి, దుండిగల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జక్కుల మల్లేష్ యాదవ్, యువజన కాంగ్రెస్ కార్యదర్శి బత్తుల చిరంజీవి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు గూడూరు మురళీకృష్ణ, బండ్ల విజయ్ కుమార్, రవీందర్ రెడ్డి, డా. మద్ది నారాయణ రెడ్డి, వీరబాబు తదితరులు పాల్గొని వరగాని వాసుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



తెలుగు తల్లి నగర్‌లో ఉచిత వైద్య శిబిరం

- ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా వెల్ఫేర్ అసోసియేషన్ సేవా కార్యక్రమం
- ప్రజారోగ్య కార్యక్రమాలు అభినందనీయం వారాల వినోద్ కుమార్



కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 04, :సాయిబాబా నగర్ పరిధిలోని తెలుగు తల్లి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం కమ్యూనిటీ హాల్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు తల్లి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు తారా సింగ్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వారాల వినోద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారాల వినోద్ కుమార్ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయమని అన్నారు. సమాజ శ్రేయస్సు కోసం ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం ఎంతో సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. ప్రజలకు ఉపయోగపడే మంచి కార్యక్రమాన్ని నిర్వహించిన వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, కమిటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. భవిష్యత్తులోనూ ప్రజలకు మేలు చేసే సేవా కార్యక్రమాలు కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు రాజ్ కుమార్ ముదిరాజ్, తారా సింగ్, కరాటే శీను, నారాయణ, బద్రి, లక్ష్మణ్, జహీర్, కాసా రాధాకృష్ణతో పాటు పెద్ద సంఖ్యలో బస్తీ వాసులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

లేక్ వ్యూ కాలనీలో మురుగునీటి సమస్యకు పరిష్కారం

- నూతన సెవెరేజ్ లైన్ పనులు ప్రారంభించిన మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు



కూకట్పల్లి ప్రతినిధి, నవంబర్ 04, :

హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని లేక్ వ్యూ కాలనీ రోడ్ నంబర్ 1లో మురుగునీటి సమస్యకు పరిష్కారం దిశగా నూతన సెవెరేజ్ లైన్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. బుధవారం హైదర్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు జలమండలి అధికారులతో, కాలనీ వాసులతో కలిసి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా నార్నె శ్రీనివాసరావు మాట్లాడుతూ.. సెవెరేజ్ లైన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జలమండలి అధికారులకు సూచించినట్లు తెలిపారు. అదేవిధంగా రోడ్ నంబర్ 3లో పాత సెవెరేజ్ లైన్‌ను పునర్నిర్మించేందుకు అవసరమైన అంచనాలు రూపొందించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను కోరినట్లు వెల్లడించారు. డివిజన్ పరిధిలోని వివిధ కాలనీల ప్రజల నుంచి అందిన వినతులు, తమ దృష్టికి వచ్చిన సమస్యలను పరిగణనలోకి తీసుకుని అత్యవసర ప్రాంతాల్లో అభివృద్ధి పనులకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ప్రజలకు ఎలాంటి సమస్య ఎదురైనా తన దృష్టికి తీసుకువస్తే తప్పకుండా పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యతనిస్తూ సమస్యలులేని ఆదర్శవంతమైన కాలనీలుగా తీర్చిదిద్దడమే తన ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రజలకు స్వచ్ఛమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తానన్నారు. పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ సహకారంతో హైదర్‌నగర్ డివిజన్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి సూపర్‌వైజర్ నరేంద్ర, జీహెచ్ఎంసీ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును పంపిణి చేసిన గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు

నూతనకల్, నవంబర్ 04, :



తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామెల్ ఆదేశానుసారం తెలంగాణ రాష్ట్ర నాయకులు జన్నారెడ్డి వివేక్ రెడ్డి నాయకత్వంలో పెదనెమిల గ్రామానికి చెందిన జంగం లాజర్ కు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి రూ.30 వేల రూపాయల చెక్ ను పెదనెమిల కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు మస్కాపురం వెంకన్న, పెదనెమిల కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యులు చిప్పలపల్లి రాంబాబు, బొల్క శ్రీను, బొల్క చంద్రయ్య అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు గుర్రం వెంకన్న, కాసోజు మధు, బొబ్బ సాయిరెడ్డి, కనకం వెంకన్న, మోల్గురి వెంకన్న, కోట యల్లయ్య, గండమళ్ళ బిక్షం తదితరులు పాల్గొన్నారు.

కార్తీక వనభోజన మహోత్సవానికి ప్రముఖులకు ఆహ్వానం

- మంత్రి శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే కేపీ వివేకానందకు ఆహ్వాన పత్రికల అందజేత

కుత్బుల్లాపూర్, నవంబర్ 04, :శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 22వ తేదీన నిర్వహించనున్న కార్తీక వనభోజన మహోత్సవానికి పలువురు ప్రముఖులను సంఘ ప్రతినిధులు కలిసి ఆహ్వానించారు. ఈ మేరకు బుధవారం ప్రముఖులకు ఆహ్వాన పత్రికలను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, పరిశ్రమలు, వాణిజ్యం, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ బసవరాజు శ్రీనివాస్, మాజీ కేంద్ర మంత్రి సముద్రాల వేణుగోపాల చారి, గాంధీ భవన్ పీఆర్వో కప్పర హరిప్రసాద్ రావులను మర్యాదపూర్వకంగా కలిసి వనభోజన మహోత్సవానికి హాజరుకావాలని ఆహ్వానించారు. అదేవిధంగా పలువురు ఇతర ప్రముఖులకు సైతం ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు గోగులపాటి కృష్ణమోహన్, ప్రధాన సలహాదారు సర్వేపల్లి రమేష్, కార్యవర్గ సభ్యులు గడ్డం రాంబాబు, పురోహితులు హరి రాఘవేంద్ర, సింహాచలం శ్రీధరాచార్యులు, శ్రీరంగం గోపికృష్ణమాచార్యులు తదితరులు పాల్గొన్నారు. కార్తీక మాస ఆధ్యాత్మిక విశిష్టతను చాటడంతో పాటు బ్రాహ్మణ కుటుంబాల మధ్య ఐక్యత, ఆత్మీయత, సాంస్కృతిక సంప్రదాయాలను పెంపొందించడమే ఈ వనభోజన మహోత్సవం ప్రధాన ఉద్దేశమని సంఘ ప్రతినిధులు తెలిపారు.



ప్రవళిక మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలి

- బాధిత కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి
- టీజీఎస్ఆర్టీసీ ఎన్ఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ మౌలానా



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 04, :
గత పది రోజులుగా మృత్యువుతో పోరాడిన మణుగూరు డిపోకు చెందిన ఆర్టీసీ కండక్టర్ ప్రవళిక నవంబర్ 3న రాత్రి 10:15 గంటలకు తుదిశ్వాస విడిచారు. ప్రవళిక మృతి పట్ల టీజీఎస్ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ మౌలానా తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రవళిక మృతికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని, బాధిత కుటుంబానికి కోటి రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ఉన్న ఆర్టీసీ సిబ్బందిపై దాడులు జరగకుండా కఠిన చట్టాలు తీసుకురావడంతో పాటు, దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. మహాలక్ష్మి పథకం అమల్లోకి వచ్చినప్పటి నుంచి ఆర్టీసీ సిబ్బందిపై ప్రయాణికుల దాడులు పెరుగుతున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బంది భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విధుల్లో ఉన్న ఉద్యోగులకు రక్షణ కల్పించేలా తెలంగాణ ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. అలాగే ప్రవళిక మృతి పట్ల ఆర్టీసీ యాజమాన్యం వెంటనే స్పందించి సంస్థ తరఫున రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రవళిక తల్లికి ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యం అండగా నిలవాలని, ఆమెకు జీవనోపాధి కల్పించాలని కోరారు. ప్రత్యామ్నాయంగా ప్రవళికకు ప్రతినెల అందే వేతనాన్ని ఆమె తల్లి జీవించి ఉన్నంతకాలం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ప్రవళిక మృతికి సంతాపంగా నవంబర్ 4న తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అన్ని ఆర్టీసీ డిపోలు, యూనిట్లలో ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన ప్రదర్శనలు నిర్వహించినట్లు ఎండీ మౌలానా తెలిపారు.

మల్లెపూల వాగులో చిక్కుకున్న 10 మంది సురక్షితం

- అశ్వారావుపేట ఎస్‌డీఆర్ఎఫ్ బృందం విజయవంతంగా రెస్క్యూ ఆపరేషన్





దమ్మపేట, నవంబర్ 04, :మండల పరిధిలోని తొట్టి పంపు గ్రామ సమీపంలో ఉన్న మల్లెపూల వాగులో చిక్కుకున్న 10 మందిని అశ్వారావుపేట అగ్నిమాపక కేంద్రానికి చెందిన ఎస్‌డీఆర్ఎఫ్ బృందం సురక్షితంగా రక్షించింది. వాగులో 10 మంది చిక్కుకున్న విషయం తెలుసుకున్న అశ్వారావుపేట అగ్నిమాపక కేంద్రం ఎస్‌డీఆర్ఎఫ్ బృందం వెంటనే స్పందించి ఘటనా స్థలానికి చేరుకుంది. తొలుత వాగు ప్రవాహ ఉధృతిని, పరిస్థితులను పరిశీలించి, చిక్కుకున్న వారి భద్రతను అంచనా వేసింది. అనంతరం అవసరమైన రక్షణ ఏర్పాట్లు చేపట్టి క్రమబద్ధంగా రెస్క్యూ ఆపరేషన్ ప్రారంభించింది. బృంద సభ్యులు సమన్వయంతో రక్షణ చర్యలు చేపట్టి, వాగులో చిక్కుకున్న ఒక్కొక్కరినీ సురక్షిత ప్రాంతానికి చేర్చారు. ఈ విధంగా మొత్తం 10 మందిని ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా క్షేమంగా రక్షించడం తో రెస్క్యూ ఆపరేషన్ విజయవంతంగా ముగిసింది. అశ్వారావుపేట అగ్నిమాపక కేంద్రం ఎస్‌డీఆర్ఎఫ్ బృందం అప్రమత్తత, సమన్వయం, సమర్థవంతమైన చర్యలతో పది మందిని సురక్షితంగా కాపాడింది. ఈ సందర్భంగా జిల్లా అగ్నిమాపక అధికారి మురహరి క్రాంతి కుమార్ రెస్క్యూ ఆపరేషన్‌లో పాల్గొన్న ఎస్‌డీఆర్ఎఫ్ బృంద సభ్యులను అభినందించారు.

జగద్గిరిగుట్ట నుండి గండిమైసమ్మ వరకు నూతన బస్సు సేవలు ప్రారంభం



- ఎంపీ ఈటల రాజేందర్ చొరవతో ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం
- జెండా ఊపి బస్సును ప్రారంభించిన బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు జెకె. శేఖర్ యాదవ్

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 04, :జగద్గిరిగుట్ట నుండి గండిమైసమ్మ వరకు నూతన బస్సు సౌకర్యం అందుబాటులోకి వచ్చింది. జగద్గిరిగుట్ట నుంచి రంగారెడ్డినగర్, ఐడీపీఎల్ చౌరస్తా మీదుగా గండిమైసమ్మ వరకు నడిచే ఈ నూతన బస్సు సర్వీసును బుధవారం బీజేపీ ఓబీసీ మోర్చా మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షుడు జెకె. శేఖర్ యాదవ్ పలువురు బీజేపీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో జెండా ఊపి ప్రారంభించారు. మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ ప్రత్యేక చొరవతో, బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పరిష వేణు ఆధ్వర్యంలో ఈ బస్సు సౌకర్యం ఏర్పాటు కావడం పట్ల స్థానిక ప్రజలు, ముఖ్యంగా విద్యార్థులు, ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నూతన బస్సు సర్వీసుతో గండిమైసమ్మ, ఐడీపీఎల్ పరిసర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు రవాణా సౌకర్యం మరింత మెరుగుపడనుందని వారు ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎంఎస్ వాసు, జగద్గిరిగుట్ట డివిజన్ అధ్యక్షుడు శిరసాని మహేందర్, డివిజన్ మాజీ అధ్యక్షుడు పున్నారెడ్డి, సురేష్ రెడ్డి, సిద్ధిరామిరెడ్డి, సిద్ధారెడ్డి, ఉప్పల రమేష్ గుప్తా, ప్రమోద్, రాజు యాదవ్, రమేష్ యాదవ్, సునీల్, అరుణ, చంద్రప్రకాష్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మురసు తుఫాన్ బీభత్సం వరద గుప్పిట్లో దమ్మపేట

- 21 సెంటీమీటర్ల భారీ వర్షపాతం.. చెరువులకు గండ్లు, జలమయమైన లోతట్టు ప్రాంతాలు
- రాకపోకలు బంద్.. నీట మునిగిన పంటలతో రైతులకు కన్నీళ్లే మిగిలాయి

దమ్మపేట, నవంబర్ 04, :
మురసు తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న కుండపోత వర్షాలు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలాన్ని అతలాకుతలం చేశాయి. గత 24 గంటలుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు మండల వ్యాప్తంగా జనజీవనం స్తంభించిపోయింది. దమ్మపేట మండలంలో ఏకంగా 21 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు సమాచారం. దమ్మపేట గ్రామపంచాయతీ పరిధిలోని నెమలిపేట మునిగి, పేరంటాల చెరువు కట్ట తెగి శివాలయం, కళ్యాణ మండపం, మాదాల వారి ఇళ్ల పరిసరాలు జలమయమయ్యాయి. బస్టాండ్ నుంచి సెయింట్ మేరీస్ పాఠశాల వరకు ప్రధాన రహదారి ముంచెత్తింది, గాయత్రీ నగర్‌తో పాటు పలు కాలనీల్లోకి భారీగా వరదనీరు చేరింది. మండలంలోని పలు గ్రామాల్లో చెరువులు, కుంటలు అలుగులు పారుతూ ప్రమాదకరంగా ప్రవహిస్తున్నాయి. స్తంభించిన రాకపోకలు లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీట మునగడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దురదపాడు సమీపంలోని మల్లెపువ్వు వాగుతో పాటు స్థానిక వాగులు, ఉపనదులు ఉధృతంగా ప్రవహిస్తూ రహదారులపైకి వరదనీరు చేరింది. దమ్మపేట నుంచి బయటకు వెళ్లే ప్రధాన మార్గాలు సైతం నీట మునగడంతో అధికారులు రాకపోకలను నిలిపివేశారు. వరద ఉధృతిని లెక్క చేయకుండా ప్రయాణాలు చేయవద్దని ప్రజలను హెచ్చరించారు. రైతులకు తీరని నష్టం అకాల భారీ వర్షాలు రైతులకు కన్నీళ్లను మిగిల్చాయి. చేతికొచ్చిన వరి, పత్తి, మిరప, అరటి, మొక్కజొన్న పంటలు నీట మునిగాయి. కోతలు పూర్తిచేసి ఆరబెట్టిన ధాన్యం సైతం వర్షపు నీటికి తడిసి పోవడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పెరుగుతున్న బియ్యం ధరల నేపథ్యంలో చేతికొచ్చిన వరి పంట నీటి పాలవడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.

అప్రమత్తమైన అధికార యంత్రాంగం

వరద పరిస్థితుల నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తూ మైకుల ద్వారా ప్రకటనలు చేయించారు.



ప్రజలు తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని, అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు.వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆర్డీవో, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్, తహశీల్దార్, సబ్ ఇన్స్పెక్టర్, సర్పంచ్, రెవెన్యూ, పోలీస్, పంచాయతీ సిబ్బంది, సంక్షేమ సంఘాల బాధ్యులు, విపత్తు నిర్వహణ బృందాలు సహాయక చర్యలు చేపడుతున్నారు.ఒకవైపు ఎల్‌నినో ప్రభావంపై వ్యవసాయ రంగంలో ఆందోళనలు నెలకొన్న నేపథ్యంలో, మరోవైపు మురసు తుఫాన్ అతివృష్టి దమ్మపేట మండలాన్ని ముంచెత్తడం ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

కాసరపు హాసినిని ఆశీర్వదించిన అడువాల జ్యోతి లక్ష్మణ్

జగిత్యాల ప్రతినిధి, నవంబర్ 4, :
జగిత్యాల పట్టణంలోని 40వ వార్డులో కాసరపు అజయ్ గౌడ్, లిఖిత దంపతుల కుమార్తె కాసరపు హాసిని సారీ ఫంక్షన్ వేడుక ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ హాజరై చిన్నారి హాసినిని ఆశీర్వదించారు. ఈ సందర్భంగా హాసినికి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం పట్టణంలోని నవదుర్గా నగర్‌లో అంకం నరేష్–ప్రసన్న దంపతుల నివాసంలో నిర్వహించిన శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, స్థానికులు పాల్గొన్నారు.



శుభకార్యాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

- నూతన వధూవరులకు ఆశీస్సులు.. కుటుంబ సభ్యులతో ఆత్మీయ పలకరింపులు



సదాశివపేట, నవంబర్ 04, :
సదాశివపేట మండలంలోని పలు శుభకార్యాలకు సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ హాజరై సందడి చేశారు. సదాశివపేట మండలం బుధవారం నాడు కంబాలపల్లి గ్రామంలో సీనియర్ పార్టీ కార్యకర్త యాదయ్య కుమార్తె నిశ్చితార్థ వేడుకకు హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు.అనంతరం రేజింతల్ గ్రామంలో మాజీ ఎంపీటీసీ మన్నె భాస్కర్ కుటుంబంలో జరిగిన వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయా కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమాల్లో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సుధీర్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పెద్దగొల్ల అంజనేయులు, పట్టణ అధ్యక్షుడు చీల మల్లన్న, కంబాలపల్లి మాజీ సర్పంచ్ పెద్దగొల్ల శ్రీహరి, మాజీ ఉపసర్పంచ్ జానీమియా, మాజీ ఎంపీటీసీలు తలారి గాలయ్య, మన్నె భాస్కర్, నాయకులు జంగయ్య, వీరయ్య, పద్మారావు, జలీల్‌కుమార్, జాం పరశురాంబాబు, కుమార్, పోచయ్య, అంబమ్మ, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా భవన నిర్మాణానికి భూమి పూజ

- విబిజి రామ్ జి ద్వారా రూ.10 లక్షల నిధులు మంజూరు
- స్థలం విరాళంగా అందించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపిన గ్రామస్తులు




దుబ్బాక ప్రతినిధి (మిరుదొడ్డి), నవంబర్ 04, :
సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామంలో మహిళా భవన నిర్మాణానికి సర్పంచ్ శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులు బుధవారం భూమి పూజ నిర్వహించారు. గ్రామంలో మహిళల సౌకర్యార్థం నిర్మించనున్న భవనానికి విబిజి రామ్ జి నిధుల ద్వారా రూ.10 లక్షలు మంజూరైనట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామంలో మహిళ భవన నిర్మాణానికి అనువైన స్థలం లేకపోవడంతో గ్రామానికి చెందిన యశోదమ్మ–కిషన్ రావు, పద్మావతి–వాసుదేవరావు జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు స్థలాన్ని విరాళంగా అందజేశారు. మహిళ భవన నిర్మాణానికి స్థలాన్ని అందించిన దాతలకు సర్పంచ్ శ్రీనివాస్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలోని మహిళలతో పాటు అందరికీ ఉపయోగపడేలా భవనాన్ని నిర్మించనున్నట్లు, నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని సర్పంచ్ వెల్లడించారు. గ్రామ అభివృద్ధికి సహకరించిన దాతల సేవలను గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాలకవర్గ సభ్యులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పీఆర్సీని వెంటనే ప్రకటించాలి.. పాఠశాల స్కావెంజర్ల వేతనాలు చెల్లించాలి..

- ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి
- టీపీటీఎఫ్ డిమాండ్

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 04, :

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారంపై నిర్లక్ష్యం వీడి, పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు గాడిపల్లి తిరుపతిరెడ్డి డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ సిద్దిపేట అర్బన్ మండల కమిటీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ఎన్సాన్‌పల్లి, తడకపల్లి, పొన్నాల, బక్రీచెప్యాల, వెల్కటూర్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ఇందిరానగర్ పాఠశాలల్లో ఉపాధ్యాయుల సమస్యల సేకరణతో పాటు సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తడకపల్లి ఉన్నత పాఠశాలలో జరిగిన సమావేశంలో తిరుపతిరెడ్డి మాట్లాడుతూ 2023 జూలై నుంచి అమలు కావాల్సిన వేతన సవరణ సంఘం (పీఆర్సీ)ని ఇప్పటివరకు ప్రకటించకపోవడం శోచనీయమన్నారు. ప్రభుత్వం వెంటనే పీఆర్సీని ప్రకటించి ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. సిద్దిపేట జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కావెంజర్లకు గత ఏడాది నాలుగు నెలల వేతనాలతో పాటు, ఈ ఏడాది జూన్ నుంచి ఇప్పటివరకు జీతాలు చెల్లించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. నెలల తరబడి వేతనాలు అందక స్కావెంజర్లు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జిల్లా కలెక్టర్ స్పందించి పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీవో నంబర్ 25ను సవరించి ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి సబ్జెక్టుకు, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని సూచించారు. ఏ-వన్, ఏ-ఎక్సెల్ ప్రాథమిక సాక్షరత, అక్షరాస్యత, సంఖ్యా జ్ఞాన కార్యక్రమాలు అమలవుతున్న పాఠశాలలకు అదనపు ఉపాధ్యాయులను



కేటాయించాలని కోరారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలంటే ప్రాథమిక స్థాయిలోనే చదవడం, రాయడం, గణిత నైపుణ్యాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని పేర్కొన్నారు. ఇందుకోసం పాఠశాలల్లో సరిపడా ఉపాధ్యాయులను నియమించడంతో పాటు, బోధనేతర పనుల భారాన్ని తగ్గించి ఉపాధ్యాయులు పూర్తిస్థాయిలో బోధనపై దృష్టి సారించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా పారదర్శకంగా ఉపాధ్యాయుల పని సర్దుబాటు చేపట్టాలని, కంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని (సీపీఎస్) రద్దు చేయాలని టీపీటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మల్లేశం, ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్, ప్రధానోపాధ్యాయుడు కనకయ్య, ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, రమణారెడ్డి, నరేష్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆల్విన్ కాలనీలో గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కేంద్రం ఏర్పాటు

- అర్హులైన పట్టభద్రులంతా ఓటు హక్కును నమోదు చేసుకోవాలి దొడ్ల వెంకటేష్ గౌడ్

కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 04, :

ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఆల్విన్ కాలనీ ఫేజ్-2 కమ్యూనిటీ హాల్‌లో గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం ద్వారా అర్హులైన పట్టభద్రుల ఓట్లను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.ఈ సందర్భంగా బుధవారం దొడ్ల వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ నియోజకవర్గానికి సంబంధించిన అర్హత కలిగిన ప్రతి ఒక్క పట్టభద్రుడు రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఓటరు నమోదును ఆన్‌లైన్‌లో చేసుకోవడంతో పాటు, తాము ఏర్పాటు చేసిన కేంద్రాల్లో లేదా శంషిగూడలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కూడా ఓటును నమోదు చేసుకోవచ్చని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డి విజయమే లక్ష్యంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పటిష్ఠమైన కార్యాచరణతో ముందుకు సాగాలని సూచించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. పట్టభద్రుల సమస్యలను తెలుసుకుంటూ కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.ఈ కార్యక్రమంలో శివరాజ్ గౌడ్, కట్టా శ్రీనివాసరావు, కొండారెడ్డి, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



రైతుల సమస్యలపై రాజకీయ రగడ

- బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ ఎదురుదాడి
- ధాన్యం కొనుగోలు కేంద్రాలు త్వరలో ప్రారంభిస్తాం.. ప్రతి గింజా కొంటాం..
- కరువు మండలాల ప్రకటన డిమాండ్‌పై కాంగ్రెస్ నేతల ప్రశ్నలు

దుబ్బాక ప్రతినిధి, నవంబర్ 04, :

ఓవైపు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాక అన్నదాతలు ఎదురుచూస్తుంటే.. మరోవైపు రైతుల సమస్యలపై అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం మొదలైంది. రైతులను అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ నాయకులు రాజకీయాలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపడతామని, ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని దుబ్బాక ఏఎంసీ చైర్మన్ కొంగర రవి స్పష్టం చేశారు. బుధవారం దుబ్బాక పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం



కొనుగోళ్లు చేపట్టిందని, దుబ్బాక మార్కెట్ యార్డులో సుమారు 30 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాక రైతులు ఆందోళన చెందుతున్నారని, కలెక్టర్ ఆదేశాల మేరకు త్వరలోనే కేంద్రాలను ప్రారంభిస్తామని వెల్లడించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సకాలంలో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసే బాధ్యత ప్రభుత్వానిదేనని భరోసా ఇచ్చారు. గతంలో తడిసిన ధాన్యాన్ని సైతం 24 గంటల్లో రైస్ మిల్లులకు తరలించి రైతులకు చెల్లింపులు చేసినట్లు గుర్తుచేశారు. దుబ్బాకలో కరువు పరిస్థితులు లేవని, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, రంగనాయక సాగర్ నిర్మాణాలతో సాగునీటి సమస్య తీరుతుందని గతంలో చెప్పిన నాయకులే ఇప్పుడు కరువు మండలంగా ప్రకటించాలని కోరడం ఏమిటని ప్రశ్నించారు. ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు అడుగంటుతున్నప్పటికీ ప్రభుత్వం రోజుకు 12 గంటల విద్యుత్ సరఫరా చేస్తోందని పేర్కొన్నారు. రైతులను రాజకీయాలకు వాడుకోవద్దని, బీఆర్ఎస్ నాయకుల మాటలకు ప్రభావితం కావద్దని కోరారు.


శ్రీనివాస్ రెడ్డిపై ఆరోపణలకు సవాల్

కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డిపై అవినీతి ఆరోపణలు చేస్తున్న వారు ఆధారాలతో నిరూపించాలని కాంగ్రెస్ నాయకులు సవాల్ విసిరారు. ఎన్నికల్లో ఓటమి ఎదురైనా ప్రజలకు సేవ చేస్తున్న ఆయనపై నిరాధార ఆరోపణలు చేయడం తగదన్నారు. దుబ్బాకలో చెరువుల కబ్జాలపై వస్తున్న వార్తలు, కేసుల గురించి కూడా మాట్లాడాలని డిమాండ్ చేశారు. మార్కెట్ కమిటీల నియామకాలపై వస్తున్న విమర్శలకు స్పందిస్తూ, పార్టీ కష్టకాలంలో పనిచేసిన తమకు కమిటీల్లో ప్రాతినిధ్యం కోరే హక్కు ఉందని స్పష్టం చేశారు.

తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ నేతలకు గులాబీ కండువాలు కప్పిన కేటీఆర్







- దామోదర్ రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరిక

కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 04, :

శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు దామోదర్ రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు బుధవారం బీఆర్ఎస్ పార్టీలో చేరారు. తెలంగాణ భవన్‌లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో వారు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం పార్టీలో చేరిన నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్ర అభివృద్ధి కుంటుపడిందని, ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పనిచేయాలనే సంకల్పంతో బీఆర్ఎస్ పార్టీలో చేరినట్లు వెల్లడించారు.

కొనుగోలు కేంద్రాల కోసం అన్నదాతల ఎదురుచూపులు

- పంట చేతికి వచ్చినా కొనుగోళ్లు ప్రారంభం కాక రైతుల అవస్థలు
- అకాల వర్షా ల భయంతో ఆందోళన
- వెంటనే కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్

దుబ్బాక ప్రతినిధి (మిరుదొడ్డి), నవంబర్ 04 :

ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి వచ్చినా అన్నదాతకు కష్టాలు తప్పడం లేదు. వరి ధాన్యం విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ కొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిద్ధిపేట జిల్లా మిరుదొడ్డి, అక్బర్‌పేట భూంపల్లి మండలాల్లో ఇప్పటివరకు ఒక్క గ్రామంలో కూడా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే కొందరు రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకువచ్చి నిల్వ ఉంచారు. అయితే కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో ధాన్యం కుప్పలు పేరుకుపోతున్నాయి. మరోవైపు అకాల వర్షాల భయం రైతులను వెంటాడుతోంది. వర్షాలు కురిస్తే ధాన్యం తడిసి నష్టపోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రతి సీజన్‌లో ధాన్యం చేతికి వచ్చే సమయానికి ముందుగానే ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో గ్రామగ్రామాన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేవారని రైతులు గుర్తు చేస్తున్నారు. ఈసారి మాత్రం కొనుగోళ్లు ప్రారంభించడంలో జాప్యం జరుగుతోందని వాపోతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మిరుదొడ్డి, అక్బర్‌పేట భూంపల్లి మండలాల్లోని అన్ని గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని కోరుతున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని



తక్షణమే కొనుగోళ్లు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలు అందుబాటులోకి రాకపోతే తప్పనిసరి పరిస్థితుల్లో దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు ధాన్యం విక్రయించాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పరికి చెరువు చుట్టూ కంచె ఏర్పాటు చేయడాన్ని స్వాగతిస్తున్నాం

- చెరువు పరిరక్షణకు సీపీఐ ఎన్నో పోరాటాలు చేసింది
- కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి: సీపీఐ జిల్లా కార్యదర్శి ఈ. ఉమామహేష్

కుత్బుల్లాపూర్ ప్రతినిధి, నవంబర్ 04, :జగద్గిరిగుట్ట, ఎల్లమ్మబండ, గాజులరామారం, శ్రీనివాస్ నగర్ పరిధిలో సుమారు 45 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పరికి చెరువు పరిరక్షణకు హైడ్రా అధికారులు మరోసారి కంచె ఏర్పాటు చేయడానికి ముందుకు రావడాన్ని స్వాగతిస్తున్నామని సీపీఐ జిల్లా కార్యదర్శి ఈ. ఉమామహేష్ తెలిపారు. గత కొన్నేళ్లుగా పరికి చెరువును కాపాడాలని సీపీఐతో పాటు పలు రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో అనేక ఆందోళనలు, పోరాటాలు నిర్వహించినట్లు ఆయన గుర్తుచేశారు. గతంలో హైడ్రా అధికారులు చెరువు చుట్టూ కంచె ఏర్పాటు చేసినప్పటికీ, కొందరు దానిని తొలగించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ నేపథ్యంలో మరోసారి కంచె ఏర్పాటు చేసేందుకు హైడ్రా అధికారులు రావడాన్ని స్వాగతిస్తున్నట్లు బుధవారం



జగద్గిరిగుట్టలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పేర్కొన్నారు. గతంలో హైడ్రా కూల్చివేసిన ఇళ్లను సైతం కబ్జాదారులు తిరిగి నిర్మిస్తున్నారని, చెరువు పరిసరాల్లోని స్థలాలను రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు విక్రయిస్తూ అమాయక ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. ఈ మోసాలపై బాధితులు గతంలో మీడియా దృష్టికి తీసుకువచ్చినప్పటికీ, అధికారులు సమగ్ర విచారణ చేపట్టకపోవడం, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్లే తిరిగి అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా హైడ్రా అధికారులు పటిష్టమైన కంచె ఏర్పాటు చేసి, గతంలో కంచెను తొలగించిన వారిని గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నగరంలోని అనేక చెరువులను పరిరక్షిస్తూ సుందరీకరణ చేపడుతున్న హైడ్రా, పరికి చెరువును కూడా అదే విధంగా అభివృద్ధి చేసి అందంగా తీర్చిదిద్దాలని కోరారు. పరికి చెరువు అభివృద్ధి విషయంలో పలుమార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ స్పందన లేకపోవడం జగద్గిరిగుట్ట ప్రజల్లో అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. ఆ అనుమానాలకు తెరదించేలా హైడ్రా అధికారులు కంచె ఏర్పాటు చేయడంతో పాటు చెరువు పరిరక్షణకు శాశ్వత చర్యలు చేపట్టాలని సూచించారు. చెరువులను కాపాడుకోవడం భవిష్యత్ తరాల అవసరాలను, పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవడంతో సమానమని ఉమామహేష్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో ప్రజానాట్యమండలి గౌరవాధ్యక్షులు ప్రవీణ్, అధ్యక్షులు బాబు, యువజన సంఘం కార్యదర్శి కీర్తి పాల్గొన్నారు.

ఎల్ఓసి అందజేసిన ఎమ్మెల్యే

జగిత్యాల ప్రతినిధి, నవంబర్ 04, :

జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామానికి చెందిన మండల దేవయ్య అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స చేసుకొనే ఆర్థిక స్తోమత లేక బాధపడుతూ ఉండగా స్థానిక నాయకులు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ దృష్టికి మండల దేవయ్య మెదడు సంబంధిత సమస్యను తీసుకురాగా తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే మండల దేవయ్య శస్త్ర చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 2 లక్షల 50వేల ఎల్ఓసి మంజూరు చేయించి బుధవారం జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండల దేవయ్య కుటుంబ సభ్యులకు ఎల్ఓసీని



ఎమ్మెల్యే అందజేశారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపల్లి



మానకొండూర్ ప్రతినిధి, నవంబర్ 04, :
మండల కేంద్రమైన మానకొండూర్‌తో పాటు సదాశివపల్లి జగ్గయ్యపల్లి,గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మానకొండూర్, సదాశివపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో, జగ్గయ్యపల్లిలో హాకా ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ ధాన్యాన్ని విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ విజయ్ కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ద్యావ శ్రీనివాస్ రెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు నందగిరి రవీంద్ర చారి, మార్కెట్ కమిటీ చైర్మన్ రేవెల్లి రాజలింగం, వైస్ చైర్మన్ రేమిడి శ్రీనివాస్ రెడ్డి, మానకొండూర్ పీఏసీఎస్ చైర్మన్ నాగిశెట్టి రాజయ్య, ఊటూరు ముద్దసాని శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్లు ఎర్రోళ్ల కవిత చిరంజీవి, తమ్మిశెట్టి రాజేష్, రమణ, సతీష్ కుమార్, వేగోళం శ్రీనివాస్ గౌడ్, కనకం అశోక్, దూలం వీరస్వామి, కే. శ్రీనివాస్ రెడ్డి, రాపాక రాజేశ్వర్,
ఎం. సంపత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ప్రక్రియ వేగవంతం చేయాలి

అర్హులైన లబ్ధిదారులను త్వరితగతిన గుర్తించాలి

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్



జగిత్యాల ప్రతినిధి, నవంబర్ 04, :
జగిత్యాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగిత్యాల నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల ఎంపీడీవోలతో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ సమీక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. అర్హులైన లబ్ధిదారులను పారదర్శకంగా గుర్తించి, వారికి త్వరితగతిన ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ప్రొసీడింగ్స్ అందజేసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రంలో గుడిసెలు లేని తెలంగాణ లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. పేదల సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని పేర్కొన్నారు. గ్రామాల్లో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందని, ఈ ప్రక్రియలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. అదేవిధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా క్షేత్రస్థాయిలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓలు చిరంజీవి, రమాదేవి, నీరజ, భీమేష్, ఎంపీఓ వాసవి పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేసిన మంత్రి అడ్లూరి

జగిత్యాల/ధర్మపురి, నవంబర్ 04, :



ధర్మపురి మండలానికి నూతనంగా మంజూరైన ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవన నిర్మాణం కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలోని స్థలాన్ని తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ధర్మపురి నియోజకవర్గ విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించాలనే లక్ష్యంతో ధర్మపురి మండలానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను మంజూరు చేయించినట్లు తెలిపారు. కళాశాల ఏర్పాటు ద్వారా స్థానిక పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఉన్నత విద్య మరింత చేరువవుతుందని పేర్కొన్నారు. డిగ్రీ కళాశాల భవన నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో పరిశీలించినట్లు తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిర్మాణ పనులకు అవసరమైన తదుపరి చర్యలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా సదుపాయాలు కల్పించడంతో పాటు, విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, జగిత్యాల జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంఘనమట్ల దినేష్, ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి రాజేష్, చిలుము లక్ష్మణ్, కౌన్సిలర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పెదమిల గౌడ సంఘం అధ్యక్షులుగా బాస్నాపెల్లి మల్లయ్య గౌడ్ ఏకగ్రీవం

నూతనకల్, నవంబర్ 04, :



గౌడ సంఘం నూతన
పెదనేమిల గ్రామ శాఖ అధ్యక్షుడిగా భాస్నపల్లి మల్లయ్య గౌడ్ ను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏకగ్రీవానికి సహకరించిన గౌడ కులస్తులందరికి శాలువాలతో ఘనంగా సత్కరించారు. సంఘానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని నూతన అధ్యక్షులు బాస్నాపెల్లి మల్లయ్య గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ కుల పెద్దలు రేసు రామస్వామి, మల్లయ్య, గోడిశాల వెంకటయ్య, రామచంద్రు సాయిలు, రాజమల్లు నాగేష్, మల్లేష్, రమేష్, వెంకన్న, సాయి, బాస్నాపెల్లి రామచంద్రు, యాదగిరి, వీరాస్వామి, వెంకన్న, గుండగాని బుచ్చయ్య, వీరస్వామి, లక్ష్మయ్య, చక్రయ్య, సోమయ్య, వెంకన్న, రమేష్, మొల్గురి సోమయ్య, మల్లయ్య, సత్యనారాయణ, యాదయ్య, వెంకన్న, గడ్డమీది సత్యనారాయణ, వెంకటేశం, మురళి, పులి వెంకటయ్య, రాములు, ఉప్పలయ్య, దుసరి అబ్బయ్య, రమేష్, గడ్డం యాదయ్య, పరమేష్, గుర్రం వెంకన్న, బండి నాగేష్, ముప్పిడి వెంకన్న, సోమగాని శంకర్, జుజ్జురి రమేష్, తాళ్లపెల్లి జెన్నయ్య, ఇరగాని వెంకటయ్య, చామకూరి కృష్ణ, మేడి సాయిలు, పల్లి విజయ్ గౌడ్, గౌడ కులస్తులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ పనితీరుపై ప్రత్యేక ప్రధాన కార్యదర్శి క్షేత్రస్థాయి పరిశీలన

- తాగునీటి సరఫరాలో అంతరాయాలు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి
- అధికారులకు నవీన్ మిట్టల్ ఆదేశాలు



సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 04, :
గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రతిరోజూ సరిపడా, నాణ్యమైన శుద్ధమైన తాగునీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, గ్రామీణ పారిశుధ్య శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ పేర్కొన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండలం మంగోలు గ్రామ శివారులో ఉన్న మిషన్ భగీరథ నీటి శుద్ధి కేంద్రాన్ని ఆయన క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఫిల్టర్ హౌస్, ప్రయోగశాల, 75 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన శుద్ధజల నిల్వ కేంద్రాన్ని పరిశీలించి వాటి పనితీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ముందుగా జిల్లా కలెక్టర్ కట్టా హైమావతి ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం మిషన్ భగీరథ గ్రిడ్ ద్వారా వివిధ గ్రామాలకు అందుతున్న తాగునీటి సరఫరా, నీటి నిల్వ సామర్థ్యం, పంపింగ్ వ్యవస్థ, పైపులైన్ల పనితీరు, గ్రిడ్ నిర్వహణ తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు. క్షేత్రస్థాయిలో గ్రిడ్ పనితీరును పరిశీలిస్తూ తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయాలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.మిషన్ భగీరథ పథకం నిర్వహణపై అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, నీటి నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. సాంకేతిక సమస్యలు తలెత్తిన వెంటనే స్పందించి పరిష్కరించాలని, ప్రజలకు నిరంతరాయంగా స్వచ్ఛమైన తాగునీరు అందేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అంతకుముందు కుకునూరుపల్లి మండలంలోని తిప్పారం గ్రామంలో మల్లన్నసాగర్ తిప్పారం రా వాటర్ పంప్‌హౌస్‌ను సందర్శించి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఎన్‌సీ కృపాకర్ రెడ్డి, సీఈ రామచంద్ర, ఎస్ఈలు వెంకట్ రెడ్డి, రాజయ్య, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సామాజిక భద్రతా బోర్డు సభ్యుడిగా కళాల్ శ్రీనివాస్ నియామకం

- ఎల్ఐసీ ఏజెంట్ల సంఘం ఆధ్వర్యంలో ఘన సన్మానం
- కార్మికుల సామాజిక భద్రతకు కృషి చేయాలి
- ఏజెంట్లకు పీఎఫ్, ఇన్సూరెన్స్‌తో పాటు సంక్షేమ ప్రయోజనాలు కల్పించాలి

సిద్దిపేట ప్రతినిధి, నవంబర్ 04, : అసంఘటిత కార్మికుల హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం జాతీయ స్థాయిలో కృషి చేసే అరుదైన అవకాశం బీఎంఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కళాల్ శ్రీనివాస్‌కు లభించింది. అసంఘటిత కార్మికుల జాతీయ సామాజిక భద్రతా బోర్డు సభ్యుడిగా నియమితులైన సందర్భంగా భారతీయ జీవిత బీమా ఏజెంట్ల సంఘం (ఎల్ఐసీ) సిద్దిపేట బ్రాంచ్ ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం సిద్దిపేటలోని బీఎంఎస్ కార్యాలయంలో సంఘం ప్రతినిధులు కళాల్ శ్రీనివాస్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, భగవద్గీతను బహూకరించారు. నూతన బాధ్యతలు చేపట్టిన ఆయనకు అభినందనలు తెలియజేస్తూ, కార్మికుల సంక్షేమం కోసం మరింత సమర్థవంతంగా సేవలందించాలని ఆకాంక్షించారు. అనంతరం ఎల్ఐసీ ఏజెంట్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా జీవిత బీమా ఏజెంట్లు సంఘటిత రంగానికి చెందినవారా? అసంఘటిత రంగానికి చెందినవారా? అనే అంశంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. ఏజెంట్లకు వర్తించే కార్మిక చట్టాలు, సామాజిక భద్రతా పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు పీఎఫ్, ఇన్సూరెన్స్ వంటి సదుపాయాలు కల్పించేలా ప్రభుత్వ స్థాయిలో చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నో ఏళ్లుగా ప్రజలకు జీవిత బీమా సేవలు అందిస్తూ, ఎల్ఐసీ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న ఏజెంట్లకు తగిన గుర్తింపు, గౌరవం, ఆర్థిక భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని ప్రతినిధులు పేర్కొన్నారు. జాతీయ సామాజిక భద్రతా బోర్డు సభ్యుడిగా తనకున్న అధికారాలు, బాధ్యతలను సద్వినియోగం చేసుకొని అసంఘటిత



కార్మికుల హక్కుల పరిరక్షణతో పాటు ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ సిద్దిపేట బ్రాంచ్ గౌరవ అధ్యక్షులు మాంకాల లక్ష్మయ్య, బ్రాంచ్ ఇన్‌చార్జి ఎర్రమరాజు సాయికృష్ణ, సికింద్రాబాద్ డివిజన్ ఆర్గనైజేషన్ సెక్రటరీ కోమటిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జక్కుల రవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో మహిళా కళాశాల విద్యార్థిని ప్రతిభ

- ఉత్తమ ప్రతిభ కనబరిచి కళాశాల కీర్తిని పెంచిన తీగుళ్ల కీర్తన

సిద్దిపేట జిల్లా ప్రతినిధి, నవంబర్ 04, :



రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థిని తీగుళ్ల కీర్తన ఉత్తమ ప్రతిభ కనబరిచి కళాశాలకు గుర్తింపు తీసుకురావడం పట్ల కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జీవన్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. కళాశాలలో బీఎస్సీ (బీజెడ్‌సీ) చదువుతున్న కీర్తన రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొని తన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించడం అభినందనీయమని ప్రిన్సిపల్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమెను ప్రత్యేకంగా అభినందించి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఎదుర్కొనే ఒత్తిడిని అధిగమించడంతోపాటు ప్రతికూల పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొనే ఆత్మవిశ్వాసాన్ని క్రీడలు పెంపొందిస్తాయని తెలిపారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి ప్రభుత్వంతోపాటు వివిధ సామాజిక సంస్థల నుంచి ప్రోత్సాహకాలు, అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకూ సమాన ప్రాధాన్యతను ఇస్తూ అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్వేత, డాక్టర్ స్రవంతి, డాక్టర్ సువర్ణదేవి, కిషోర్, హరిప్రసాద్, క్రీడలు, ఆటల విభాగం ఇన్‌చార్జి డాక్టర్ స్వప్నతోపాటు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని విద్యార్థిని కీర్తనను అభినందించారు.

పట్టభద్రులందరూ ఓటరుగా నమోదు కావాలి

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతుల పాత్ర కీలకం వడ్డేపల్లి రాజేశ్వరరావు

కూకట్‌పల్లి ప్రతినిధి, నవంబర్ 04, :
హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం కూకట్‌పల్లి డివిజన్ పరిధిలో బీజేపీ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. డివిజన్ బీజేపీ అధ్యక్షులు దుర్గాప్రసాద్ రావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా పట్టభద్రులతో సమావేశమైన వడ్డేపల్లి రాజేశ్వరరావు ఓటరు నమోదు ప్రక్రియపై అవగాహన కల్పించారు. అర్హత కలిగిన ప్రతి పట్టభద్రుడు తప్పనిసరిగా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతుల పాత్ర ఎంతో కీలకమని, ప్రజాస్వామ్య వ్యవస్థలో చురుకుగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి డివిజన్‌లో పట్టభద్రులను గుర్తించి, అర్హులైన వారందరూ ఓటరుగా నమోదు అయ్యేలా బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలని కోరారు. ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా ప్రజాస్వామ్యంలో తమ అభిప్రాయాన్ని ప్రతిబింబించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా నాయకులు శ్రీనివాస్ గౌడ్, డివిజన్



ఎమ్మెల్సీ ఎన్రోల్మెంట్ కన్వీనర్ శంకర్ రెడ్డి, కో-కన్వీనర్ వినయ్, కొమ్ము ప్రభాకర్, ప్రశాంత్ రావు, రాహుల్ తేజ, శేఖర్ రావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే పనులను పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్
- రీ సర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్

జగిత్యాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 04, :



జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలంలోని వల్లంపల్లి, తొంబారావుపేట్ గ్రామాల్లో జరుగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ బుధవారం సత్యప్రసాద్ బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో కొనసాగుతున్న రీ సర్వే పనుల పురోగతిని, సర్వే నిర్వహిస్తున్న విధానాన్ని, భూ రికార్డుల వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. రీ సర్వే ప్రక్రియలో ఎలాంటి తప్పులు లేకుండా పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. రైతులు, భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సర్వే ప్రక్రియను చేపట్టాలని, భూముల హద్దులు, విస్తీర్ణం తదితర వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. సర్వే సమయంలో ఎదురయ్యే సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రీ సర్వే ద్వారా భూ రికార్డుల్లో ఖచ్చితత్వం ఉండేలా చూడాలని, నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం పనులను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీఓ జీవాకర్ రెడ్డి, తహసీల్దార్, సంబంధిత అధికారులు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.



సాహితీ మహారథి దాశరథి

నేడు దాశరథి వర్ధంతి

“నా తెలంగాణ కోటి రతనాల వీణ’ అని నినదించి నిజాంపాలనపై కలం ఎత్తిన దాశరథి కృష్ణమాచార్య సాహితీ ప్రస్థానంలో అభ్యుదయ కవి. నిజాంకు వ్యతిరేక ఉద్యమంలో పాల్గొని జైలుకు వెళ్లి...“ ఓ నిజాము పిశాచమా? కానరాదు / నిన్నుబోలిన రాజు మాకెన్నడేని? అంటూపళ్ళు తోముకోవడానికిచ్చే బొగ్గుతో నిజామాబాద్ జైల్లో(ఖిల్లా) ఉన్నపుడు, జైలు గోడల మీద పద్యాలు రాసి దెబ్బలు తిని, అక్కడ నుంచే తన కవిత్వం ద్వారా పోరాటాన్ని కొనసాగించిన ధీశాలి దాశరథి కృష్ణమాచార్యులు. ‘నా గీతావళి ఎంత దూరము ప్రయాణంబౌనో అందాక ఈ భూగోళంబునకగ్గి పెట్టెద’ అని ఆయన నినదించారు. ‘ననుగని పెంచినట్టి కరుణామయి నా తెలంగాణ’ అని అంటూ దాశరథి పుట్టిన ప్రాంతంపై మమకారాన్ని చాటుకోవటంతో పాటు రుద్రవీణ కావ్యాన్ని తెలంగాణకు అంకితమిచ్చారు. ‘అనాదిగా సాగుతోంది – అనంత సంగ్రామం అనాథునికీ ఆగర్భ శ్రీమంతునికీ మధ్య’ అంటూ తనలోని సామ్యవాద ఆలోచనలను దాశరథి వ్యక్తీకరించారు. తెలంగాణ ప్రజల కన్నీళ్లను ‘అగ్నిధార’గా మలిచి నిజాం పాలన మీదికి ఎక్కుపెట్టిన మహాకవి దాశరథి కృష్ణమాచార్య. దాశరథి గా ఆయన సుప్రసిద్ధుడు. పద్యాన్ని పదునైన ఆయుధంగా చేసుకొని తెలంగాణ విముక్తి కోసం ఉద్యమించిన దాశరథి ప్రాతఃస్మరణీయుడు. “నా తెలంగాణ కోటి రతనాల వీణ” అని గర్వంగా ప్రకటించి తెలంగాణ ఉద్యమానికీ ప్రేరణనందించిన కవి దాశరథి. దాశరథి కృష్ణమాచార్య 1925 జూలై 22 న వరంగల్ జిల్లా (ప్రస్తుతం మహబూబాబాద్) చిన్న గూడూరు గ్రామంలో జన్మించాడు. బాల్యం ఖమ్మం జిల్లా మధిరలో గడిచింది. ఉర్దూలో మెట్రిక్యులేషను, భోపాల్ విశ్వవిద్యాలయం నుండి ఇంటర్మీడియెట్, ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి ఇంగ్లీషు సాహిత్యంలో బియ్యే చదివాడు. సంస్కృతం, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో మంచి పండితుడు. చిన్నతనంలోనే పద్యం అల్లటంలో ప్రావీణ్యం సంపాదించాడు. ప్రారంభంలో కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా ఉండి రెండో ప్రపంచయుద్ధం సమయంలో ఆ పార్టీ వైఖరి నచ్చక ఆ పార్టీ నుంచి బయటకు వచ్చి, హైదరాబాదు సంస్థానంలో నిజాం అరాచక ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో పాలుపంచుకున్నాడు. నిజాం పాలనలో రకరకాల హింసలనుభవిస్తున్న తెలంగాణాను చూసి చలించిపోయాడు. పీడిత ప్రజల గొంతుగా మారి నినదించాడు. ”మా నిజాం రాజు జన్మజన్మల బూజు”.రైతుదే తెలంగాణము రైతుదే. ముసలి నక్కకు రాచరికంబు దక్కునే అని గర్జించాడు. దగాకోరు బటాచోరు రజాకారు పోషకుడవు, దిగిపొమ్మని జగత్తంత నగారాలు కొడుతున్నది, దిగిపోవోయ్, తెగిపోవోయ్’ అని నిజాముని సూటిగా గద్దిస్తూ రచనలు చేసాడు. ఆంధ్రమహా సభలో చైతన్యవంతమైన పాత్ర నిర్వహించి నిజాం ప్రభుత్వం చేత జైలు శిక్ష అనుభవించాడు. నిజామాబాదు లోని ఇందూరు కోటలో ఆయన్ని మరో 150 మందితో ఖైదు చేసి ఉంచింది, నిజాము ప్రభుత్వం. ఆయనతో పాటు ఖైదులో వట్టికోట ఆళ్వారుస్వామి కూడా ఉన్నాడు. . మంచి ఉపన్యాసకుడు. భావప్రేరిత ప్రసంగాలతో ఊరూరా సాంస్కృతిక చైతన్యం రగిలించాడు. ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్మాతల్లో ఒకడు. 1953లో తెలంగాణ రచయితల సంఘాన్ని స్థాపించి అధ్యక్షుడుగా జిల్లాల్లో సాహితీ చైతన్యాన్ని నిర్మించాడు. ఉపాధ్యాయుడిగా, పంచాయితీ ఇన్స్పెక్టరుగా, ఆకాశవాణి ప్రయోక్తగా ఉద్యోగాలు చేసాడు. ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవిగా 1977 ఆగష్టు 15 నుండి 1983 వరకు పనిచేసాడు. రాష్ట్ర, కేంద్ర సాహిత్య అకాడమీ బహుమతులు గెల్చుకున్నాడు. సాహిత్యంలో దాశరథి అనేక ప్రక్రియల్లో కృషి చేసాడు. కథలు, నాటికలు, సినిమా పాటలు, కవితలు రాసాడు. అనేక సినిమాలకు గీతాలు రచించి అభిమానుల్ని సంపాదించుకున్నాడు. మీర్జాగాలిబ్ ఉర్దూ గజళ్ళను తెలుగులోకి గాలిబ్ గీతాలు పేర అనువదించాడు. తల్లి మీద, తల్లి తెలంగాణ మీద ఆయన రచించిన పద్యాలు ఇప్పటికీ ఎందరికో ఉత్తేజాన్ని కలిగిస్తున్నాయి. “అగ్ని ధారను తన జైలు సహవాసి.. వట్టికోట అళ్వారు స్వామికి అంకితమిచ్చాడు. మరో కవితా సంపుటి రుద్రవీణను.. తెలంగాణా ప్రజలకు అంకితమిచ్చాడు. ఈయన రాసిన ‘తిమిరంతో సమరం’ కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం పొందింది. ‘కవితా పుష్పకం’ అనే కావ్యానికి ఆంధ్రప్రదేశ సాహిత్య అకాడమీ బహుమతి లభించింది. దాశరథి ‘బాల సరస్వతి తెలుగు-ఇంగ్లీషు నిఘంటువును’ రాశారు. గీతగోవింద వ్యాఖ్యానం చేశాడు. ఆంధ్ర విశ్వవిద్యాలయం దాశరథిని కళాప్రపూర్ణ అనే బిరుదుతో సత్కరించింది. 1953లో తెలంగాణా రచయితల సంఘాన్ని స్థాపించాడు. రుద్రవీణ, మహాంధ్రోదయం, మార్పు నా తీర్పు, ధ్వజమెత్తిన ప్రజ, మహాబోధి, పునర్నవం, అమృతాభిషేకం, నవమంజరి, గాలిబ్ గీతాలు, ఆలోచనా లోచనాలు, అమృతవల్లి, ధ్వజమెత్తిన ప్రజ (కవిత్వం). మస్తిష్కంలో లేబరేటరీ (విజ్ఞాన శాస్త్ర కవిత) తదితర 30 పుస్తకాలు వెలువరించాడు. రుబాయి, గజల్ ప్రక్రియలను మొదటిగా తెలుగులోకి అనుదించినది-దాశరథి. హీరాలాల్ మోరియా కవితలను తెలుగులోకి అనువదించాడు. ఆచార్య ఆత్రేయ తన దర్శకత్వంలో వచ్చిన ‘వాగ్దానం’ చిత్రంలో మొట్టమొదటి పాటను దాశరథితోనే రాయించారు. ‘నా కంటిపాపలో నిలిచిపోరా/ నీ వెంట లోకాలు గెలువనీరా’ అనే పాటలో దాశరథి చిన్న చిన్న పదాలతో చేసిన భావ ప్రకటన వింటే తనువు, మనసు పులకించకుండా ఉండవు. దాశరథి రాసింది మొదట ఈ పాటే అయినా, ఆయన పాటలు రచించిన ‘ఇద్దరు మిత్రులు’ సినిమా ముందుగా విడుదల అయింది. అందుకే ‘ఖుషీ ఖుషీగా నవ్వుతూ’ అనే పాటను దాశరథి మొదటి పాటగా చెపుతుంటారు. సినిమా పాటల కోసం ఖవ్వాలి అనే ఉర్దూ పాటల్ని అనుసరించారు. సినిమాల్లో వీణ పాటలు ఎక్కువ రాసిన ఘనత దాశరథికే దక్కుతుంది. పాటల రచయితగా దాశరథి చేసిన ప్రయోగాలు తెలుగు సినిమా ఉన్నంతకాలం నిలిచిపోతాయి. పొట్టివాడైనా గట్టివాడని చాలా మంది సంబోధించారు. ఈయన రాసిన నాటికల సంపుటి ‘నవమి’. ఈయన మహాశిల్పి జక్కన అనే చారిత్రక నవల రాశారు. తెలుగు పతాకం ఎరుగని దిశయే లేదు.. తెలుగు వెలుగు దూరలేని కోశం లేదు.. అని అన్నారు.“జండా ఒక్కటి మూడు వన్నెలది దేశం ఒక్కటే..” అన్నారాయన. అడుగడుగునా.. ఎడదనెత్తురు గడగడమని తాగినావు... అంటూ నిజాం నిరంకుశ పాలనను ఎత్తిచూపాడు. తీగెలను తెంపి అగ్నిలో దింపినావు/నా తెలంగాణ కోటి రత్నాల వీణ.”(అగ్నిధార) ప్రాణము లొడ్డి ఘోర గహనాటవులన్ పడగొట్టి.... తెలంగాణము రైతుదే, ముసలి నక్కకు రాచరికంబు దక్కునే”. కోటి కోటి దీపాలనేనురా తెలగాణ నిగళాల తెగగొట్టి ఆకాశమంతను బాటలలో, కోటలలో నాటండి ప్రజల్లారా.. వేటాడండి తమస్సును..“అనాదిగా సాగుతోంది – అనంత సంగ్రామం/అనాథునికీ ఆ గర్భశ్రీనాథునికీ మధ్య”. ఉన్నదాన్ని వున్న వాళ్లందరిలో పంచి / ఉన్నంతలో అందరం కలిసి భోంచేసి”...గతాన్ని కాదనలేను-వర్తమానం వద్దనబోను / భవిష్యత్తు వదులుకోబోను – కాలం నాకంఠమాల”.. హింసాయుద్ధం ఔట్ డేటెడ్ అని నేనంటాను / శాంతి ఒక్కటే మానవ జాతికి సిరియగు సొల్వేషన్”... అంటూ చైతన్యదీప్తిని నింపారు. 1987 నవంబరు 5 న దాశరథి మరణించారు.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

ఆపన్నులకు అండగా... రెడ్ క్రాస్ సంస్థ

నేడు భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ స్థాపన దినం

రెడ్ క్రాస్ సంస్థ ఏర్పాటు వెనక ఒక మానవతా మూర్తి స్ఫూర్తి ఉంది. స్విస్ పౌరుడు జీన్ హెన్రీ డునాంట్ 1859 లో ఒక వ్యాపార పర్యటనలో, ఆధునిక ఇటలీలో సోల్ఫెరినో యుద్ధం పరిస్థితులకు డునాంట్ సాక్షిగా నిలిచాడు. ఆ యుద్ధంలో 40వేల మంది మరణించారు, అధిక సంఖ్యాకులు గాయపడ్డారు. గాయపడిన వారికి సాయం అందకుండా, రక్షణ లేకుండా పోయిన హృదయ విదారక దృశ్యాలు కళ్ళారా చూశాడు. తన జ్ఞాపకాలు, అనుభవాలను ఎ మెమరీ ఆఫ్ సోల్ఫెరినో పుస్తకంలో రికార్డ్ చేశాడు. ఆ సంఘటన 1863 లో ఇంటర్నేషనల్ రెడ్ క్రాస్ కమిటీ (ఐసిఆర్సి) ఏర్పాటుకు ప్రేరణనిచ్చింది. యుద్ధాలు లేదా ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు తీవ్రంగా నష్టపోయిన వారిని ఆదుకుని వారికి ఆసరాగా నిలవడం కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన సంస్థే “రెడ్‌క్రాస్ సొసైటీ”. ఇది ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సేవా సంస్థలన్నింటిలో అతి పెద్దది. అది మానవతా ఉద్యమంగా రూపు దిద్దుకుంది. అలా ప్రపంచ వ్యాప్తంగా అనేక రకాల సమస్యలతో బాధ పడుతున్న, పేదలను ఆదుకోవాలనే ఉద్దేశం ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్సవానికి ప్రేరణగా నిలుస్తున్నది. అంతర్జాతీయ రెడ్‌క్రాస్ కమిటీ వ్యవస్థాపకుడు హెన్రీ డునాంట్ మే 08, 1863లో జన్మించారు. ఆయన గౌరవార్థం ఆయన జయంతి రోజున ఈ ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాన్ని జరుపు కుంటున్నారు. హెన్రీ డునాంట్ నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కూడా. హెన్రీ డునాంట్,1859 జూన్ 24న వ్యాపారం పని మీద లావర్డి నగరానికి వెళ్ళాడు. ఆ సమయంలో ఫ్రాన్స్ ఆస్ట్రియాల మధ్యన జరుగుతున్న యుద్ధం వల్ల గాయపడిన వేలాది స్త్రీ పురుషులు ప్రథమ చికిత్స లేక మరణించడం చూశాక, హృదయ విదారకమైన దృశ్యం అయన మనస్సులో చెరగని ముద్ర వేసింది. తన స్వంత పని మరచిపోయి ఆపదలోనున్న వారందరికీ సహాయం చేశాడు. యుద్ధం ముగిసాక ఆయన ప్రజలందరికీ ... “యుద్ధాలలో గాయపడిన వారందరికి, తక్కిన వారందరూ సహాయం చేయాలి. ఇది మానవ ధర్మం.” అని విజ్ఞప్తి చేశాడు. ఆయన విజ్ఞప్తి ప్రజలందరినీ ఆకట్టుకుంది. 1864లో జెనీవాలో అంతర్జాతీయ సమావేశం జరిగింది. రెడ్ క్రాస్ సంస్థాపనకు 14 దేశాలు తమ అంగీకారాన్ని తెలిపాయి. మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత 14 వ అంతర్జాతీయ సదస్సులో అంతర్జాతీయ కమిషన్ శాంతికి ప్రధాన సహకారిగా రెడ్‌క్రాస్‌ను ప్రవేశ పెట్టింది. టోక్యోలో 1934లో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ట్రూస్ సూత్రాలను ఆమోదించారు. అనంతరం రెడ్ క్రాస్ ను వివిధ ప్రాంతాలలో కూడా వర్తింప జేశారు. యుద్ధాలు లేదా ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు తీవ్రంగా నష్టపోయిన వారిని ఆదుకుని వారికి ఆసరాగా నిలవడం కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన సంస్థే రెడ్‌క్రాస్ సొసైటీ.



తొలి రోజుల్లో యుద్ధాల్లో గాయపడిన సైనికులకు సేవ చేయడానికి మాత్రమే ఇది పరిమితమై ఉండేది. ఇంచుమించు ప్రపంచంలోని అన్ని దేశాలలోను రెడ్ క్రాస్ శాఖలు, యుద్ధ సమయాలలో, శాంతి కాలం లోను నిర్విరామంగా పనిచేస్తునే ఉంటాయి. జాతి, కుల, మత విచక్షణా భేదం లేకుండా నిస్సహాయులకు ఇది సేవ చేస్తుంది. శాంతి కాలంలో రెడ్ క్రాస్ కార్య కలాపాలు...ప్రథమ చికిత్స, ప్రమాదాలు జరగకుండా చూడడం, త్రాగే నీటిని పరిశుభ్రంగా ఉంచటం, నర్సులకు శిక్షణ నివ్వడం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నడపటానికి మంత్రసానులకు శిక్షణ, వైద్య శాలలను స్థాపించడం, రక్త నిధులు సేకరించడం, మొదలైన పనులు చేస్తుంటుంది. 1965 వియన్నాలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో, మానవత, నిష్పాక్షికత, సమ తౌల్యత, స్వతంత్రం, వాలంటరీ సేవ, ఐక్యత, విశ్వజనీయత...ఏడు ప్రాథమిక సూత్రాలు ఆమోదింపబడినవి. ఈ సూత్రాలను ఉద్యమం మొత్తంలో అమలు పరచాలని తీర్మానించ బడింది.1986 లో జరిగిన సదస్సులోనూ మార్పులు చేర్పులు జరిగాయి. 1876 నుండి 1878 వరకూ జరిగిన రష్యా – టర్కీ యుద్ధ సమయంలో ఉస్మానియా సామ్రాజ్యం రెడ్ క్రాస్ కు బదులుగా రెడ్ క్రెసెంట్ ఉపయోగించింది. క్రాస్ గుర్తు క్రైస్తవ మతానికి చెందినదని, దీని ఉపయోగం వలన తమ సైనికుల నైతిక బలం దెబ్బతింటుందని టర్కీ ప్రతిపాదించింది. రష్యా ఈ విషయంలో సంపూర్ణ అంగీకారాన్ని ప్రకటించింది. 1929 జెనీవాలో జరిగిన సదస్సులో 19వ అధికరణ ప్రకారం ఆమోదం పొంది, స్విడ్జర్లాండ్ దేశపు జాతీయ జెండాలోని ఎర్రని బ్యాక్‌గ్రౌండ్‌లో తెల్లని క్రాస్ ను తారుమారు చేసి తెల్లని బ్యాగ్‌గ్రౌండ్‌లో ఎర్రని క్రాస్‌ను లోగోగా ఏర్పరిచారు. అనేక దేశాలలో రానురాను దీని ఉపయోగం సాధారణ మయినది. రెడ్ క్రాస్ ప్రైవేట్ సంస్థ కింద 1863 లో స్థాపించిన, అలాగే 1919 లో స్థాపింపబడిన, అంతర్జాతీయ రెడ్‌క్రాస్ కమిటీ (×జ=జ), అంతర్జాతీయ రెడ్‌క్రాస్, రెడ్‌క్రెసెంట్ సంఘాల సమాఖ్య (×ఖీ=జ), స్విట్జర్లాండ్ లోని జెనీవా నగరంలో ప్రధాన కేంద్రంగా అనుబంధ సంస్థలు పనిచేస్తున్నాయి. హెన్రీ డ్యూనాండ్‌కు 1901లో తొలి నోబెల్ శాంతి బహుమతి లభించింది. రెడ్‌క్రాస్ సంస్థ 1917, 44, 63 సంవత్సరాలలో మూడు సార్లు నోబెల్ శాంతి బహుమతిని గెలుచుకుంది. అంతర్జాతీయ రెడ్‌క్రాస్, రెడ్‌క్రెసెంట్ ఉద్యమం ఒక అంతర్జాతీయ మానవతావాద ఉద్యమం. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సేవాసంస్థ లన్నింటిలో రెడ్ క్రాస్ సొసైటీ అతి పెద్దది. ఈ సంస్థలో ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 9.7 కోట్ల మంది సభ్యులు (కార్యకర్తలు) ఉన్నారు. మానవతా వాదాన్ని, మానవుల జీవితాలను, ఆరోగ్యాన్ని కాపాడడానికి అనునిత్యం శ్రమిస్తూ వుంటారు. జాతి, మత, కుల, వర్గ, వర్ణ, వయో భేదాలు లేకుండా సత్సంకల్పంతో పనిచేస్తూ వుంటారు. అత్యవసర పరిస్థితుల నుండి వారి ప్రాణాలను రక్షించడానికి రెడ్ క్రాస్ సంస్థలు ఎంతో కృషి చేస్తాయి. మానవతా దృష్టితో ప్రారంభమైన ఈ రెడ్‌క్రాస్ ఉద్యమంలో నేడు ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, విద్యా సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొంటున్నాయి. భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ 1920 నవంబర్లో 5న స్థాపించబడి, ఢిల్లీ ప్రధానకేంద్రంగా విశేష సేవలు అందిస్తూ, ప్రజాదరణ పొందుతున్నది.

ఐఆర్‌సిఎస్ 1920 లో స్వచ్ఛంద మానవతా సంస్థగా స్థాపించబడింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 1,100 కి పైగా శాఖల నెట్‌వర్క్‌తో, ఇది విపత్తులు , అత్యవసర సమయాల్లో సహాయం అందిస్తోంది, అలాగే పేదలు, బలహీనుల సంరక్షణను ప్రోత్సహిస్తుంది. ఇది ప్రపంచంలోని అతిపెద్ద స్వతంత్ర మానవతా సంస్థ, అంతర్జాతీయ రెడ్‌క్రాస్ , రెడ్ క్రెసెంట్ ఉద్యమంలో ప్రముఖ సభ్యసంస్థ. భారత రెడ్‌క్రాస్ మిషన్ అన్ని రకాల మానవతా కార్యకలాపాలను చేపట్టడం, ప్రోత్సహించడం చేస్తోంది.. మానవాళి బాధలను తగ్గించవచ్చు , నివారించవచ్చు తద్వారా శాంతికి మరింత సానుకూలమైన వాతావరణాన్ని సృష్టించడానికి దోహదం చేస్తుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

‘సునామీ’లపై అవగాహన అవసరం

నేడు ప్రపంచ సునామీ అవగాహన దినం

సునామీలు అరుదుగా సంభవిస్తాయి. వస్తే మాత్రం మానవాళికి అమితంగా నష్టం చేకూరుస్తాయి. క్షణాల్లో ప్రాణాలను కబళిలిస్తాయి. ఊరూవాడ మొత్తాన్ని ఏకం చేస్తాయి. భారీగా ప్రాణనష్టం, ఆస్తినష్టానికి కారణ భూతాలు అవుతాయి. సునామీ లపై ప్రజలలో అవగాహన స్థాయి పెంచేందుకు ప్రతియేటా నవంబర్ 5న ప్రపంచ సునామీ అవగాహన దినోత్సవంగా పాటించాలని ఐక్యరాజ్య సమితి పిలుపు నిచ్చింది. క్రీ.పూ. 426 ఆరంభంలో గ్రీకు చరిత్ర కారుడు తుసైదిదేస్ తన పుస్తకం పెలిపొంనేసియన్ యుద్ధ చరిత్రలో సునామి కలుగచేసే కారణముల గురించి చర్చించి, అవి భూకంపం వల్లే సంభవిస్తాయని చెప్పాడు. ప్రపంచ వ్యాప్తంగా వందేళ్లలో 58 సునామీలు సంభవించాయి. రెండున్నర లక్షల మంది మృత్యువాత పడ్డారు. 2004లో వచ్చిన సునామీతో సుమారు 2,40,000 మంది వరకు అసువులు బాసారు. మరో 48,000 మంది కనిపించకుండా పోయిన విషయం విదితమే. ఈ సునామీ 14దేశాల వారిని ప్రభావితం చేసింది. అంతకు ముందు 1960 మేలోనూ, 1945 నవంబర్‌లోనూ సునామీలు సంభవించాయి. జపాన్ కు చెందిన గోహి అనే రైతు 1985లో సముద్రం వెనక్కి వెళ్లడాన్ని గుర్తించాడు. శబ్ద తరంగాల్లో మార్పును గమనించాడు. దీంతో సునామీ రాబోతుందని గుర్తించాడు. ప్రజలకు హెచ్చరిక చేయడానికి తన వరిపొలం మొత్తాన్ని తగుల బెట్టాడు. ఈ మంటల ద్వారా ప్రజలు రానున్న ఉపద్రవాన్ని గుర్తిస్తారని భావించి రైతు ప్రజల ప్రాణరక్షణకు పూనుకున్నాడు. ఇలా ఆయన ప్రేరణతో “వరల్డ్ సునామీ అవేర్నెస్ డే” వచ్చింది. అప్పటి వరకు సునామీపై ముందస్తు సమాచారం అందించే కేంద్రం ప్రపంచ దేశాల్లో ఎక్కడా లేదు. దీంతో భారత ప్రభుత్వం కూడా తేరుకుని సునామీ హెచ్చరిక కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఆ మేరకు అప్పటికే ఇంకాయిస్ ద్వారా మహా సముద్ర సమాచార సేవలు అందుతుండడంతో దీనికి అనుబంధంగానే సునామీ హెచ్చరిక కేంద్రం నెలకొల్పింది. 2005 నుంచి 2007 వరకు ఆపరేషన్ ప్రక్రియ కొనసాగింది. 2007లో పూర్తి స్థాయిలో “ఇండియన్ సునామీ ఎర్లీ వార్నింగ్ సిస్టం” కేంద్రంగా అవతరించింది. మత్స్యకారులకు ఉపయోగకర సేవల కోసం హైదరాబాద్ లో 1999లో ప్రగతినగర్ సమీపంలో పొటెన్షియల్ ఫిషింగ్ జోన్ (పీఎఫ్జెడ్)గా ఇంకాయిస్ ఆవిర్భవించింది. సునామీకి ముందు మొదట సముద్రంలో భూమి కంపిస్తుంది. అలా భూప్రకంపనలు జరిగిన 5--6 నిమిషాలకు ఇంకాయిస్ కు సమాచారం అందుతుంది. సముద్ర భూభాగంలో అమర్చిన సిస్మో మీటర్ల ఆధారంగా శాటిలైట్ ద్వారా భూకంపనలు జరిగిన సమాచారం ఇంకాయిస్ కు చేరుతుంది. ఆ తర్వాత భూకంపం ప్రభావంతో సునామీ ఉత్పన్నమయ్యే అవకాశం ఉందా? లేదా? అనే దానిపై దృష్టి సారిస్తారు. సముద్ర జలాలకు



కొద్ది కి.మీ దూరంలో ఏర్పాటుచేసిన ‘సునామీ బోయ్ నెట్‌వర్క్’ పరికరాల ఆధారంగా కెరటాల ఎత్తు, వాయు దిశను పరిశీలించి సునామీని గుర్తిస్తారు. సునామీ అన్న పదం జపనీస్ భాషకు చెందింది. హార్బర్ కెరటం అని దీని అర్థం. సునామీలు ఏర్పడినప్పుడు రాకాసి అలలు 100 అడుగుల ఎత్తు వరకు వెళతాయి. పసిఫిక్ మహాసముద్రంలో రింగ్ ఆఫ్ ఫైర్ కారణంగానే 80 శాతానికి పైగా సునామీలు సంభవిస్తున్నాయి. సునామీ అలలు గంటకి 805 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి. ఒక జెట్ విమానం స్పీడ్‌తో ఇది సమానం. ప్రపంచంలో జపాన్ తర్వాత అమెరికాలోని హవాయి, అలస్కా, వాషింగ్టన్, ఒరెగాన్, కాలిఫోర్నియాకు సునామీ ముప్పు ఎక్కువ. అందులో హవాయి దీవులకి ఉన్న ముప్పు మరెక్కడా లేదు. ప్రతీ ఏడాది అక్కడ సునామీ సంభవిస్తుంది. ప్రతీ ఏడేళ్లకి తీవ్రమైన సునామీ ముంచేస్తుంది. హిందూ మహాసముద్రంతో అనుబంధంగా ఉన్న 28 దేశాలకు సునామీ హెచ్చరికలు మన హైదరాబాద్ నుంచే వెళుతాయని చాలా మందికి తెలియని విషయం. సముద్రాల్లో ఏర్పడే భూప్రకంపనల నుంచి సునామీ రాక.. సముద్రపు అలల ఎత్తు.. వేగం.. వాటి తీవ్రత ఏమేర ఉంటుందో నిమిషాల్లో భారత్ తో పాటు ఆయా దేశాలకు చేరవేసే ‘విజ్ఞాన వాహిని’ భాగ్యనగర సొంతమనే విషయం గర్వకారణం. నగర కీర్తి కెరటంగా ‘ఇంకాయిస్’ (భారత జాతీయ మహా సముద్ర సమాచార సేవా కేంద్రం) పరిధ విల్లుతోంది. ప్రపంచంలో మూడు దేశాల్లో సునామీ హెచ్చరిక కేంద్రాలు ఉంటే అందులో హైదరాబాద్ లోని ఇంకాయిస్ ఒకటి. మిగతా రెండు ఇండోనేషియా, ఆస్ట్రేలియా దేశాల్లో ఉన్నాయి. సముద్రంలో చేపలు ఎక్కువగా లభ్యమయ్యే ప్రాంతాలను గుర్తించి వారికి చేరవేసే కేంద్రంగా మాత్రమే ఉండేది. ఆ తర్వాత కొద్ది కాలానికి “ఓషియన్ స్టేట్ పోర్కాస్ట్ సేవలను” ప్రారంభించింది. సముద్ర భాగంలో వాయు దిశ, అలల వేగం, వాటి ఎత్తు, ఉష్ణోగ్రత వివరాలను అందించే సేవలకు అంకురార్పణ చేసింది. సునామీ, సముద్ర విపత్తులపై ఇంకాయిస్ విస్తృతమైన అవగాహన కల్పిస్తోంది. ముఖ్యంగా తీర ప్రాంతాల్లో సునామీ మాక్ డ్రిల్స్ నిర్వహిస్తున్నారు. సునామీ వచ్చే సమయంలో సంకేతాలు ఏవిధంగా ఉంటాయి, ప్రకృతి పరంగా జరిగే మార్పులు, ప్రమాదం నుంచి బయట పడేందుకు అనుసరించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తోంది. ఆయా ఆధునిక పరికరాల ద్వారా సునామీ రాకను గుర్తించడమే కాకుండా తీరాన్ని ఎంత సమయంలో చేరుకుంటుంది, ఎంత ఎత్తులో కెరటాలు వస్తాయి, దాని తీవ్రత ఏమేర ఉంటుందో ఇంకాయిస్ అంచనా వేస్తుంది. అలా సేకరించిన సమాచారాన్ని జిల్లా స్థాయిలో ఉండే డిస్ట్రిక్ ఎమర్జెన్సీ సెంటర్లు, రాష్ట్ర స్థాయిలో ఉండే ఎస్ఈఓసీ (స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్), జాతీయ స్థాయిలో ఉండే ఎన్డీఎంఏ (నేషనల్ డిజాస్టర్ మేనేజ్మెంట్ అథారిటీ), ఎంహెచ్ఏ (మినిస్ట్రీ ఆఫ్ హోం సైన్సెస్)లకు వెబ్సైట్, మెయిల్, ఎస్ఎంఎస్ ల ద్వారా కేవలం పది నిమిషాల లోపే చేరవేస్తుంది. మూడు స్థాయిల్లో ఇంకాయిస్ సమాచారం అందిస్తుంది. వార్నింగ్, అలర్ట్, వాచ్ స్థాయిల్లో సందేశం పంపుతుంది.

రామ కిష్టయ్య సంగన భట్ల,
సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్, కాలమిస్ట్
9440595494

ఆక్లాండ్‌లో 'కింగ్' కోహ్లీ విధ్వంసం!

తొలి వన్డేలో న్యూజిలాండ్‌పై భారత్ ఘన విజయం

- ఐదు వికెట్ల తేడాతో కివీస్‌ను మట్టికరిపించిన టీమిండియా
- 51 బంతుల్లోనే 74 పరుగులు.. విరాట్ మెరుపు ఇన్నింగ్స్
- వర్షంతో మారిన లక్ష్యం.. 32 ఓవర్లలో 143 పరుగుల ఛేదన
- బౌలింగ్‌లో అర్ష్‌దీప్, గుర్నూర్, అన్షుల్ సత్తా
- మరో 56 బంతులు మిగిలి ఉండగానే విజయం.. సిరీస్‌లో 1-0 ఆధిక్యం



ఆక్లాండ్, నవంబర్ 4 : న్యూజిలాండ్ గడ్డపై భారత జట్టు విజయంతో వన్డే సిరీస్‌ను ప్రారంభించింది. ఆక్లాండ్‌లోని ఈడెన్ పార్క్ వేదికగా బుధవారం జరిగిన తొలి వన్డేలో టీమిండియా ఐదు వికెట్ల తేడాతో ఆతిథ్య న్యూజిలాండ్‌ను ఓడించింది. భారత బౌలర్లు సమష్టిగా రాణించి కివీస్‌ను తక్కువ స్కోరుకే పరిమితం చేయగా, పరుగుల ఛేదనలో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తనదైన శైలిలో చెలరేగిపోయాడు. కేవలం 51 బంతుల్లో 74 పరుగులు చేసి భారత విజయానికి బాటలు వేశాడు. వర్షం కారణంగా డక్‌వర్త్-లూయిస్-స్టెర్న్ పద్ధతిలో భారత్ లక్ష్యాన్ని 32 ఓవర్లలో 143 పరుగులుగా సవరించగా, టీమిండియా 22.4 ఓవర్లలోనే ఐదు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని అందుకుంది. దీంతో ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యంలో నిలిచింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్‌కు భారత పేసర్లు ఆరంభం నుంచే సవాల్ విసిరారు. అర్ష్‌దీప్ సింగ్ తన పదునైన బౌలింగ్‌తో ఓపెనర్లు విల్ యంగ్ (9), హెన్రీ నికోల్స్ (9)లను త్వరగానే పెవిలియన్‌కు పంపించాడు. దీంతో ఆతిథ్య జట్టు ఆరంభంలోనే ఒత్తిడిలో పడింది. టిమ్ సీఫెర్ట్ (38), గ్లెన్ ఫిలిప్స్ (30), డారిల్ మిచెల్ (28) కొంతసేపు ప్రతిఘటించినప్పటికీ భారీ భాగస్వామ్యాలను నెలకొల్పలేకపోయారు. భారత బౌలర్లు క్రమం తప్పకుండా వికెట్లు పడగొడుతూ కివీస్ బ్యాటర్లను కట్టడి చేశారు. అర్ష్‌దీప్ సింగ్ నాలుగు వికెట్లు పడగొట్టగా, గుర్నూర్ బ్రార్ మూడు వికెట్లతో రాణించాడు. అన్షుల్ కంబోజ్ కేవలం 22 పరుగులిచ్చి రెండు కీలక వికెట్లు సాధించాడు. చివర్లో బ్లెయిర్ టిక్నర్ (34), జాకబ్ డఫీ (15 నాటౌట్) పోరాడటంతో న్యూజిలాండ్ 40.2 ఓవర్లలో 185 పరుగులకు ఆలౌటైంది. లక్ష్య ఛేదనకు దిగిన భారత్‌కు ఆదిలోనే ఎదురుదెబ్బ తగిలింది. స్టార్ ఓపెనర్ రోహిత్ శర్మ ఖాతా తెరవకుండానే కైల్ జేమీసన్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. దీంతో భారత శిబిరంలో కాసేపు ఆందోళన నెలకొంది. అయితే క్రీజులోకి వచ్చిన విరాట్ కోహ్లీ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. ఒకవైపు గిల్ నిలకడగా ఆడుతుండగా, మరోవైపు కోహ్లీ కివీస్ బౌలర్లపై ఎదురుదాడికి దిగాడు. ఈ క్రమంలో వర్షం ఆటకు అంతరాయం కలిగించడంతో భారత్ లక్ష్యాన్ని డక్‌వర్త్-లూయిస్-స్టెర్న్ పద్ధతిలో 143 పరుగులకు సవరించారు. అనంతరం కోహ్లీ తన దూకుడును మరింత పెంచాడు. గిల్‌తో కలిసి రెండో వికెట్‌కు 113 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పాడు. విరాట్ కోహ్లీ బ్యాటింగ్ ఈ మ్యాచ్‌కే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. న్యూజిలాండ్ బౌలర్లకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా మైదానం నలువైపులా బౌండరీలు బాదాడు. కేవలం 51 బంతుల్లో 13 ఫోర్లు, ఒక సిక్సర్ సాయంతో 74 పరుగులు సాధించాడు. వన్డే క్రికెట్‌లో తన అనుభవాన్ని ప్రదర్శిస్తూనే పొట్టి క్రికెట్ తరహాలో దూకుడుగా ఆడాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ 56 బంతుల్లో 37 పరుగులు చేసి కోహ్లీకి చక్కటి సహకారం అందించాడు. కోహ్లీ, గిల్ భాగస్వామ్యంతో భారత్ విజయం దాదాపు ఖాయమైంది. అయితే చివరి దశలో జాకబ్ డఫీ బౌలింగ్‌లో కోహ్లీ, అక్షర్ పటేల్ వెంటవెంటనే అవుటవడంతో కాసేపు ఉత్కంఠ నెలకొంది. శ్రేయస్ అయ్యర్ 15 పరుగులు చేయగా, కేఎల్ రాహుల్ (3 నాటౌట్), నమన్ ధీర్ (5 నాటౌట్) మిగిలిన పరుగులు సాధించి విజయాన్ని పూర్తి చేశారు. బౌలింగ్‌లో సమష్టి ప్రదర్శన, బ్యాటింగ్‌లో కోహ్లీ దూకుడుతో భారత్ తొలి వన్డేలోనే పైచేయి సాధించింది. ముఖ్యంగా ప్రత్యర్థిని 185 పరుగులకే పరిమితం చేయడంలో భారత పేసర్లు కీలక పాత్ర పోషించారు. వర్షం కారణంగా లక్ష్యం మారినప్పటికీ భారత బ్యాటర్లు ఎలాంటి ఒత్తిడికి లోనుకాకుండా ఛేదనను పూర్తి చేశారు. ఈ విజయంతో ఐదు వన్డేల సిరీస్‌లో టీమిండియా శుభారంభం చేసింది. తొలి మ్యాచ్‌లోనే అద్భుత ఇన్నింగ్స్ ఆడిన కోహ్లీ మరోసారి తన బ్యాటింగ్ సత్తాను చాటాడు.



యూత్ ఒలింపిక్స్‌లో చారిత్రాత్మక కాంస్యం

స్విమ్మింగ్‌లో భారత్‌కు తొలి పతకం అందించిన యువ సంచలనం!

బెంగళూరు/న్యూదిల్లీ, నవంబర్ 4 : అంతర్జాతీయ క్రీడా వేదికపై భారత యువ స్విమ్మర్ ధినిధి దేశింగు చారిత్రాత్మక కాంస్య పతకంతో దేశ కీర్తిపతాకాన్ని ఎగురవేసింది. సెనెగల్‌లోని డాకర్‌లో అత్యంత వైభవంగా జరుగుతున్న యూత్ ఒలింపిక్స్ ఈవెంట్‌లో బెంగళూరుకు చెందిన 16 ఏండ్ల ఈ యువ సంచలనం అద్భుతమైన ప్రదర్శనతో మెరిసింది. స్విమ్మింగ్ విభాగంలో భారత క్రీడా చరిత్రలోనే తొలిసారిగా యూత్ ఒలింపిక్స్ పతకాన్ని అందించి సరికొత్త రికార్డు సృష్టించింది. మహిళల 100 మీటర్ల ఫ్రీస్టైల్ కేటగిరీలో తీవ్ర పోటీని తట్టుకుని నిలిచిన ధినిధి దేశింగు, నిర్దేశిత లక్ష్యాన్ని కేవలం 56.27 సెకన్లలోనే పూర్తి చేసి మూడో స్థానంలో నిలిచింది. ఈ నూతన టైమింగ్‌తో పతకంతో పాటు జాతీయ రికార్డును కూడా తన పేరిట లిఖించుకుంది. గతంలో ఏ భారతీయ ఈతగాడికీ సాధ్యంకాని ఈ అరుదైన ఘనతను సాధించి అంతర్జాతీయంగా దేశ ప్రతిష్ఠను చాటిచెప్పింది. ఈ చారిత్రాత్మక పతక సాధనపై భారత్ వ్యాప్తంగా ప్రశంసల వర్షం కురుస్తోంది. ధినిధి దేశింగు శిక్షణ, వికాసానికి అండగా నిలుస్తున్న ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ బజాజ్ ఫిన్‌సర్వ్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. బజాజ్ ఫిన్‌సర్వ్ లిమిటెడ్ గ్రూప్ చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ మనవ్ మియాన్‌వాల్ మాట్లాడుతూ.. ధినిధి సాధించిన ఈ విజయం దేశానికే గర్వకారణమని కొనియాడారు. క్రీడల్లో రాణించాలనుకునే వేలాది మంది యువ ప్రతిభావంతులకు ఈ విజయం గొప్ప స్ఫూర్తిగా నిలుస్తుందని, భవిష్యత్తులోనూ ఆమెకు సంపూర్ణ సహకారాన్ని అందిస్తామని తెలిపారు.

నచ్చిన ఆటగాళ్లను ఎంచుకోలేకపోయా

టీమిండియాపై సచిన్ ఆసక్తికర వ్యాఖ్యలు!

న్యూదిల్లీ, నవంబర్ 4 : క్రికెట్ దిగ్గజం, మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ భారత జట్టు నాయకత్వ బాధ్యతలు, తన కెప్టెన్సీ రోజుల నాటి పరిస్థితులపై ఆసక్తిక ర విషయాలను పంచుకున్నారు. రెడ్డిట్ సామాజిక మాధ్యమం వేదికగా నిర్వహించిన ప్రత్యేక ప్రశ్నోత్తరాల కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, తన ఫేవరెట్ కెప్టెన్లు ఎవరో వెల్లడించడంతో పాటు భారత కెప్టెన్‌గా పనిచేసిన రోజుల్లో ఎదురైన సవాళ్లను గుర్తుచేసుకున్నారు.టీమిండియా మాజీ సారథులు సౌరవ్ గంగూలీ, మహేంద్ర సింగ్ ధోనీలు తన ఫేవరెట్ కెప్టెన్ల జాబితాలో అగ్రస్థానంలో ఉంటారని సచిన్ స్పష్టం చేశారు. సౌరవ్ గంగూలీ నాయకత్వంలో 2003 వన్డే ప్రపంచ కప్ ఫైనల్ ఆడిన సచిన్, ఎంఎస్ ధోనీ సారథ్యంలో 2011లో స్వదేశంలో ప్రపంచ కప్ ట్రోఫీని ముద్దాడారు. ఈ ఇద్దరు నాయకులతో కలిసి ఆడిన అనుభవం తన సుదీర్ఘ క్రికెట్ కెరీర్‌లో ఎంతో ప్రత్యేకమైనదని పేర్కొన్నారు. ఇదే సమయంలో ప్రస్తుత దక్షిణాఫ్రికా టెస్టు కెప్టెన్ టెంబా బవుమా నాయకత్వ పటిమను, స్ఫూర్తిని సచిన్ ప్రత్యేకంగా ప్రశంసించారు. బవుమా ముందుండి జట్టును నడిపిస్తూ దక్షిణాఫ్రికాకు అద్భుత విజయాలు అందిస్తున్నారని, దక్షిణాఫ్రికా జట్టు ఐసీసీ టైటిల్ గెలవడం ప్రపంచ క్రికెట్‌కు ఎంతో మేలు చేస్తుందని అభిప్రాయపడ్డారు. కెప్టెన్సీ అనుభవం గురించి మాట్లాడుతూ.. భారత జట్టుకు నాయకత్వం వహించడం ఒక గొప్ప గౌరవంగా భావిస్తానని, అయితే ఆ రోజుల్లో తనకు నచ్చిన ఆటగాళ్లను పూర్తిగా స్వేచ్ఛగా జట్టులోకి ఎంపిక చేసుకునే అవకాశం ఎప్పుడూ లభించలేదని బాహాటంగా చెప్పారు. 1990వ దశకంలో బీసీసీఐ నాటి పరిస్థితులతో పోలిస్తే, ప్రస్తుతం ఎంతో వృత్తిపరమైన వ్యవస్థగా రూపాంతరం చెందిందని సచిన్ విశ్లేషించారు. సచిన్ 1996 నుంచి 2000 మధ్య రెండు విడతల్లో మొత్తం 25 టెస్టుల్లో భారత జట్టుకు నాయకత్వం వహించిన సంగతి తెలిసిందే. 2000లో దక్షిణాఫ్రికా చేతిలో టెస్టు సిరీస్ ఓటమి అనంతరం ఆయన కెప్టెన్సీ నుంచి తప్పుకోగా, 2007లో మరొకసారి వచ్చిన అవకాశాన్ని వద్దని చెప్పి ఆ బాధ్యతలను ధోనీకి అప్పగించేలా ప్రోత్సహించారు.






ఐఓఏ అథ్లెట్స్ కమిషన్ సభ్యులుగా సింధు, చాను

ఢిల్లీ: అగ్రశ్రేణి క్రీడాకారిణులు పీవీ సింధు, మీరాబాయి చాను సహా 10 మంది క్రీడాకారులు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) అథ్లెట్స్ కమిషన్ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ట్రాక్ అండ్ ఫీల్డ్ మాజీ అథ్లెట్ సుధా సింగ్ సోమవారం రాత్రి పోటీ నుంచి వైదొలగడంతో 10 పదవులు ఏకగ్రీవమయ్యాయి. దీంతో ఎన్నిక అవసరం లేదని భావించిన రిటర్నింగ్ అధికారి సంజయ్ శ్రీవాస్తవ 10 మంది ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు మంగళవారం ప్రకటించారు. అంతకుముందు సోమవారం స్టార్ షట్లర్ కిదాంబి శ్రీకాంత్ కూడా తన అభ్యర్థిత్వాన్ని ఉపసంహరించుకున్నాడు. దీంతో సింధు (బ్యాడ్మింటన్), చాను (వెయిట్ లిఫ్టింగ్), హర్మన్‌ప్రీత్ సింగ్ (హాకీ), సలీమా టెటె (హాకీ), స్వప్నిల్ కుశాలె (షూటింగ్), భవాని దేవి (ఫెన్సింగ్), తజిందర్‌సింగ్ తూర్ (అథ్లెటిక్స్), బాంబేలా దేవి (ఆర్చరీ), సాజన్ ప్రకాశ్ (స్విమ్మింగ్), మన్‌జీత్ సింగ్ (కయాకింగ్- కనోయింగ్)ల ఎన్నికకు మార్గం సుగమమైంది. అథ్లెట్స్ కమిషన్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవుల్లో (ఒకరు పురుషుడు, మరొకరు మహిళ) ఎన్నికైన వారు ఐఓఏ కార్యవర్గ మండలి (ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్)లో సభ్యులుగా బాధ్యతలు చేపడతారు. ఈ కమిషన్ నుంచి ఇద్దరు సభ్యులు (ఒకరు పురుషుడు, మరొకరు మహిళ) ఓటు హక్కుతో ఐఓఏ సర్వసభ్య సమావేశంలో సభ్యులుగా ఉంటారు. అథ్లెట్స్ కమిషన్‌లోని ఈ పదవులకు త్వరలోనే ఎన్నికలు జరుగనున్నాయి.

వయసు 39.. వేగం మాత్రం చిరుతను మించి!

మైదానంలో రోహిత్ శర్మ అద్భుత విన్యాసం

ఆక్లాండ్, నవంబర్ 4 : వయసు పెరిగినా ఆటలో వేగం తగ్గలేదని భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ మరోసారి నిరూపించాడు. 39 ఏళ్ల వయసులోనూ మైదానంలో చిరుతలా కదులుతూ అద్భుతమైన ఫీల్డింగ్‌తో అభిమానులను ఆశ్చర్యపరిచాడు. న్యూజిలాండ్‌తో ఆక్లాండ్ వేదికగా జరిగిన తొలి వన్డేలో ప్రమాదకర బ్యాటర్ డారిల్ మిచెల్‌ను రనౌట్ చేయడంలో కీలక పాత్ర పోషించాడు. బంతిని అడ్డుకునేందుకు వేగంగా పరుగెత్తడం, వెంటనే డైవ్ చేస్తూ వికెట్ల వైపు త్రో విసరడం ప్రేక్షకులను ఆకట్టుకుంది. రోహిత్ చురుకుదనానికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. అతడి ఫిట్‌నెస్‌లో వచ్చిన మార్పును అభిమానులు ప్రశంసిస్తున్నారు. న్యూజిలాండ్ ఇన్నింగ్స్ 22వ ఓవర్‌లో ఈ ఆసక్తికర సంఘటన చోటుచేసుకుంది. గ్లెన్ ఫిలిప్స్ ఆడిన బంతి షార్ట్ మిడ్ వికెట్ దిశగా వెళ్లింది. అక్కడ ఫీల్డింగ్ చేస్తున్న రోహిత్ శర్మ బంతిని అడ్డుకునేందుకు వేగంగా కదిలాడు. స్క్వేర్ లెగ్ వైపు పరుగెత్తి బంతిని అందుకున్న వెంటనే డైవ్ చేస్తూ వికెట్ల వైపు అద్భుతమైన త్రో విసిరాడు. బంతి నేరుగా వికెట్లను తాకకపోయినా వికెట్ కీపర్ కేఎల్ రాహుల్ అప్రమత్తంగా వ్యవహరించాడు. రోహిత్ విసిరిన బంతిని అందుకుని వెంటనే బెయిల్స్ పడగొట్టాడు. దీంతో డారిల్ మిచెల్ 28 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద రనౌటయ్యాడు. కీలక సమయంలో వికెట్ కోల్పోయిన న్యూజిలాండ్ మరింత ఒత్తిడిలో పడింది. రోహిత్ వేగానికి మిచెల్ సైతం ఆశ్చర్యపోయినట్లు కనిపించింది. గతంలో రోహిత్ శర్మ ఫిట్‌నెస్‌పై పలుమార్లు విమర్శలు వచ్చాయి. వయసు పెరుగుతున్న నేపథ్యంలో అంతర్జాతీయ క్రికెట్‌లో ఎంతకాలం కొనసాగగలడనే ప్రశ్నలు కూడా తలెత్తాయి. ముఖ్యంగా 2027 వన్డే ప్రపంచకప్‌లో అతడు ఆడగలడా అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. అయితే గత ఏడాదిన్నర కాలంగా రోహిత్ తన శారీరక దృఢత్వంపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఆస్ట్రేలియా పర్యటన నుంచి అతడి కదలికల్లోనూ, ఫీల్డింగ్‌లోనూ చురుకుదనం కనిపిస్తోంది. తాజాగా న్యూజిలాండ్‌పై చేసిన రనౌట్ అతడి ఫిట్‌నెస్‌కు మరో ఉదాహరణగా నిలిచింది. బంతిని వెంబడించిన తీరు, డైవ్ చేసిన విధానం, వేగంగా త్రో విసిరిన సమయస్ఫూర్తి అభిమానులను ఆకట్టుకున్నాయి. 2025 ఛాంపియన్స్ ట్రోఫీలో భారత జట్టును విజేతగా నిలిపిన రోహిత్ శర్మ ఆ తర్వాత వన్డే కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. అతడి స్థానంలో యువ బ్యాటర్ శుభ్‌మన్ గిల్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగించారు. దీంతో రోహిత్ అంతర్జాతీయ క్రికెట్ భవిష్యత్తుపై చర్చ మొదలైంది. అయితే కెప్టెన్సీ లేకపోయినా జట్టులో తన పాత్రను సమర్థంగా నిర్వర్తించేందుకు రోహిత్ కృషి చేస్తున్నాడు. బ్యాటింగ్‌తోపాటు ఫీల్డింగ్‌లోనూ మెరుగైన ప్రదర్శన కనబరచడంపై దృష్టి పెట్టాడు. ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో వన్డే క్రికెట్‌కే పరిమితమైన రోహిత్‌కు 2027 ప్రపంచకప్ ప్రధాన లక్ష్యంగా మారిందని క్రికెట్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ మ్యాచ్‌లో భారత బౌలర్లు కూడా సమష్టిగా రాణించారు. టాస్ గెలిచిన కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలుత బౌలింగ్ ఎంచుకోగా, ఆ నిర్ణయాన్ని భారత పేసర్లు సమర్థించారు. క్రమం తప్పకుండా వికెట్లు పడగొడుతూ న్యూజిలాండ్ బ్యాటర్లపై ఒత్తిడి పెంచారు. కివీస్ ఇన్నింగ్స్ 31 ఓవర్లు ముగిసే సమయానికి ఏడు వికెట్ల నష్టానికి 131 పరుగులు చేసింది. ఆ దశలో గ్లెన్ ఫిలిప్స్ 27 పరుగులతో, కైల్ జేమీసన్ ఒక పరుగుతో క్రీజులో ఉన్నారు. 2027 వన్డే ప్రపంచకప్‌లో రోహిత్ శర్మను మరోసారి భారత జెర్సీలో చూడాలని అభిమానులు ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో అతడి ఫిట్‌నెస్, బ్యాటింగ్ ప్రదర్శనలపై ప్రత్యేక దృష్టి నెలకొంది. న్యూజిలాండ్‌తో తొలి వన్డేలో చేసిన అద్భుత రనౌట్ ద్వారా ఫీల్డింగ్‌లోనూ తాను చురుకుగా ఉన్నానని రోహిత్ చాటాడు. వయసు కేవలం సంఖ్య మాత్రమేనని నిరూపించేలా అతడి డైవ్ ఉందంటూ అభిమానులు సామాజిక మాధ్యమాల్లో ప్రశంసలు కురిపిస్తున్నారు.





భారత త్రయానికి స్వర్ణం



దోహా: ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ చాంపియన్‌షిప్స్ పురుషుల 50 మీటర్ల పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో రవీందర్ సింగ్, సౌరభ్ చౌదరి, అమన్‌ప్రీత్ సింగ్‌తో కూడిన భారత త్రయం పసిడిని గురిపెట్టింది. ఫైనల్‌లో ఈ త్రయం.. 1659 పాయింట్లు స్కోరు చేసి బంగారు పతకాన్ని నెగ్గింది. ఇదే ఈవెంట్ వ్యక్తిగత విభాగంలో రవీందర్ సింగ్ 559 పాయింట్లతో రజతాన్ని గెలిచాడు.



హీరోయిన్లకూ భారీ కటౌట్లు ఉండాల్సిందే!

హీరోలతో సమానంగా కథానాయికలకూ గుర్తింపు దక్కాలి: రెజీనా

చెన్నై/హైదరాబాద్, నవంబర్ 4 : సాధారణంగా చిత్ర పరిశ్రమలో అగ్ర కథానాయకులకు థియేటర్ల వద్ద అభిమానులు భారీ కటౌట్లు ఏర్పాటు చేయడం చూస్తుంటాం. అయితే అదే స్థాయిలో హీరోయిన్లకూ అభిమానుల నుంచి తగిన గుర్తింపు, గౌరవం దక్కాలని నటి రెజీనా అభిప్రాయపడ్డారు. స్టార్ హీరోయిన్ నయనతార నటిస్తున్న 'మూకుత్తి అమ్మన్-2' (తెలుగులో 'మహాశక్తి') సినిమా విడుదల సందర్భంగా ఆమెకు అభిమానులు 60 అడుగుల భారీ కటౌట్‌ను ఏర్పాటు చేయడంపై రెజీనా తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. గతంలో కేవలం హీరోలకే పరిమితమైన ఈ సంస్కృతి ఇప్పుడు కథానాయికలకూ విస్తరించడం చిత్ర పరిశ్రమలో వస్తున్న గొప్ప పరిణామమని పేర్కొన్నారు. సుందర్ సి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో రెజీనా తొలిసారి ప్రతినాయిక (విలన్) పాత్రలో నటించారు. సినిమా విడుదల సందర్భంగా ఇచ్చిన ఒక ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆమె పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. "దశాబ్దాలుగా తమిళ చిత్ర పరిశ్రమలో కేవలం అగ్ర హీరోలకే భారీ కటౌట్లు ఏర్పాటు చేయడం చూస్తున్నాం. హీరోయిన్లకు ఇటువంటి గౌరవం దక్కడం చాలా అరుదైన విషయం. నయనతారకు 60 అడుగుల కటౌట్ ఏర్పాటు చేసిన తర్వాతే 'తాయ్ కిళవి' సినిమా కోసం సీనియర్ నటి రాధిక మేడమ్‌కు కూడా కటౌట్ ఏర్పాటు చేశారని తెలిసింది. హీరోలతో సమానంగా నటీమణులకూ కటౌట్లు పెట్టడం పరిశ్రమలో సానుకూల మార్పుకు నిదర్శనం" అని వ్యాఖ్యానించారు. ఈ సినిమా ద్వారా తన కెరీర్‌లోనే తొలిసారి ఒక భారీ కమర్షియల్ చిత్రంలో నెగెటివ్ పాత్ర పోషించే అవకాశం లభించిందని, ఇది తనకు సరికొత్త అనుభూతిని ఇచ్చిందని రెజీనా తెలిపారు. ఎప్పుడూ ఒకే తరహా పాత్రలకు పరిమితం కావడం తనకు ఎంతమాత్రం నచ్చదని, అందుకే కథల ఎంపికలో ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నానని చెప్పారు. తక్కువ సినిమాలు చేసినా సమాజంలో నిలిచిపోయే మంచి పాత్రలనే ఎంచుకుంటానని స్పష్టం చేశారు. నయనతార, ఊర్వశి, రెజీనా ప్రధాన పాత్రల్లో రూపుదిద్దుకున్న ఈ చిత్రం నవంబరు 6న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.



విఘ్నేశ్ శివన్ దర్శకత్వంలో నజ్రియ?

తెరపై క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్‌తో సినీప్రియుల్లో మంచి క్రేజ్‌ని సొంతం చేసుకున్నారు మలయాళ తార నజ్రియా. 'సూక్ష్మదర్శిని' సినిమా తర్వాత కథానాయికగా ఆమె థియేటర్లలో సందడి చేసి రెండేళ్లైంది. అయినప్పటికీ ఆమె ఎప్పటికప్పుడు కొత్త ప్రాజెక్ట్‌లను ప్రకటిస్తూ తెర వెనుక నిర్మాతగా వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. ఇప్పుడామె హీరో సూర్య సరసన 'సీన్' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించనున్నారు. ఈ నేపథ్యంలోనే తాజాగా నజ్రియా మరో తమిళ చిత్రంలో నటించనున్నట్లు తెలుస్తోంది. 'ఎల్ఐకే' సినిమాతో ఇటీవల ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయారు దర్శకుడు విఘ్నేశ్ శివన్. ఇప్పుడాయన తదుపరి చిత్రంలో కథానాయిక కోసం నజ్రియాని సంప్రదించనున్నారట. ఇప్పటికే ఇందులో నటుడు అరవింద్ స్వామి, భరత్ ప్రధాన పాత్రల్లో ఖరారయ్యారని, రొమాంటిక్ కామెడీగా రూపొందనున్న ఈ సినిమాని ప్యాషన్ స్టూడియోస్, నయనతార నిర్మాణసంస్థ రౌడీ పిక్చర్స్ సంయుక్తంగా నిర్మించనున్నాయని సన్నిహిత వర్గాల సమాచారం.



జనీకాంత్‌తో శ్రీలీల

అధికారికంగా ప్రకటించిన 'ధర్మన్' మేకర్స్!

చెన్నై/హైదరాబాద్, నవంబర్ 4 : సూపర్‌స్టార్ రజనీకాంత్ కథానాయకుడిగా ప్రముఖ దర్శకుడు అశ్వత్ మారిముత్తు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'ధర్మన్'. కమల్ హాసన్‌కు చెందిన రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, టర్మరిక్ మీడియా బ్యానర్లు ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ క్రేజీ సినిమాలో యంగ్ అండ్ ఎనర్జిటిక్ నటి శ్రీలీల కథానాయికగా నటించనున్నట్లు గత కొన్ని రోజులుగా సినీ వర్గాల్లో వార్తలు వస్తున్న సంగతి తెలిసిందే. తాజాగా ఈ ప్రచారంపై చిత్ర యూనిట్ అధికారికంగా స్పందిస్తూ ముగింపు పలికింది. శ్రీలీల ఈ ప్రాజెక్ట్‌లో భాగమైనట్లు తెలియజేస్తూ సామాజిక మాధ్యమాల వేదికగా ఒక ప్రత్యేక వీడియోను మేకర్స్ విడుదల చేశారు. ఈ చిత్రంలో సూపర్‌స్టార్ రజనీకాంత్ ఒక శక్తివంతమైన వైద్యుడి (డాక్టర్) పాత్రలో కనిపించనుండటం విశేషం. విభిన్న కథాంశంతో రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాలో టాలీవుడ్ హీరో రామ్ పోతినేని, సీనియర్ నటి సిమ్రాన్, రాశీఖన్నా, నయనతార, కమెడియన్ యోగిబాబు తదితరులు అత్యంత కీలకమైన పాత్రల్లో నటించనున్నారు. భారీ తారాగణంతో ద్విభాషా చిత్రంగా తెరకెక్కుతున్న ఈ సినిమాకి రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు. రజనీకాంత్, కమల్ హాసన్ నిర్మాణ సంస్థల కలయికలో శ్రీలీల, రామ్ పోతినేని వంటి యువ నటులు భాగం కావడంతో ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లోనూ, వ్యాపార వర్గాల్లోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి.





దియా మీర్జా దీపావళి వీడియో

బీఎంసీకి బాంబే హైకోర్టు కీలక ఆదేశాలు!

ముంబై, నవంబర్ 4 : దీపావళి పండుగను పర్యావరణ హితంగా జరుపుకోవాలని పిలుపునిస్తూ ప్రముఖ నటి దియా మీర్జా రూపొందించిన ప్రచార వీడియోను సోషల్ మీడియా ఖాతాల నుంచి తొలగించడంపై బాంబే హైకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. రాజకీయ నేతల ఒత్తిళ్లు, అభ్యంతరాల కారణంతో తొలగించిన ఆ వీడియోను తక్షణమే తిరిగి అప్‌లోడ్ చేయాలని బృహన్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) అధికారులను ఆదేశించింది. దీపావళి పండుగ వేళ వాయు, శబ్ద కాలుష్యాన్ని నియంత్రించేందుకు బీఎంసీ ప్రత్యేకంగా ఒక వినూత్న అవగాహన ప్రచారాన్ని చేపట్టింది. అందులో భాగంగా సినీ నటీమణులు దియా మీర్జా, మాధురీ దీక్షిత్, ప్రముఖ క్రికెటర్ అజింక్య రహానే వంటి ప్రముఖులతో ప్రత్యేక ప్రచార వీడియోలను చిత్రీకరించి తమ అధికారిక సోషల్ మీడియా ఖాతాల్లో పోస్ట్ చేసింది. తన వీడియోలో దియా మీర్జా బాంబే హైకోర్టు గతంలో ఇచ్చిన మార్గదర్శకాలను ప్రస్తావిస్తూ.. రద్దీగా ఉండే ప్రధాన రహదారులపై బాణసంచా కాల్చవద్దని, పర్యావరణానికి హాని కలగకుండా దీపావళిని జరుపుకోవాలని పౌరులకు విజ్ఞప్తి చేశారు. అయితే దియా మీర్జా చేసిన వ్యాఖ్యలపై మహారాష్ట్ర మంత్రి నితేష్ రాణేతో పాటు పలువురు బీజేపీ నేతలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కేవలం హిందూ పండుగల సమయంలోనే ఇటువంటి నిబంధనలు గుర్తుకొస్తాయా అంటూ విమర్శలకు దిగారు. దీంతో ఒత్తిడికి లొంగిపోయిన బీఎంసీ యాజమాన్యం తమ సోషల్ మీడియా పేజీల నుంచి ఆ వీడియోను ఉన్నపళంగా తొలగించింది. ఈ వ్యవహారంపై విచారణ జరిపిన బాంబే హైకోర్టు బీఎంసీ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజా ఆరోగ్యం, వాయు కాలుష్యంపై అవగాహన కల్పించే సాధారణ వీడియోకి మతం రంగు పులమడం తీవ్ర విచారకరమని వ్యాఖ్యానించింది. పీల్చే గాలికి, కాలుష్యానికి కులం, మతం అనే తేడాలు ఉండవని స్పష్టం చేస్తూ తొలగించిన వీడియోను పునరుద్ధరించాలని తీర్పునిచ్చింది.

This newspaper is Owned and Published by **MOHAMMED IMRAN** from H.No. 5-2-109, Osmanpura, Jagitial, Telangana, 505327. Edited by **MOHAMMED IMRAN** and Printed by MAHEERA PRINTERS at H.No.5-2-110, Near Goremiya Chowrastha, Osmanpura, Jagitial Dist. Jagitial ,Telangana-505327. **RNI REGD NO. TELTEL/2006/16536**. Contact No.+91 9848999998, editor@churakalu.com